
23-3-84
180 పైసలు

ఆంధ్ర సచిత్ర వారపత్రిక



నేను మా పళ్ల డాక్టరును అడిగా – కేవలం ఫోర్‌హాన్స్ ఎందుకు?

"ఎందుకంటే మీ చిగుళ్లు గట్టిగా వుంటే పళ్లు ఎక్కువ కాలం నిలుస్తాయి..."


మరి కేవలం ఫోర్‌హాన్స్ మాత్రమే చిగుళ్లను గట్టి పర్చగల ప్రత్యేక అస్ట్రింజంట్ కల్గి వున్నది.



ఫోర్‌హాన్స్‌లోని ఈ ప్రత్యేక అస్ట్రింజంట్ అమెరికాదేశపు ప్రఖ్యాత దంత వైద్యుడైన డా. ఆర్.జె. ఫోర్‌హాన్ ద్వారా చేర్చబడిన ఒక విశిష్ట పదార్థము. ఇది నిజంగా చిగుళ్లను గట్టి పరుస్తుంది. దీనితో మీ పళ్లకు దృఢమైన ఆధారం లభించి అవి దీర్ఘ కాలం నిలుస్తాయి.

ప్రత్యేకమైన అస్ట్రింజంట్ ఎలా పనిచేస్తుందో చూడండి.

1. ఇది నేరుగా చిగుళ్ల మీద పనిచేసి వాటిని బిగుతు చేస్తుంది.
2. వాటిని బలపర్చి, పళ్ల మీద వాటికి మంచి పట్టునిస్తుంది.
3. అందుచేత పళ్లకు దృఢమైన ఆధారం మరియు దీర్ఘ ఆయుస్సు లభిస్తాయి.



ఇక మీద నాకెపుడూ మరే టూత్‌పేస్టు వద్దు. ఫోర్‌హాన్స్ మాత్రమే కావాలి.



ఫోర్‌హాన్స్ – ఇది పళ్ల డాక్టరు సృష్టించిన టూత్ పేస్టు.

338F 244 TEL

పల్లకి

పల్లకి

పల్లకి

పల్లకి

పల్లకి

పల్లకి

పల్లకి

పల్లకి

పల్లకి

ఉత్తమాభిరుచిగల పాఠకులకు ఉత్తమపత్రిక

పల్లకి

సచిత్ర వార పత్రిక

అతిత్వరలో వెలువడుతున్న

పల్లకి

సచిత్ర వారపత్రిక
పాఠకులను సరికొత్త అనుభవం,
అనుభూతులలో ముంచెత్తే
వినూత్న పోకడలు గల రచనలకై
ఉత్తమాభిరుచిగల రచయిత(త్రు)లను
సాదరంగా ఆహ్వానిస్తోంది.

	కథలు	కార్టూన్లు
మొదటిబహుమతి	రు.3,000	రు.500
రెండవబహుమతి	రు.2,000	రు.250
మూడవబహుమతి	రు.1,000	రు.150
ప్రత్యేకబహుమతి	రు.500	రు.50
ప్రత్యేకబహుమతి	రు.500	రు.50

ఆఖరి తేదీ మే 15, 1984 - మార్చి 31.1984

ఎడిటర్
'పల్లకి' సచిత్రవారపత్రిక
6-3-1099/2
సోమాజీగూడ హైదరాబాద్-500 482

ముఖచిత్రం

ఎప్పుడూ సినీ నటీమణులే చోటు చేసుకుంటున్న ముఖచిత్రంలో ఈ వారం కృష్ణుని చాలా చక్కగా వేసిన మీకు నా థ్యాంక్స్.

వరికూటి సుబ్బారావు, మండపేట

మారేడుదళం

జొన్నలగడ్డ లలితాదేవిగారి 'మారేడు దళం' సీరియల్ బాగానే సాగుచున్నది. ప్రేమించిన దానికోసం ప్రాణమైనా వదలాలి అంటూ పేజీలకు పేజీలు రాసిన ప్రఖ్యాత రచయిత అయిన నవీన్, తనుకన్న వారిని అందరిని ఎదిరించి వదులుకొని తననే నమ్ముకుని వచ్చిన సింహాళను మొట్టమొదట ప్రేమించనట్లే ప్రేమించి ఇప్పుడు అనరాని మాటలతో ఆమెను చిత్రహింస పెడితూ ఆమెను కన్నీటికి గురి చేయటమేమిటి ? సీరియల్ ఇక ముందు ఎలా సాగుతుందో చూడాలని ఉంది.

శ్రీమతి ఎన్. సుజాతశంకర్, ఖమ్మం

కామాఖ్యాదేవి

'కామాఖ్యాదేవి' — అబ్బ ! అక్కడకు వెళ్ళినట్లు అనిపించింది చాలా వివరంగా రాశారు.

ఇలాంటివి ప్రతి వారం ఉండేటట్లు చూడండి.

శ్రీమతి పి. వివేకవతి, ఒంగోలు.



ఫిర్యాదు

2–3–84 తేది సంచికలో ఫిర్యాదు కథలో "ఓ బలమైన చేయి నా భుజమ్మీదగా పడ్డది (60 పేజీ) అని రాశారు. తరువాత వెంకటరెడ్డిలో ఎంత మార్పు ముందు ఎంత ఆరోగ్యంగా ఉండేవాడు ఇప్పుడు ఎంతబలహీనంగా ఉన్నాడు" అని రాశారు.

బలహీనుడి చెయ్యి బలంగా పడుతుందా !

కె. రామారావ్, హైదరాబాద్.

పరాగమాల

"అసలు కాపీ చెయ్యని సంగీత బ్రహ్మెవడో నాకు చూపండెవరైనా" అని అడిగారు రంగారావుగారు (పరాగమాల 2–3–84)

నాకు తెలిసినంతవరకు స్వర్గీయ రోషన్ (ఆఫ్ "బర్సాత్ కి రాత్" అండ్ "తాజ్‌మహల్" ఫేమ్) కాపీ చెయ్యలేదు.

శ్రీనివాసరావు, నిజామాబాదు.

కీర్తి ! నీకు జోహార్లు !

కీర్తి ! నీకు జోహార్లు చదివాక ఈ ఉత్తరం వ్రాయకుండా యుండలేకపోతున్నాము. పేరు కోసం ప్రాకులాడే వీరభద్రుడు వంటి వారు కూడ ఈ రోజుల్లో ఉన్నారు అంటే అతిశయోక్తి కాదు. రచయిత చాల [illegible] వివరించారు. ఒక మనిషి కేవలం ఒక కవిని పోలివుండటంతో ఎంత ఘనంగా సాగనంపేరో చెప్పేతీరు మమ్మలను బాగా ఆకట్టుకున్నది. తులసి బాలకృష్ణగార్కి ధన్యవాదాలు.

కొత్తల ప్రసాదరావు, కొత్తల గంగాభవాని, రాజమండ్రి.

జంతు హింస

డా. గుమ్మనూరు రమేష్ బాబుగారి పరిశోధనల పేరిట కొనసాగుతున్న జంతు హింస ! వ్యాసం చదువుతుంటే మనస్సు గల వారెవరైనా "అయ్యో ! పాపం నోరులేని పిచ్చి ముండలను ఎంత నిర్దాక్ష్యంగా చంపేస్తున్నారు పరిశోధనల పేరిట ఈ మనుషులు. వీరికి నిజంగా దయ, జాలి, కరుణ ఏకోశాన ఉండి ఉండదు" అని అనుకుంటారు. అన్నుకోవలసిందే. ప్రతివారం విజ్ఞానదాయకమైన వ్యాసాలను మాకందించాలని కోరుతున్నాను

రెడ్డి నాగేశ్వరరావు, మాచర్ల.

* * *

డా॥ గుమ్మనూరు రమేష్‌బాబుగారి వ్యాసం ఆధునిక మానవుడి కసాయి తత్వానికి, స్వార్థానికి అద్దం పట్టింది. మనం క్షేమంగా బ్రతకడం కోసం ఎన్ని అమాయక ప్రాణాల్ని తీస్తున్నాం ! అమాయక జంతువుల ప్రాణాలతో ప్రయోగాలు చేసే శాస్త్రజ్ఞులకో చిన్న మనవి. 'లాబ్ అనిమల్ సైన్స్'ను గూర్చి వీలైనంత ఎక్కువ తెలుసుకొని, ఆ తర్వాత ప్రయోగాలు ప్రారంభించండి. మరో ముఖ్యమైన విషయం జంతువులను చంపేప్పుడు 'హ్యూమేన్' పద్ధతులు అనుసరించడం, వాటిని పూర్తిగా సద్వినియోగపర్చుకోవడం. ఈ 'జంతుహింస'ను అరికట్టడానికి మన ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలి.

కె. శ్రీధర్‌బాబు, పల్లిపట్టు.

వ్యాసాలు

కెప్టెన్ షేక్ మౌలాలి గారి జాతీయ వ్యాసములు సీరియల్ గా ప్రచురించగలరని విజ్ఞప్తి. డాక్టరు క్రిష్ణకుమారిగార్కి, మీకు కృతజ్ఞతలు.

శ్రీపాదు ప్రద్యుమ్నావారి, ఆత్మకూరు.

(74 వ పేజీ చూడండి)

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938–1972]

శుక్రవారం : 23–3–'84

రుధిరోద్గారి నామ సం. ఫాల్గుణ బ. షష్ఠి

సంపుటము 76 : సంచిక 28

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల రు. 1-80

ఆరు మాసాల చందా రు. 46-80

పోస్టులో ఏడాదిచందా రు. 101-40

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం. విజయవాడ-520 003.

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

నటి విజయశాంతి


(ఫొటో : యు. కె. రెడ్డి)

కథలు :


సీరియల్ నవలలు :

వ్యాసాలు, శీర్షికలు :

లోకం పోకడ-ఊకేమెన్



స్వేచ్ఛ అంటే ఏమిటి? లేదా జవాట్కర్ కథ



స్వేచ్ఛ అంటే ఏమిటి ? ఎవరికయినా ఏదయినా వినటానికి ఇష్టం లేకపోతే వాళ్ళకి అదే చెప్పటానికి వీలు ఉండటమే స్వేచ్ఛ! ఈ నిర్వచనం జార్జి ఆర్వెల్‌ది. స్పెయిన్‌అంతర్యుద్ధం జరుగుతున్నప్పుడు ఆయన ''హోమేజిటు కటాలినా'' అనే పుస్తకం రాశాడు. ఆ సందర్భంలోనే ఈ మాట అన్నాడు ఆయన నిర్వచనం నచ్చనివాళ్ళు చాలామంది. అందుకనే ఆర్వెల్‌కి ఆ పుస్తకాన్ని వేసేవాళ్ళు ఎవరూ దొరకలేదు. భారతదేశంలోని పరిస్థితులు కొంచెం వేరేగా ఉన్నాయి. ఇక్కడ స్వేచ్ఛ అంటే అధికారంలో ఉన్నవాళ్ళకి (ప్రభుత్వంతో సహా) వాళ్ళకి ఇష్టంలేనిది చెప్పగలగటమే


తమకి ఇష్టంలేనిది ఏదయినా వింటే లేదా చదివితే అధికారంలో ఉన్నవాళ్ళు ఏమి చేస్తూ ఉంటారు ? మీ జీవితం దుర్భరం చేస్తూ ఉంటారు. ''న్యూ స్టేట్స్‌మన్'' పత్రిక సంపాదకుడు కింగ్‌స్‌లీ మార్టిన్ అప్పటిలో ఆర్వెల్‌కి అదే పని చేశాడు. మన దేశంలో మార్టిన్‌లాంటి మనుషులులేరనా ? ఉన్నారు. జవహర్‌లాల్‌నెహ్రూ యూనివర్సిటీ నిండావాళ్ళే. ఈ విశ్వవిద్యాలయం ఒక మేధావుల కేంద్రంగా పేరు పొందింది దానిమీద జనం కోట్లు కర్చు చేస్తారు. ఈ విద్యాలయం సాలుకి ఒక పుస్తకం కూడా సృష్టించలేకపోతోంది (అంటే అందులో పని చేసేవాళ్ళు రాసే పుస్తకం అన్నమాట.) ఒకవేళ ఎవరయినా అక్కడ, పని చేస్తూ ఒక మంచి పుస్తకం రాస్తే అతన్ని అక్కడి నుంచి తరిమేస్తారు.

డాక్టర్ కె. ఎస్. జవాట్కర్ జె. నె. వి.లో అంతర్జాతీయ సంబంధాల విభాగంలో ఎసిస్టెంట్ ప్రొఫెసరుగా ఉంటున్నారు ఆయన డీగోగార్సియా ద్వీపం చరిత్ర మీద పరిశోధనలు జరిపి ''ఈ ద్వీపం ఎవరిదయినా అయితే భారతదేశానిదే'' అని వాదిస్తూ ఒక పుస్తకం రాశారు. ఈ వాదం జె. నె. వి. అధికార వర్గానికి ఇష్టంలేదు డీగోగార్సియా ప్రసక్తి వస్తే అమెరికా సంయుక్త రాష్ట్రాలని ఖండించాలి. ఇదీ వాళ్ల ఉద్దేశం. జవాట్కర్ లాంటి జాతీయవాది వాళ్లకి ఎలాగ నచ్చుతాడు ? ఆయన్ని ఉద్యోగంలోంచి తీసెయ్యటం కష్టం అందుకని ఇంఫాల్(!) లో ఒక పోస్టుగ్రాడ్యుయేటు కేంద్రాన్ని సృష్టించి అతన్ని అక్కడికి వెళ్ళమని అడిగారు. కొన్ని సంవత్సరాల తరువాత ఆ పోస్ట్‌గ్రా కేంద్రాన్ని మణిపూర్ విశ్వవిద్యాలయానికి అప్పచెప్పేశారు డాక్టర్ జవాట్కర్ కొత్త విశ్వవిద్యాలయానికి మారిపోయాడన్నమాట ! ఇంతకీ జవాట్కర్ చేసిన పాపం ఏమిటి ? జ. నె. వి. ఆంతరంగిక రాజకీయాలలో తల దూర్చనన్నాడు, అంతే. అందుకని అతన్ని ఇలాగ వదిలించుకున్నారు ..

రష్యా అసమ్మతి రచయిత సోల్జెనిట్సిన్ ''గులాగ్'' అనే మాటకి మంచి ప్రాచుర్యం వచ్చేట్లు చేశాడు. భారతదేశంలో జ. నె వి. వాళ్ళు జవాట్కర్‌ని ఒక ''గులాగ్''కి బహిష్కరిద్దామనుకున్నారు. వారి ఎ. ', సాగలేదు. జవాట్కర్ కోర్టుకి ఎక్కాడు. ఢిల్లీ హైకోర్టు వాళ్ళు అన్నారు : ''డాక్టర్ జవాట్కర్ ఇంకా జ. నె. వి. ఉద్యోగిగానే ఉన్నాడు. ఆయన బానిస కాదు ఆయన అనుమతి లేకుండా ఇంకొక విశ్వవిద్యాలయానికి మార్చేందుకు'' అని. జవాట్కర్ కోర్టులో తనే వాదించుకున్నాడు బ్రిటన్‌లో 1833 లో బానిసత్వం రద్దు అయింది, ఇలాగ పెరటిదోవ ద్వారా భారతదేశంలోకి బానిసత్వాన్ని ప్రవేశ పెట్టరాదు, అన్నాడు

జె. నె. వి. ఇంతటితో ఆగి ఉండవచ్చు ఆ విద్యాలయం అధికారులకి డబ్బు కొరతలేదు ఉన్న డబ్బుని తమ తోటి ఉద్యోగిని పంపించి వెయ్యటానికి వాడటం అనవసరం. ఇంతకాలం పని చేసినవాడిని ఈ విధంగానా సత్కరించటం ? ఊరుకోకుండా జ నె. వి. వాళ్ళు హైకోర్టులో ''పేటెంట్‌అప్పీల్'' వడేశారు. [అదేమిటో నాకు అంత బాగా తెలీదు !] హైకోర్టువారు ఈ అప్పీలునీ కూడా కొట్టివేశారు. ఇద్దరు జడ్జీలు [శ్రీయుతులు కపూర్, రంగనాధన్‌లు] తమ తీర్పులో చట్టప్రకారంగా తప్ప జవాట్కర్ ఇంకా జ. నె. వి. ఉద్యోగంలో ఉన్నారనీ, ఆయనని ఉద్యోగంలో నుంచి తీసివెయ్యటానికి వీలులేదనీ, ఆయనని మణిపూర్‌గాని మరెక్కడికయినాగాని బదిలీ చెయ్యటానికి వీలులేదనీ అన్నారు.

జవాట్కర్ చాలా శాంత స్వభావం కల యువకుడు. కష్టపడి చదువుకున్నాడు అతని తండ్రి మహారాష్ట్రలో ఒక మాధ్యమిక పాఠశాలలో టీచరుగా ఉండేవాడు. జవాట్కర్ తన కేసుని తనే వాదించుకున్నాడు. రెండేళ్ళ జీతం రావటం ఆగిపోయింది కనుక మధ్యలో తన ఇంటి సామానుని అమ్ముకోవలసి వచ్చేది అతనికి. ఎలాగో అలాగ రోజులు గడుపుకున్నాడు. కోర్టువారు అప్పీలు కాలంలో జీతం రావాలని అన్నారు కాని జె. నె. యూ. వాళ్ళు అతనికి మార్చి 1983 నుంచి మాత్రం నెలకి రు. 1500 ఇచ్చారు.



ఈ వ్యవహారం ఇంతటితో ఆగవలసింది. ఆగదనుకుంటాను. జె. నె. వి. వాళ్లు సుప్రీమ్ కోర్టుకి,అప్పీలు వేసేట్లున్నారు. అసలు వాళ్లకి కేసులేదు. ప్రజల సొమ్ముని అప్పీళ్లమీద దండగ చెయ్యరాదని కోర్టు స్పష్టంగా ఆదేశం ఇచ్చింది. కాని, వినేవాళ్లు ఉండాలి కదా ! డబ్బు కావలిసినంత ఉంది. దానితో ఉద్యోగులని హింస పెట్టవచ్చు. ఆ ఉద్యోగి ఒక విశిష్టోపాధ్యాయుడయితే మాత్రం ఏమిటి ? జె. నె. వి. ఈ విషయంలో అంతరాత్మ మాట వినటంలేదు. అంతరాత్మ అనేది ఉంటే కదా, వినటానికి ?

జె. నె. వి. ఇంత పనికిమాలిన సంస్థగా ఎలాగ తయారయిందో నాకు ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది. ఈ సంస్థ స్థాపించి ఎన్నేళ్లయిందో నాకు తెలీదు — ఆ విశ్వవిద్యాలయం వయిస్ ఛాన్సలర్‌ని ఎవరయినా పట్టుకు బాదినప్పుడే జె. నె. వి. వార్తలు తెలుస్తాయి. ఈ కాలంలో ఆ సంస్థ నుంచి ఎన్ని గ్రంధాలు వెలువడ్డాయి ? అతి సాదా రకంవి ఒక అరడజను ఉంటాయా ? అన్నట్టు మర్చిపోయాను ! ఆ సంస్థ అధికారులూ వగయిరా మన విదేశీ వ్యవహారాల విభాగం తరపున భూగోళం చుట్టూ విలాస యాత్రలు వెళ్లి వస్తూ ఉంటారు. టోక్యో, రియోడిజెనయిరో మొదలయిన చోటులకి— కాని డబ్బు పుష్కలంగా లభిస్తే ఎవరు వెళ్లలేరు ? జె. నె. వి. చెయ్యగలిగినదెల్లా బాగా పని చేసే జవాట్కర్ లాంటి వాళ్ళని హింస పెట్టడమేనా ?

ఇంతకీ జవాట్కర్ ఏమి చేశాడని అతనికి ఈ బాధ ? అతను జె. నె. వి. లో పాఠాలు చెప్పాడు. అతనికి రెండు మాస్టర్స్ డిగ్రీలు ఉన్నాయి. ఒక డాక్టరేటు ఉంది· ఎన్నో వ్యాసాలు రాసి ప్రచురించుకున్నాడు. డీగోగార్సియా మీద పుస్తకం రాశాడు. ఇంకా రెండు గ్రంధాలు రాసి ఉంచాడు. అతని దురదృష్టం ఏమిటంటే, జె నె. వి. లో పలుకుబడి కల ''గోముఖా''లకి జవాట్కర్ ఎన్నుకున్న విషయాలంటే ఇష్టం లేదు. అతను ఆఫ్గనిస్తాన్‌మీదా, తటస్థ విధానంపయినా పుస్తకాలు రాస్తున్నాడు. జె. నె. వి. అధిపతులకి ఈ విషయాలు రుచించవు. రెండవ ప్రపంచ యుద్ధం ముందు ఆర్వెల్ స్పెయిన్ అంతర్యుద్ధంమీద రాస్తేనంటే బ్రిటన్‌లో కొందరికి రుచించలేదు. అలాగే ఇప్పుడూను. ఆర్వెల్ 'ఎనిమల్ ఫార్మ్' అనే పుస్తకం రాశాడు. అందులో వ్యక్తి స్వేచ్ఛలకి ఎలాగ అంతరాయాలు కలిగించవచ్చునో చక్కగా చెప్పాడు.

జవహర్‌లాల్‌నెహ్రూ విశ్వవిద్యాలయాన్ని నియంతలు వశపరుచుకున్నారు కాని చివరికి జవాట్కర్ గెలిచితీరుతాడని నేను నమ్ముతున్నాను. ★

వ్యక్తిగతం



షేక్ మునీర్ ఇస్మాయిల్ వయసు 27 మాత్రమే. కాని నేరస్తుడుగా పేరు పొందాడు.

ఆరు హత్యా ప్రయత్నాలూ, మూడు సారులు పోలీసుల మీద చెయ్యిచేసుకోవటం, పదకుండు దొంగతనాలూ, ఎన్నో గొలుసు అపహరణలూ—వీటి తాలూకు ఆరోపణలు అతని మీద ఉన్నాయి. అతనిమీద ఫిర్యాదు చేసినవాళ్ల చేతివేళ్లు నరికివేసే అలవాటు ఇతనికి ఉండేదిట... ఫ్రిబవరి 17 నాడు అతనూ, అతని అనుచరులూ కలిసి పోలీసులతో తుపాకి యుద్ధానికి దిగగా అతనిని పోలీసువారు తుపాకీతో కాల్చి చంపేశారుట..



ఉల్హాస్ నగర్ [బొంబాయి] లోని సంఘ విద్రోహ శక్తుల, దొంగ రవాణాదారుల కార్యకలాపాలని బయట పెట్టినందుకు బ్లిట్జ్ ఉపసంపాదకుడు శ్రీ ఎ. వి. నారాయణ్ దారుణంగా హత్య చెయ్యబడ్డారు. అతి భయంకరమైన ఈ మాఫియా మురాకి పోలీసు, రాజకీయ, అధికార వర్గాలలోని కొందరు ప్రముఖుల అండదండలు ఉన్నాయట.



రక్తంలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే థైమస్ [టి] కణాలు లేకుండా పుట్టిన డేవిడ్‌ని హూస్టన్ లోని వైద్యులు క్రిమి రహితమైన ఒక ప్రత్యేక అరలో 12 సంవత్సరాలు పెంచారు. అతని రక్తంలో టి. కణాల ఉత్పత్తి జరగటానికి అతని సోదరి ఎముకలమూలుగని డేవిడ్‌కి మార్పిడి చేశారు. అయినా ఫలితం దక్కలేదు. బయటి ప్రపంచంలో అడుగుపెట్టిన స్వల్ప కాలంలోనే డేవిడ్ మరణించాడు. అమెరికాలో ఏటా ఇలాంటి వారు 60 నించి 100 మంది దాకా, పుడుతూ ఉంటారట. కానీ రెండేళ్లు నిండకుండానే చనిపోతూ ఉంటారు ...

వారఫలం

23-3-1984 శుక్రవారం మొదలు 29-3-1984 గురువారం వరకు

♈ మేషం: వారమంతా ఉత్తమంగా జరిగిపోతుంది. నూతన ప్రయోగాలు వ్యాపార రీత్యా చేయనున్నారు. కళా సాహితీ రంగాలలో మీకు ప్రసిద్ధి ఏర్పడుతుంది. నటన, సంగీతములందు ప్రావీణ్యం ఉన్న వారికి మేలేదో జరుగనున్నది. స్త్రీలకు ఉద్యోగమందు పెంపు గల వారం.

♉ వృషభం: అనుకోకుండా బంధువులు గాని, మిత్రులు గాని, పరిచితులు గాని, యింటికి రానున్నారు. వ్యవహారం ఏదయినా ఉంటే సామరస్యంగా పరిష్కరింప బడగలదు. ఉద్యోగం పోయింది గదా! అయినా యత్నిస్తే ఆశాజనకమైన వారమే. స్త్రీలకు. విలాస వస్తు సేకరణ, విందు వినోదాలతో కాలక్షేపం.

♊ మిథునం: దూర ప్రాంతాలకు పుణ్య కార్యాల నిమిత్తం కొందరు ప్రయాణించనున్నారు. వస్తు విక్రయమునకు గాని, కొనుగోలునకు గాని కొందరకు అవకాశమున్నది. బంధు విరోధం కనిపించవచ్చు. వ్యాపారంలో గాని, ఉద్యోగ రీత్యా గాని నూతనమార్గాన్వేషణకు అవకాశమున్నది. స్త్రీలకు: వస్తుసేకరణ, ధనలబ్ధికి వృత్తి పెంపునకు అవకాశం.

♋ కర్కాటకం: దూరదృష్టితో ఒకానొక విషయం సానుకూలం గావించుకో గలుగుతారు. మీకు గల జ్ఞానం భాసించ గలదు నటనా సామర్థ్యం గలవారికి చలన చిత్ర రంగంలో సదవకాశాలు లభిస్తాయి. అంతో యింతో చేతికి ద్రవ్యం చిక్కే అవకాశమున్నది. స్త్రీలకు. గృహాలంకరణతో, శుభకార్య ప్రస్తావనలతో, ఉద్యోగమందు అభివృద్ధితో వారం ముగుస్తుంది.

♌ సింహం: భూములో, విలువ గల వస్తువులో, కడకు నూతన వస్త్రాలో కొనుగోలు చేయగలుగుతారు. కొన్ని వ్యవహారాలు 'కోర్టు' మూలంగా పరిష్కరింపబడగలవని గ్రహింపగలుగుతారు సభా కార్యక్రమమందు కొందరకు గౌరవ ఏర్పడగల అవకాశమున్నది స్త్రీలకు చేసిన ప్రయత్నమే, ఉద్యోగ రీత్యా మరలా చేయ వలసి వస్తుంది. కించిత్తు ఆదాయమున్నది.

♍ కన్య: అవసరాలు నిరభ్యంతరంగా తీరిపోగలవు. వివాహ నిమిత్తం దూర ప్రాంతాలకు ప్రయాణించి సానుకూలం గావించుకోగలరు. ఊరక కాలం వ్యర్థం చేసికొనే సన్నివేశాలుంటాయి, జాగ్రత్త! అంతేగాక చిన్న పెద్ద ప్రయాణాలందు ప్రమాద సూచన కూడా కనిపిస్తున్నది స్త్రీలకు. ఆరోగ్యమందు, వృత్తియందు, రాకపోకలయందు యిబ్బందులుండగలవు, గమనించాలి

♎ తుల: వృత్తిలో మీరు గావించే యత్నాలు సుకరంగా సాగిపోతాయి మంచి హోదాలో ఉన్నారు గదా! ఏ మాట చెప్పినా, ఏ కార్యం చేసినా ఆలోచించి గదా! చేయాలి. ఉద్యోగం సునాయాసంగా చిక్కుతుంది స్త్రీలకు నాలుగు విధాలా మేలు చేకూరుతుంది ధన లబ్ధి గలదు.

♏ వృశ్చికం: ఇతరులకు సాయ పడటంతో, పరోపకార దృష్టితో వారం వ్యయిస్తారు. మంచిదే గాని, కుటుంబ పోషణం మీద కూడా దృష్టి ఉంచాలి వ్యవహార రంగాన ఏదో మేలు సమకూడనున్నది. చిత్తశుద్ధితో చేసిన కార్యం మీకు లాభిస్తుంది. స్త్రీలకు. గృహ కార్య భారంతో వారం జరిగిపోతుంది.

♐ ధనుస్సు చేసిన పనినే మరలా చేయ వలసిన పరిస్థితులు ఏర్పడుతాయి, అనవసరంగా ధనం వ్యయించ వలసిన పరిస్థితులుంటాయి. రాజకియంగా పెద్దగా మేలు ఆశించటం అనవసరం వృత్తి యందు అంతో యింతో పెంపు కనిపిస్తుంది. స్త్రీలకు. బంధు విరోధం, ధనాభావం, వ్యవహారంలో ఆశాభంగం అనుభవనీయం.

♑ మకరం: మిత్రులలో గాని చుట్టు ప్రక్కల వారితో గాని గొడవలు రాకుండా చూచుకోవాలి. ఒకానొక విషయంలో 'అనుకొన్నదొకటి అయినదొకటి' గా గ్రహిస్తారు మిత్రులకు దూరమయ్యే పరిస్థితి ఉంటుంది, జాగ్రత్త! స్త్రీలకు ఉద్యోగ వృత్తులందు పెంపు కనిపిస్తుంది


♒ కుంభం వ్యాపారం చేసే లాగైతే కించిత్తు వృద్ధి కనిపిస్తుంది మీ వ్యవహారాలకు, కార్య కలాపాలకు విపరీత భాష్యం చెప్పే వారుంటారు, గమనించి మెలగాలి సుఖ శాంతులకు లోపం రాదు గృహానందానికి యిబ్బంది లేదు. చేసిన ఉద్యోగ యిత్నం కొనసాగుతుంది ఆదాయంలో కూడా కించిత్తు వృద్ధి చెప్పదగిన వారం. స్త్రీలకు. ధన లబ్ధి. యత్న కార్యసిద్ధి.

♓ మీనం. చాల కాలంగా ఒక రేవునకు రాక వేధించే వ్యవహారం, ఈ వారం సానుకూల పడగలదు కాని వారి వలన యిబ్బందులుండగలవు. గృహ విస్తరణ మందు అనుకూలత సాధించ గలుగుతారు. నూతన మార్గాన ఆదాయం ఆశింప దగిన వారం. స్త్రీలకు. ప్రయాణానుకూలత, ఉద్యోగమందు అనుకూలమైన మార్పు సంభవం, గమనించాలి

— విద్వాన్ కోటు సత్యరంగయ్య శాస్త్రి *



ఒక్క మాత్రయే
"గుటుక్"
తలనొప్పి పోయే
చటుక్!"
క్రొత్త
ఎక్స్‌ట్రా స్ట్రెంగ్త్
ఆస్ప్రో
600
EXTRA STRENGTH
ASPRO 600
strong sure speedy
మునుపెన్నడూ లేనంత బాధ నివారణ శక్తి... కేవలం
ఒక్క బిళ్ళతో
వెంటనే పూర్తి ఉపశమనం యివ్వడం కోసం
అధిక శక్తి గల ఎక్స్‌ట్రా స్ట్రెంగ్త్ ఆస్ప్రో 600 లో వుంది, ప్రపంచంలోకల్లా అత్యంత
ప్రభావంతో తలనొప్పిని పోగొట్టే నివారణ పదార్థం 600 మి.గ్రా.
ఎక్స్‌ట్రా స్ట్రెంగ్త్
ఆస్ప్రో 600
శక్తితో, తప్పనిసరిగా, తొందరగా పనిచేస్తుంది.



మావూరికి సొతంత్రం రాలేదు

— మహీపాల్

ఊరు అప్పుడే నిద్రనుండి మేల్కొంటుం దేమో !

మబ్బును చీల్చుకుంటూ కాంతి నెమ్మదిగా ఆవరించుకుంటోంది. ఆకాశంలో మ బ్బు లు తేరుకొని హడావిడిగా వేగంగా పరిగెడుతున్నాయి. పక్షులు పట్టలేని సంతోషముతో సంగీతాన్ని తలపించటం ప్రారంభించాయ్. ఎప్పుడూ లేని కాంతి ఈ రోజు మరీ దిట్టంగా ఉంది. చిరు నవ్వును చిలకిస్తున్నవాడిలా ఆకాశాన్ని ప్రాకుతూ "ఈ రోజు నన్ను చూడండి" అనుదీమాతో బంగారు తీగల్లా కాంతి రేఖలు ప్రసరింపజేస్తు వస్తున్నాడు.

"జై బోలో స్వతంత్ర భారత్‌కి జై" అన్న నినాదాలతో ఆ వూరు కలకలలాడుతోంది. మూడు రంగుల ముచ్చటైన జెండాలు వీధి వీధినా రెపరెపలాడుతున్నాయి. ఈ రోజు ఆకాశం మరింత పెద్దదిగా విశాలంగా, చూడ ముచ్చటగా కన్పిస్తోంది. చిన్న చిన్న పిల్లలంతా క్రొత్త బట్టలు వేసుకోని కేరింతలు కొడుతూ, మురిసి పోతూ వేగంగా ఊరి చివరనున్న స్కూలు వైపు పరిగెడుతున్నారు. ఆ వూరి పెద్ద బజారు రంగు రంగుల కాగితాలతో అమర్చి యున్నది. మైకులో దేశభక్తి గేయాల హోరు బాగా వినవస్తున్నాయి. బహుశా అక్కడే ఉందేమో ఆ గ్రామ పంచాయతీ కార్యాలయం, చిన్న పెద్దా అంతా అక్కడ చేరి గుంపుగా ఏవో సన్నాహాలు చేస్తున్నారు. నిగనిగలాడే తెల్లని బట్టల్తో ఏవో కబుర్లు చెప్పకుంటున్న గ్రామ పెద్ద మనుషులుకూడా కనిపిస్తున్నారు. బుర్రమీసాలతో గాంభీర్యాన్ని ప్రదర్శించే కళ్లతో, చేతిలో ఓ కర్రతో నెమ్మదిగా వస్తున్న ఆ ఖద్దరు బట్టల నాయకుడు. అతను రాగానే కూర్చున్న వారంతా లేచి వంగి నమస్కారాలు చేశారు. బహుశ అతడు సర్పంచ్‌గారేమో అతనే స్వయానా ఆ గ్రామ పంచాయతీ కార్యాలయమున అ లం కా రాలు చేయించడం ప్రారంభించాడు. ఇంతలో పెద్ద నినాదాలతో ఊరేగింపుగా, బ్యాండ్ మేళాలతో, మధురమైన దేశభక్తి గేయాలు పాడుకుంటూ బడిపిల్లలంతా వరుసకు ముగ్గురు చొప్పున నిలబడి బారులు తీరి వస్తున్నారు. ఆ బడి పిల్లలు పాటలు వినాలని, గుమ్మాలుదాటి పరుగున వచ్చి చూస్తున్నారు ఆడపడచులు. వారి ఊరేగింపు పాటల్ని చూసి ముచ్చటపడిపోతున్నారు.

వరుసగా బారులుతీసి ఆడుతూ పాడుతూ పోతున్న ఆ బడి పిల్లల్ని ఆశగా చూశాడు. "నేనుకూడా వాళ్లతోపాటు ఉంటే ఎంత బావుండు, నేనుకూడా కొత్త బట్టలు వేసుకొని వారి వెంట బడికెళితే ఎంత బావుండు, నేను కూడా వాళ్లతోపాటు ఆడుతూ పాడితే మరెంత బావుండో, నేనుకూడా వాళ్ళతోపాటు పిప్పర మెట్లు తింటే ఎంతో బావుండేది" అలా ఆశల పల్లకీలో విహరిస్తూ ఊరేగింపుగాపోతున్న ఆ బడి పిల్లలనంతా ఆత్రుతతో, ఆనందముతో చూస్తున్నాడు. అతనిక్కూడా ఆడాలని వుంది. పాడాలని వుంది. కాని మళ్ళీ ఏదో నిరాశ అతన్ని దహించివేస్తుంది వాళ్లతోపాటు బడికిపోవాలని ఆశ మరింత రెచ్చిపోతోంది.

"ఈ రోజు ఏదో పండగంట, అందుకు వాళ్లు ఆడుతున్నారు పాడుతున్నారు. మరి నేను పండగ రోజుకూడా !" తననుతాను ఒకసారి ఎగాదిగా, ఆ చిరిగిపోయినబట్టల్నిచూసి నిరుత్సాహ పడిపోయాడు.

"ఈ పండగ మనకి కాదేమో, పెద్ద పెద్ద దొరబాబులకు, పెద్ద పెద్ద దొరకొడుకులకేమో" అనుకున్నాడు. మళ్లీ ఆ అనుమానాన్ని నెట్టి వేసుకుని "నె నె లా గై నా ఈ రోజు పని మానేస్తాను" తన మనసులో నిర్ధారించుకొని ఊరికి ఎడమ ప్రక్క దిశలో ఉన్న గుడిసెలవైపు పరుగు తీసాడు.

"అయ్యా, అయ్యా !" బాగా పరిగెత్తి అలసిపోయినవాడిలా దమ్ముతీస్తు ఆదుర్దాగ అరచుకుంటూ పూరిగుడిసె దగ్గరకు చేరు కున్నాడు. పూరిగుడిసెపై తాటి కమ్మలను సర్దుతున్న ఆ నడివయసు మనిషి వీడివైపు కంగారుగా చూశాడు.

"ఏంట్రా మళ్లీ ... ఇంకా నువ్వు పనికి పోలేదంట్రా ? ఓరి ఎదవ సన్నాసి ... ఈడికే పొద్దుపోనాది, ఆ దొరసానమ్మగోరు తిడతారు ఎళ్లెళ్ల" కసిరాడు.

ఆ మాటలు విన్న ఈ చిన్నారి మనసు చిన్నబోయింది. వాడి మొహం పేలబోయింది. ఏదో చెప్పబోయాడు. ఏదో అడగాలని ఆశతో అతనివైపు చూశాడు.

"అది ... అది... అదికాదయ్యా . ఇవ్వాళ ఏదో పండగంట ?" భయంతో పూర్తిగా చెప్పలేకపోతున్నాడు. అందుకు సమాధానంగా ఆ మనిషి పక్కున నవ్వాడు.

"ఏం పండగయితే నీకేట్రా, ఆ పండుగ మనక్కాదెసె ఎళ్లెళ్ల, దొరసానమ్మగారు కోప్పడతారు" ఉరమాయించాడు

"అదికాదయ్యా .. ఆ బడి పోరగాళ్లు కూడా మంచి బట్టలేసుకొని ఆడుతూ పాడుతూ పోతున్నారుగా .. ఇదేం పండగయ్యా" మళ్లీ అడిగాడు వణుకుతున్న కంఠముతో. ఈసారి మల్లిగాడివైపు కోపంగా చూశాడు. ఆ కోపాన్ని అంతలో దిగమ్రింగాడు.

"ఈవేళ సొతంత్రం వచ్చిందంటా ...


[illegible] ఆ తల్లి దొరలను తరిమికొట్టి మన కష్టాలు లేకుండా చూసిన రోజన్నమాట. అందుకే, అందరూ ఈరోజు పనులు మానేసి ఇంటిదగ్గరే ఉంటారు. మరి బడిపిల్లలేమో ఆటలాడుతూ, పాటలు పాడతారు. ఇవన్నీ నీకెందుకురా. నువ్వెళ్లరా .. ఏ పండగయినా మనకు రెక్కాడితే గాని డొక్కాడదు. ఆ దొరసానమ్మగారు కోపమొస్తారు ఎళ్లరా!'' బతిమిలాడినట్టు చెప్పాడు.

''అయ్యా... '' చెప్పలేక సందేహపడుతూ గాబరాగా చూస్తున్నాడు.

''మళ్ల ఎందిరా ... నీకియ్యాల ఏం రోగం పుట్టిందిరా?'' తాటి కమ్మలను సర్దేసి మల్లిగాడివైపు కోపంగా చూశాడు.

''అయ్యా ... ఇవేళ నేను కూడా .. !'' భయంగా అతనివైపు చూస్తూ నోరు మెదప లేకపోతున్నాడు.

''ఏంటీ తొరగా సెప్పేసావరా ?''



''అయ్యా ఈవేళ నేను కూడా పనికి మానేసి ఆడుకుంటానే !'' ఎలాగో చెప్పేసి అక్కడ్నుంచి పరుగుతీసి, వాకిట్లో కళ్లాపు చల్లుతున్న తల్లిచాటు కెళ్లాడు. ఈ మాట విన్న వాడయ్య కోపంతో రెచ్చిపోయాడు

''ఓరి ఎధవ సన్నాసి ... ఈ వేళ పనికి వెళ్లకపోతే ఆ దొరసానమ్మగారు రోజువేసే ఆ రెండు ముద్దలు కూడా ఎయ్యరు !'' ప్రక్కనే ఉన్న తాటిమట్టను చేతిలోకి తీసుకున్నాడు.

తల్లి చాటున దాక్కున్న మల్లిగాడు గజగజ వణికిపోతున్నాడు. తల్లి కాళ్లను దగ్గరగా అదిమి పట్టుకున్నాడు. తనవేపే వస్తున్న అయ్య వైపు చూసి భయంతో కంపించిపోయాడు.

''అమ్మా... అమ్మ... అయ్య కొడ్తందుకు వత్తన్నాడే... అమ్మ.. కొట్టొదని సెప్పవే.. నేనీ రోజు పనికి పోనే !'' గోలగా అరుస్తున్నాడు. లేని దుఃఖాన్ని తెచ్చుకొని కేకలు వేస్తున్నాడు.

''నీకిదేం పోయే కాలంరా... ఈరోజు పనికి పోనంటావే. ఈవేళ ఆ దొరసానమ్మ గారింట్లో పని శానా ఉంటది. ఏదో ఆ దొరసానమ్మగారి చలవవల్ల ఈ నీడలో డొక్కలు నిండుతున్నాయి. నువ్ పన్కెళ్లు నాన్న'' కళ్లాపు బుడ్డిని ప్రక్కనే వున్న ఎర్రమట్టి దిబ్బపై పడేసి వాన్ని బుజ్జ గించపొగింది.

''వాడ్ని బుజ్జగిస్తావేందే .. వాడివ్వాళ పన్కెళ్లకపోతే ఈ తాటిమట్ట ముక్కలై పోదూ !'' ఇంకా దగ్గరకు వస్తున్న అయ్యను చూసి సింహం చేతిలో చిక్కిన మేకలా వణికి పోతున్నాడు. తన మొండిపట్టు విడవకుండా—

''మరి .. ఈరోజు అందరు పనులు మానేస్తారు కదనే. నేను కూడా ఎందుకు మానెయ్యకూడదే !'' ఎదురు ప్రశ్న వేశాడు వణుకుతున్న కంఠముతో.

''నువ్ పక్కకు తొలగవే .. వాడేమో శానా శానా మాటాడుతున్నాడు '' తల్లిచాటున దాగివున్న వాణ్ణి ఒక చేత్తో బయటికి గట్టిగా లాగాడు.

''నేను పోను...ఈ వేళ నేను పనికి పోను నేను కూడా ఈవేళ ఆడుకుంటాను!'' ధైర్యాన్ని కూడదీసుకొని అరుస్తు అన్నాడు మల్లి అంతే, అతని వీపుపై తాటిమట్ట దెబ్బలు మారు మ్రోగుతున్నాయి. ఆ దెబ్బలకు తాళలేక గావుకేకలు పెడుతున్నాడు.

''నేనీ వేళ పనికి పోను !'' అంటూ ఎడుస్తాడేతప్ప ''పనికి పోతా'' అని అనటంలేదు. కోపాన్ని మరింత రెట్టింపు చేసుకొని ఆ మనిషి దయ, జాలి విస్మరించి రాక్షసుడిలా చావబాదు తున్నాడు.

మల్లిగాడు పెడుతున్న ఆ చావుకేకలకు చుట్టుప్రక్కల గుడిసె వాసులు కూడా పోగయ్యారు, కాని ఎవ్వరూ అడ్డు తగలడం లేదు. వాడి బాధను చూడలేక పోయింది ఆ కన్న కడుపు. మొత్తుకుంటూ వచ్చి అతని చేయి పట్టుకుంది. ఆమెను కూడా రెండు దెబ్బలేసి పక్కకు నెట్టివేసాడు. అయినా మల్లి పట్టు విడవకుండా అలాగే అరుస్తూ ఏడుస్తున్నాడు.

''వద్దయ్య ... ఆడ్ని కొట్టకు... ఆడ్ని చంపకు !'' మళ్లీ వచ్చి అతని కాళ్లపైబడి గట్టిగా పట్టుకుంది.

''ఏమిటే... వాడ్ని ఎనకేసు కొస్తావ్ ... వాడేమో పనికి పోనంటాడు. ఇదేంటే మీ తల్లీ కొడుకుల వరస!'' కోపం తాపమెరుగదు అన్నట్టు మల్లిగాడ్ని వదిలేసి ఆమెను కొట్టడం మొద లెట్టాడు ఆ చుట్టు గూడిన వాళ్లు ఇక చూడలేక అతన్ని పట్టుకొని ఎక్కడికో లాక్కుపోయారు. ఆడి తల్లి ఏడుస్తూ గుడిసె లోపలికెళ్లింది. మళ్లీ కొడ్తాడేమోనని భయపడ్డ మల్లిగాడు ఊరి బయటకు పరుగుతీసాడు.

* * *

స్కూలు ఆవరణ అంతా ఆటపాటలతో కళకళలాడుతుంది. ఆవరణ మధ్యలో రెపరెప లాడుతున్న ఆ మూడు రంగుల జెండాతో మరింత వెలుగునిస్తుంది ఆ స్కూలు. ఆ స్కూలు గదుల ముఖద్వారం దగ్గర రంగు రంగుల కాగితాలు అతికించబడి వున్నాయి. కాగితాల తోరణాలు ఆ ఆవరణ మధ్యలో ఉన్న జెండా చుట్టూ గుండ్రంగా కట్టబడి మరింత ఆకర్షణీయంగా కనపడుతుంది. ఆ ఊరులో

మావూరికి సౌతంత్రం....

ఉన్న చిన్నా పెద్దాఅంతా గుంపులు గుంపులుగా చేరి ఆ పిల్లలు ఆడుతున్న ఆటలను ఆనందముతో ఉత్సాహముతో చూస్తూ చప్పట్లు కొడుతున్నారు. మరొక వైపు బహిరంగ సభలో పలువురు రాజకీయ నాయకులు గొప్పగా ఉపన్యసిస్తుంటే కూర్చున్న వాళ్ళంతా ఆత్రుతగా వింటున్నారు.

చావుదెబ్బలు తిన్న మల్లిగాడు వెక్కివెక్కి ఏడుస్తూ ఆ వాతావరణంలోకి అడుగు పెట్టాడు. చుట్టూ అంతా కలియచూశాడు. ఆకాశములో తేలుతున్నట్లు అనిపిస్తున్న ఆ జాతీయ జెండావైపు చూడబోయి ఆ సూర్య కిరణాల ప్రభావం వల్ల చూడకుండా విఫలుడైనాడు. పిప్పరమెంట్లు ఎక్కడైనా పంచుతున్నారేమోనని ఆశగా చూశాడు. ఎక్కడా కన్పించలేదు. నిరాశతో మొఖాన్ని దించుకున్నాడు.

అయ్య కొట్టిన దెబ్బల్తో ఒళ్ళంతా హూనంగా తయారయి నొప్పులు పుడుతున్నాయి. పెదవులు పిడచ కట్టుకుపోయాయి. నెత్తంతా చెల్లాచెదురుగా గాలికి నృత్యం చేస్తున్నాయి. మొహమంతా కన్నీళ్ళతో చారికలు కట్టింది. వెక్కిళ్ళు ఇంకా వస్తూనే వున్నాయి వాడి గొంతునుండి. కళ్ళలో ఎర్రచారలు పేర్కొన్నాయి.

"ఈ చిరిగిపోయిన బట్టల్తో వాళ్ళ దగ్గరికెళ్తే ఏమైనా అంటారేమో"నని బాధపడ్డాడు. నిరాశతో కృంగిపోయాడు.

"ఏమైనా సరే నేను ఆడతాను, పాడతాను" అనే కోరిక దృఢంగా నాటుకుపోయింది. "చెమ్మటాల గుడుగుడు" ఆడుతున్న పిల్లలవైపు వెళ్ళాడు నీరసంగా తన శరీరంనిండా తాటిమట్టల అచ్చులే కన్పిస్తున్నాయి తన మొండిపట్టే ఇంతవరకు తెచ్చిందేమోనని బాధపడ్డాడు. శరీరంమీద అక్కడక్కడా రక్తం చారికలు కూడా ఏర్పడ్డాయ్. కొడుతుంటే చేయి అడ్డుపెట్టాడేమో అర చేయంతా ఎర్రగా బొబ్బలెక్కి వాచివుంది.

ఆ ఆట చుట్టూ చూడరాకుండా మనుషులు నిల్చొని ఆటలో లీనమై ఈలలు వేస్తున్నారు. మరొకవైపు బహిరంగ సభలో ఎవరో ఏదో గొప్పగా ఉపన్యసిస్తున్నారు. అక్కడ పాటలు పాడతారేమో వినాలన్న ఆత్రుతతో నెమ్మదిగా అటు వైపు నడక సాగించాడు. అక్కడికి చేరుకునేసరికి ఓ నాయకుడు మాట్లాడటం ముగిసింది. ఇద్దరమ్మాయిలు ఆ వేదిక పైకివచ్చి "గాంధిపుట్టిన దేశం" అంటూ పాడటం మొదలెట్టారు. ఆ పాట పాడుతున్న ఆ అమ్మాయిల వంక కొండంత ఆశతో, తన చెవుల్ని పెద్దవిగా చేసి మైమరచి వింటున్నాడు. వాళ్ళాపాట పాడి వేదిక దిగిపోయారు. మళ్ళీ

ఆ పాట పాడితే ఎంత బావుండు అనుకున్నాడు. నెమ్మదిగా తనుకూడా మనసులో పాడుకోబోయాడు. ఆ వెక్కిళ్ళకు ఆ పాట ఎదరువు రావడంలేదేమో ఊరుకున్నాడు.

''నేనుకూడా వాళ్ళలాగే పాటపాడాలి కాని నన్నెవరు పాడనిస్తారు. నేనేమో చాలా పేదోన్ని కదా, మరి నాకు సరిగ్గా బట్టలు లేవుకదా, వాళ్ళేమో కొత్తబట్టలు వేసుకొని నున్నగా దువ్వుకొని చందమామల్లా వచ్చి పాడుతున్నారు. మరి నేను చిరిగిపోయిన బట్టలు, మాసిపోయిన జుట్టు, ఎండిపోయిన మొహం అదీగాక నేను బడికి కూడా పోవటం లేదాయె, అయిన నేనేం పాట పాడతాను ?''! పలురకాలుగా ఆలోచిస్తూ, ఆ ఆలోచనల్లో గుళ్ళు కడుతూ వెంటనే కూల్చేస్తున్నాడు

ఒకరోజు ..

''అయ్యా..నేను బడికి పోతానే'' గారాబగా అడిగింది ఆ చిన్నారి మనసు.

''ఓరె ఎధవ నా కొడకా . మనకి బడెందుకురా, మనక్కావలసింది పశువుల దొడ్డికాని. పిచ్చి సన్నాసి నువ్ సదువుకొని దేశాన్ని ఉద్ధరిస్తావేంట్రా. ఆ బళ్లు ఆ గుళ్లు అన్నీ పెద్ద మహారాజులకు కాని మామూలు మదుసులకు కాదు దొరలకు దొరకొడుకులకు కాని మన కేంట్రా సదువు. విన్నావే మనోడికి చిత్ర విచిత్రమైన కోరికలు పుడుతున్నాయె. వెధవసన్నాసి ఎళ్ళసె. ఆ దొరసానమ్మగోరు గొడ్డు ఇడవాలంట ఎళ్ళాళ్ళు''. అని తరిమి ఆ దొరసాని దొడ్లోకి పంపేడు. మా అయ్యకి ఎంతసేపు ఆదొరసానమ్మ ముచ్చటే తప్ప మరొకటి వుండదు. నేను సదువుకోవడం మా అయ్యకి ఇష్టంలేదేమో. ఈ సదువులు, ఈ బళ్లు ఆ ఉన్న మా రాజుల దేనా? నేనెందుకు సదువుకోగూడదు? పరిపరి విధాలుగా ఆలోచిస్తూ ఆ బహిరంగ సభలో చివర్లో నిలుచున్నాడు వెక్కి వెక్కి ఏడుస్తూ.

''ఇపుడు మీ ముందు గ్రామ యువజన సంఘ అధ్యక్షుడు రాంబాబు మాట్లాడతారు''! ఎవరో పెద్ద మనిషి స్పీకర్ ముందు కొచ్చి చెప్పాడు రాంబాబు పేరు వినగానే ఆ సభ అంతా చప్పట్లతో మ్రోగిపోయింది. యువకులంతా ఈలలు వేస్తున్నారు. ఇదంతా వింతగా చూస్తున్నాడు మల్లి. నెమ్మదిగా క్రింద కూలబడ్డాడు చేతకాని వాడిలా. వేదిక పైకి తెల్లటి లాల్చి, పైజామా వేసుకుని రాంబాబు చేతులూపుతూ వచ్చాడు. అందరి వైపు చిరునవ్వుతో చూశాడు.

''జై బోలో స్వతంత్ర్య భారత్‌కి !'' అని గట్టిగా అరిస్తే కూర్చున్న వాళ్లంతా ''జై'' అన్నారు. అటు వైపు తదేకంగా చూస్తున్నాడు మల్లి. సభ అంతా నిశ్శబ్దంగా తయారయింది.

''గౌరవ అధ్యక్షా, గ్రామ పెద్దలు మరియు సోదర సోదరీ మణులారా ! ఈరోజు మనకు స్వాతంత్ర్యం వచ్చిన రోజని దాదాపు అందరికీ తెలుసు. ప్రతి సంవత్సరం ఇలా జరుపుతూ ఈ వేదికలపై ఇలా మాట్లాడటం పరిపాటైపోయింది. మనకు స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 38 ఏళ్లు కావస్తుంది. మనం ఆనాడు తెల్ల దొరల పాలన నుండి విముక్తి పొందాం అంటే, వారి బంధాలను తెంచుకున్నాం అంటే, ఆనాడు మహాత్మా గాంధిలాంటి నాయకులెందరో, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ ల్లాంటి వారెందరో తమ ప్రాణాలను అర్పిస్తే ఈనాడు మనం స్వతంత్రంగా బ్రతుకుతున్నాం. ప్రతి సంవత్సరం ఈ వేదికపై ఇలాంటి మాటలనెన్నో వల్లిస్తున్నాము. మరి ఆనాడు తెల్ల దొరల పాలనలో పోరాడి వారి బానిస బంధనాలను తెంచుకున్నాం, మనకు స్వాతంత్ర్యం వచ్చాక ఈ నల్ల దొరల బానిసలకు బందీలమై ఉన్నాము !'' ఉద్రేకములో, ఆవేశ పూరితంగా మాట్లాడుతున్న అతని వైపు, వేదిక మీద కూర్చున్న గ్రామ పెద్దలు విషపుచూపులు విసిరారు. వేదిక క్రింద కూర్చున్న యువకులంతా చప్పట్లతో అతన్ని బలపరుస్తున్నారు.

''నా తెలుగు సోదరులారా, మనకు స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా మనం సాధించిన ప్రగతి ఎక్కడుంది? ఈ దేశంలో ఇంకా దరిద్ర్యం విలయతాండవంచేస్తోంది. నిరుద్యోగం స్వైర విహారం చేస్తోంది. ఆకలితో ఎంతో మంది పేదవాళ్ళు అలమటించిపోతున్నారు. ఈనాడు ఈ దేశంలో ఈ పేదరికం, ఈ దరిద్రం పెరిగిపోతుందంటే ఈ స్వార్థపరులైన ఖద్దరు బట్టల నాయకులే కారణం !''

రాంబాబును ఈసారి నిప్పులవ్వలు రాలే విధంగా చూశారు, వేదికమీద ఉన్న నాయకులు. అతను ఆగకుండా ఆవేదనతో ఉపన్యసిస్తున్నాడు.


''ఉదాహరణకు ఇపుడు మన గ్రామం తీసుకోండి. మనఊళ్ళో పేద్రప్రజల పిల్లలు బడికి రాలేనిస్థితిలో ఉన్నారు. మనఊళ్ళో వీధిలైట్లు లేవు, నీటిసౌకర్యం లేక మనం పడుతున్న ఇబ్బందులు మీ అందరికి తెలిసిందే. మన దేశానికి స్వతంత్ర్యం వచ్చిందేమోకాని మన వూరికి ఇంకా స్వాతంత్ర్యం రాలేదు. ఈ దేశంలో ఉన్న ప్రతి ఊరిలో పేద్రప్రజల బాధలు తీరినపుడే, కష్ట జీవుల కన్నీళ్ళు తొలగినపుడే మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు. జై హింద్ !'' అంటూ ముగించాడో లేదో ఆ సభలో చప్పట్లు ఊరు అదిరిపోయేలా మ్రోగిపోయాయి.

ఎందుకో తను కూడా సంతోషముతో నవ్వుతూ, తెలియని ఆనందముతో, అందరూ కొట్టడం ఆపినా తనుమాత్రం ఆగకుండా చప్పట్లు కొడుతున్నాడు, అరచేయిలో ఉన్న నొప్పిని విస్మరించి అలాగే కొడుతున్నాడు. అతను మాటాడుతుంటే తనలో ఏదో తెలియని ఉత్సాహం పెల్లుబికింది.

''ఇంతటితో ఈ సభ ముగించటం జరుగుతోంది. ఇపుడు మన విద్యార్థినిలు జాతీయ గీతాన్ని విన్పిస్తారు !'' సభలో కూర్చున్నవారంతా లేచారు. పిప్పరమెంట్లు ఇప్పుడైనా ఇస్తారేమోనని ఉత్సుకతతో లేచాడు మల్లి.

''జనగణమన అధినాయక'' అనే పాటను పాడుతున్నారు మరో ఇద్దరమ్మాయిలు. సభ ముగిసింది ఆ పాటతోనే కాబోలు ఎవరింట్లోకి వారు వెళుతుంటే ''పిప్పరమెంట్లు ఇవ్వరేమో'' నని కోపంగా చూశాడు.

''ఎలాగైనాసరే రాంబాబుగారిని కల్సుకొని నా సంగతంతా చెప్పి నన్ను బళ్ళో చేర్పించమని, కాళ్ళావేళ్ళా పట్టుకొంటాను. ఆ బాబుగారు నన్ను అసహ్యించుకుంటారా ? లేదు, అతడేగదా 'పేదోళ్ళపిల్లలు బడికి రాలేకపోతున్నారని చెప్పాడు'' అలా మనసులో ఒక నిర్ణయానికి వచ్చి, ఆయాసంతో వున్న తన శరీరంలోకి శక్తినంత కూడదీసుకుని మెల్లిగా వేదికవైపు రావడానికి ప్రయ



త్నిస్తున్నాడు. కాళ్ళు నొప్పులో ఉండి నడవడానికి సాధ్యం కావట్లేదు.

అతని ఎదురుగా ఇద్దరు యువకులతో వస్తున్న రాంబాబు కనిపించాడు. తన కాళ్ళల్లో నొప్పి తగ్గినట్టయింది. ఆత్రుతగా వెళ్ళి అతని కాళ్లపై పడ్డాడు. వెక్కివెక్కి ఏడుస్తూ బిగ్గరగా పట్టుకున్నాడు. అతని వెంటవున్న ఇద్దరు యువకులు కళ్ళు పెద్దవిగా చేసుకుని ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"లే బాబూ...లే... ఏం జరిగింది. లె చెప్పు బాబు..." కరుణతో నిండిన అతని చేతులు మల్లిని లేవదీసాయి.

"బాబుగారండి బాబుగారండి"! దుఃఖాన్ని మరింత కూడదీసుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. తను వచ్చే దుఃఖాన్ని మరింత రెట్టింపుగాచేసి తన గోడునంతా అతనికి తనవితీరా చెప్పాలనిపించింది. ఇన్ని రోజులనుండి దాగివున్న ఆ కోరికను కొండెంత పెద్దదిగా చేసి మనసునిండా చెప్పాలని ఉంది. తన బాధనంతా అతని మనసు కరిగేలా చెప్పాలనిపించింది.

"చూడు బాబు... నీకేంకావాలి చెప్పు. పిప్పర్‌మెట్లు కావాలా, మిఠాయిపొట్లం కావాలా. ఏమయిందో చెబితే అవన్నీ తెచ్చిస్తాను!" ఆప్యాయతతో చెరిగిపోయిన ఆ జుత్తును నిమిరి దగ్గరకు హత్తుకున్నాడు. "మా అయ్యకూడా ఇంత పేమతో ఎప్పుడూ దగ్గరకు లాక్కులేదూ. ఎంత మంచి మనసు బాబుగోరిది. నన్నింతవరకు ఇంత పేమగా ఎవరూ హత్తుకోలేదు." ఆ చిన్నారి గుండె సంతోషముతో ఎగిరిపడింది.

"బాబుగారు... నే...నే...నేనేమో.. బడికి వెళ్తానన్నాను.

మా .. అ... అయ్యోమో... బడికి... వద్దని... బాగా తాటిమట్టతో... కొ... కొట్టాడు!" భోరుమన్నాడు. బొబ్బలెక్కి

మావూరికి సౌతంత్రం....

ఎర్రగా నిప్పుకణంలా ఉన్న అతని చేతిని చూసి కళ్లెర్రజేసాడు. అతని ప్రక్కనే ఉన్న వాళ్ళు బిత్తరపోయి వింటున్నారు.

"మరి... ఈ... వేళ... ఏదో పండగంట.. ఇ... అందుకని.. నేను పనికిపోను అంటే... మా... అయ్యమో పనికిపొమ్మని .. ఆ తాటిమట్టలో నెత్తురొచ్చేలా కొట్టాడు!" చిరిగిపోయిన ఆ చొక్కాను పైకి లేపి చూపించాడు. ఆ వీపుపైన ఆ తాటిమట్ట వేసిన ముద్రలున్నాయి. ఆ వాతలు చూసిన రాంబాబు మొహం ఎర్రగా మారింది. ఉద్రేకమంతా కళ్లల్లో కూడుకుపోయింది. ఒకసారి ఆ మల్లిగాడివైపు దీనంగా చూశాడు. అతని కళ్లల్లో ఏడ్చి ఏడ్చి తేలియాడిన రక్తకణాలు చూసి పళ్ళు కొరికాడు.

"ఒరే... ఈ దేశములో ఇంకా అంధకారం చోటు చేసుకొని వెలిగే జీవితాల్ని కప్పేస్తున్నాయి. ఈ బాబు నెలాగైనాసరే స్కూల్లో చేర్పించి, ఆ బానిస కబంధహస్తాలనుండి విముక్తిచేస్తే వీడు భవిష్యత్తులో దేశానికి ఓ వెలుగు కిరణమై ప్రకాశించవచ్చు. ప్రకాశించబోతున్న ఇలాంటి వజ్రాలు మట్టితో కప్పబడుతున్నాయి, పదండి" ఆవేశంగా సెగలు కక్కుతున్న చూపులతో ఉద్రేకంగా అరిచాడు.

"బాబుగారండి . మా అయ్యతో సెబితే.. మళ్ళీ నన్ను కొడతాడేమో!" జీరవోయిన కంఠముతో పలికాడు.

"చూడు బాబు ... మీ అయ్య నిన్ను కొట్టకుండానే చెబుతానులే... పద!" గుడిసెల వైపు దారి మళ్లించారు.

"బాబుగారు. సౌతంత్రం అంటే ఏమిటి!" అమాయకంగా ప్రశ్నించిన మల్లివైపు చూసి ఓ నవ్వు నవ్వాడు రాంబాబు.

"స్వతంత్రం అంటే నువ్వు రోజు పోతున్నావే పనికి, ఆ పని మానేసి చదువుకుంటే అది సౌతంత్రం అన్నమాట!"

"నిజంగానా బాబుగారూ" నమ్మలేనట్టుగా అడిగాడు.

అలా మాట్లాడుతూ ఆ గుడిసెల దగ్గరికి చేరుకున్నారు. మల్లిగాడి వెంట వస్తున్న రాంబాబుని, అతని మిత్రుల్ని ఆశ్చర్యంగా చూస్తున్నారు ఆ గుడిసె వాసులు. వారి వెంట నక్కి నక్కి వస్తున్న మల్లిగాడ్ని గుడ్లప్పగించి చూస్తున్నారు.

వాకిట్లో కూర్చొని చిన్నపాటి బోరెలో బియ్యాన్ని గాలిస్తున్న మల్లిగాడి తల్లి, వస్తున్న మల్లిగాడివైపు నోరెళ్లబెట్టి నమ్మలేనట్టుగా చూస్తుండిపోయింది.

"ఏమ్మా ... మీ ఆయన ఏడీ!" రాంబాబు పిలుపుతో ఉలిక్కిపడ్డట్టు నఖశిఖ పర్యంతంగా చూసింది. ఏమి చెప్పాలో అర్థంకాక మల్లిగాడివైపు వింతగా చూసింది.

"లేడండి బాబుగారు. ఆ దొరసానమ్మ పొలంకాడికెళ్లాడు" సమాధానం చెప్పేసి తన పనిలో నిమగ్నమయింది.


"మీ బాబుని, మా యువజన సంఘం స్వయంగా ఖర్చులు భరించి, బళ్లో చేర్పించి చదువు చెప్పిస్తాము. నీకెమైనా అభ్యంతరమా?"


ఆ మాటలు విన్న ఆమె మొహం తెల్లబోయింది. రాంబాబువైపు భయంగా చూసింది. మల్లిగాడు సంతోషముతో పళ్ళు బయటపడేలా నవ్వు మొహం పెట్టాడు.

"ఈ బాబుగారు నన్నెలాగూ బడికి పంపించేత్తారు. నేనేమో పెద్ద చదువు చదివి పెద్దవాడ్నై ఏదైన కొలువు చేస్తాను. ఈ బాబుగారు నా జీవితానికి సౌతంత్రం తెస్తున్నారు!" మనసులో చెప్పరాని అహంకారముతో ఎగిసి పడుతున్నాడు.

"చూడండి బాబుగారు, మాబోటివాళ్లకు సదువులెందుకండి మాకు ఒక్కగానొక్క పోరడు. వాడు మా కళ్ల ఎదుట ఉండి, మేము తినే దాంట్లో రెండు ముద్దలు తిని తృప్తి పడితే, మాకు అంతే సాల్లెండి. వద్దు బాబు మా వాడికి లేనిపోని ఆశలుపెట్టి, వాడ్ని మా నుండి దూరం చేయకండి. మా ఆయన అసలే వెర్రోడు, కోపం వత్తే వాడ్నేమి సేసినా సేసేత్తాడు, పొద్దున్నే చావబాదాడు. నేను అడ్డం తిరిగితే నన్ను కొట్టాడు" చివరి మాటల్లో దుఃఖము కొట్టుకొచ్చింది. ఆమె చెబుతున్నంతసేపు శ్రద్ధగా విన్నారు. ఆమెకు ఎలా చెబితే వింటుందో అర్థంకాక సతమతమవుతున్నాడు.

"చూడమ్మా ... మీ మల్లి మీ కళ్లముందే ఉంటాడు. ఈ రోజుల్లో కాస్తో కూస్తో చదువుకుంటే వాడికి జ్ఞానం వస్తుంది. పెద్దగా ఎదిగిన తరువాత వాడి కాళ్లమీద వాడు నిలబడి,





వాడి బ్రతుకువాడు సరిదిద్దుకోగలడు. మీరిలా వెట్టి చాకిరీ పనులకు పెట్టొద్దనుకోండి, వాడి జీవితమంతా వెట్టిచాకిరీ పాలవుతుంది. చిగురించే మొక్కల్ని, మీరలా కావాలని విరిచివేయకండి!'' ఇలా ఎన్నెన్నో మాటల్తో ఆమెకునచ్చేవిధంగా చెప్పాడు. ఇతడు చెప్పిన ప్రతి మాటలో నిజముందని గ్రహించినా ఆమె మనసు ఒప్పుకోవడం లేదు. చివరికి తనేం చేయులేనట్టుగా

''మా ఆయన్ని అడగండి!'' సరిపుచ్చేసింది.

రాంబాబు ఏమి చేసేదిలేక ''చూడు మల్లి, నీవు రేపు పొద్దున్నె నా దగ్గరకు వచ్చేసెయ్, నేను బడి దగ్గరే నిల్చుంటాను. నిన్ను హెడ్ మాస్టర్ దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడి, నిన్ను బడిలోచేర్పిస్తాను. కొత్త పలక, బలపము, బట్టలు అన్నీ నేనే ఇస్తాను!'' అని చెప్పి వెళ్లిపోతున్న రాంబాబు వైపు అదోలా చూశాడు మల్లి.

''నా బతుకులో సొతంత్రం తెచ్చేస్తున్నారు రాంబాబుగారు. నేను ఇకనుంచి రోజూ బడికి పోతాను, అందరితోపాటు ఆడుతూ పాడతాను!'' పట్టలేని ఆనందములో పరవళ్లు త్రొక్కుంది ఆ చిన్నారి మనసు ఒక్కవుదుటున ఆ వాడలోకి పరిగెత్తి—

''నేను బడికి పోతున్నాను. నేను కూడా సదువుకుంటున్నాను. నన్ను రాంబాబుగారు సదివిత్తన్నారు.'' అందరికి చెప్పేస్తూ గంతులు వేస్తూ ఎగురుతున్నాడు.

''నాకు సొతంత్రం వచ్చింది'' అంటూ అరుస్తున్న మల్లిగాడ్ని అందరూ పిచ్చివాడిలా చూస్తున్నారు.

ఆ చిన్నారి మనసులో చిరుదివ్వెలు వెలిగాయి. ఆ చిన్నారి కేరింతలు వింటూ, ఆ చిన్నారి గంతులు చూస్తూ నవ్వుతూ అస్తమించాడు సూర్యభగవానుడు

* * *

అతి కష్టం మీద సూర్యుడు ఉదయిస్తూ మబ్బుల చాటుకు చేరుకుంటున్నాడు. ఆ వూరిని చూడాలన్న ఇష్టం లేనట్టుగా కోపంతో మబ్బుల చాటు దాక్కుంటున్నాడు. నీలిరంగు ఆకాశం మేఘావృతమయింది., మబ్బులు వేగంగా పరిగెత్తుకుంటూ వస్తు ఆకాశాన్ని కప్పివేస్తున్నాయి. నెమ్మదిగా వీస్తున్న గాలి చాలా ఉధృతమైంది. వర్షం పడుతుందేమోనన్న కంగారుతో మాస్టార్లంతా నడక స్పీడు హెచ్చించి స్కూల్లోకి వెళుతున్నారు. ఆ స్కూలు ముఖద్వారం వద్ద వెక్కిళ్లు వినపడుతుంటె, అసహ్యంగా చూసి నవ్వుకుంటూ లోపలికి వెళుతున్నారు పిల్లలు. ఆకాశంలో మెరుపుల దాడి పెరిగింది. ఆ ఊరు నిండా మసకచీకటి సంతరించుకొంది.

బహుశా అప్పుడు 8 గంటలయి ఉండవచ్చు. రాంబాబు రాకకోసం వేయి కనులతో ఎదురు చూస్తున్నాడు మల్లి. తెల్లబట్టలేసుకున్న వాళ్లెవ్వరు కనిపించినా రాంబాబు గారేమోనని భ్రమపడిపోతూ అంతలోనే నిరాశకు గురి అవుతున్నాడు. ఈరోజు కూడా వాళ్లయ్య కొట్టాడేమో, బాధతో మూల్గుతూ ఏడుస్తున్నాడు.

''రాంబాబుగారు వస్తారు. నాకు కొత్త పలక, కొత్త బట్టలు, కొత్త బలపం తెస్తారు. నన్ను బళ్లొ చేర్పిస్తార'ని గంపెడు ఆశతో ఎదురు తెన్నులు చూస్తున్నాడు. ఇంతలో ఏదో అలజడి వినిపించింది. ఆ అలజడి ఊరంతా ప్రాకింది కాబోలు, అందరూ బిక్కమొహాలు వేసి 'పాపం' అంటూ సానుభూతి తెలుపుతున్నారు. ఆ వార్త మల్లిగాడి చెవుల్లో కుండ పగిలినంత గట్టిగా వినపడింది. జరుగరాని ఘోరం జరిగిపోయింది.

మల్లిగాడి మనసులో నిప్పుసెగలు బయలుదేరాయి. గుండెల్లో గునపాలు దించినంత బాధయ్యింది. తన గుండెల్లో ఎవరో కాగడాతో మంటలు లేపుతున్నారు. శరీరంలోఉన్న ప్రతికణం పగిలి బ్రద్దలు అవుతోంది. ఒక్కసారే దిమ్మ తిరిగింది కాబోలు తలను బిగ్గరగా అదిమి పట్టుకున్నాడు.

జోల

జో పాపా జో
పసితనం అమాయకత్వం
పరుగులిడి పోకముందే
పడుక్కోగలవు హాయిగా
క్షణంలో తెల్లారిపోతుంది
సంగ్రామం మొదలౌతుంది బ్రతుకుతో
సమయం దాటిపోకముందే
చక్కా పడుక్కో నిశ్చింతగా
అల్లరి బ్రతుకు బాధల చీకట్లు
అల్లుకున్నాక రాదు సుమీ నిద్ర
మనిషిగా ఎదిగిపోకముందే
తనివితీరా పడుక్కో ॥జో పాపా జో॥

— వజ్ఝల కాళిదాసు

''రాంబాబుగారు!'' అంటూ వూరు అదిరిపడేలా కేకవేసాడు. ఆ కేకలో కొన్ని కోట్ల గొంతుల ఆర్తనాదాలు వినిపించాయి. కాళ్ళు గడగడలాడి పోతున్నాయి. చేతులు రెండు ఉద్రేకముతో ఊగిపోతున్నాయి. తన కళ్ళను ఎవరో పీకి వేసినంత బాధయింది. దిక్కుతోచనట్టుగా తన కళ్ళు బెదిరి బెదిరి చూస్తున్నాయి. తన కళ్ళకు ఏమి కన్పించటంలేదు. అంతా శూన్యం. అంతా చీకటే కన్పిస్తుంది.

ఏదో జరుగరాని, జరుగలేని ఘోరం జరిగిపోయింది. ఇక నా బతుకు ఎట్టి బతుకేనేమో, నేనిక బడికిపోనేమో, ఆ దొరసానమ్మ దొడ్లో పేడకుప్పలు తీయాలేమో, తన బ్రతుక్కి ఇక వెలుగులేదేమో అంతా చీకటే.

ఈ ఊరంతా వరదల్లో కొట్టుకుపోతే బాగుండేది. ఈ ఊరంతా మంటల్లో ఆహుతి అయితే బాగుండేది. ఊళ్ళో మనుషులు, పక్షులు పశువులు అన్నీ చచ్చిపోతే బాగుండనుకున్నాడు.

అక్కడ్నుండి పరుగు లంఘించాడు. ఊరు అవతల ఉన్న పెద్ద మర్రిచెట్టు, దాని ప్రక్కనే ఓ పెద్ద బొంద, ఆ బొందలో రాంబాబుగారు నెత్తుటి మడుగులో నిద్దరోతున్నారు.

అంతా అక్కడ గుంపుగాజేరి ఆ నూతిలోకి తొంగి చూస్తున్నారు. అందర్ని ప్రక్కకు చిల్చుకుంటూ ముందుకువెళ్ళాడు చిన్నారి మల్లి. ఆ నెత్తుటి మడుగును చూసేంత శక్తిలేక తన కళ్ళను ఒక్కసారి గట్టిగా మూసుకున్నాడు.

మరొక్కసారి ''రాంబాబుగోరు!'' కొండలు పిక్కటిల్లేలా, ఆకాశం అదిరిపోయేలా, భూమి కంపించే విధంగా అరిచాడు. ''లేదు. లేదు. మనూరికి సొతంత్రం రాలేదు. మనూరికి వెలుతురులేదు...ఈ వూరంతా పాడైపోయింది!'' గట్టిగా అరుస్తున్నాడు పిచ్చెక్కినవాడిగా.

మల్లిగాడి శరీరమంతా మంటలు మంటలుగా సెగలు సెగలుగా ఎగిసి పడుతోంది. ★

సీరియల్

కర్మయోగి

డా॥ కె.వి. కృష్ణకుమారి

(గత సంచిక తరువాయి)

ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు —

నిద్ర పట్టటంలేదు —

అశాంతిగా వుంది — గమ్యం - అగమ్యంగా కన్పిస్తోంది —

భగవాన్ !!! — ఏది దారి ???

ఏం చెయ్యాలి నేను ???

కృష్ణారావు మనసులో అశాంతి పెను తుఫానులా విజృంభిస్తోంది.

శాంతనేది కొడిగట్టే దీపంలా అల్లల్లాడి పోతోంది.

తనను కోరుకుంటున్న గమ్యాన్ని చీకటి కప్పేస్తోంది.

తనవాళ్ళు కోరుకునే భవిష్యత్ చీకటిగా కన్పిస్తోంది.

తనని ప్రభావితం చేసిన వివేకానందుని శూక్తులు రక్తంలో అణువణువులో—ఉద్రేకంతో ఉరకలు పెడుతున్నాయి —

రామకృష్ణుని వాణి అజ్ఞాతంగానే తనని హెచ్చరిస్తోంది.

తన గమ్యాన్ని నిర్దేశిస్తోంది.

తండ్రి వీరరాఘవయ్య — తన అడుగు జాడల్లో నడవమని ఆహ్వానిస్తున్నాడేమిటి? అన్న రామకృష్ణయ్య తన కప్పగించిన పవిత్ర బాధ్యత పదే పదే హెచ్చరికలు చేస్తుందే — ఎలాగ ?

'తన కర్తవ్యమేమిటసలు ? —

తను నమ్మిన వాణి, వంశానుగతమైన ఆదేశం మనశ్శాంతిని దూరం చేస్తుంటే — తనను నమ్ముకున్న వారి ఆవేదన మనసును వికలం చేస్తోంది.

''ఆత్మనోయోక్షార్థం జగద్ధితాయచ''

ఆత్మ విముక్తికీ — జగత్కల్యాణం సాధించటానికి సన్యాసి స్వీకారం అత్యవసరం — ఇందుకు వేదమే ప్రమాణం కాదా ?

ఐహిక జీవనంలో బ్రహ్మజ్ఞులమని విర్రవీగటం అవివేకం కాదా ? ... భోగలాలసులైన వాళ్ళు ఆత్మవంచన చేసుకుంటూ — స్వలాభం కోసం — స్వసుఖం కోసం — శారీరక వాంఛలు చావక చేసే వ్యర్థ ప్రేలాపన కాదా ఇది?...

మోక్షసాధనకు సన్యాసాన్నిమించిన సాధన ఏది ?

ఏది ???

అన్ని బంధాలనూ త్యజించనిదే, భవబంధాలనూ వొదుల్చుకోనిదే, త్యాగానికి భాష్యాలు చెప్పటం—తోటి వారికి దారి చూపించబోటం, తామే భగవంతునికి సన్నిహితులమని చెప్పుకోటం ఎంత పిచ్చితనం ?

''కామ్యానాం కర్మణాం న్యాసం సన్యాసం కవయో విదుః'' కామ్య కర్మలనుపరిత్యజించాలి. అదే సన్యాసం.

ముక్తికిమార్గం-సంసారపరిత్యాగమొక్కటే.

విషయవాంఛల్లో — ఏదో అతి గాఢంగా ఆకర్షిస్తుంది. మనసును ప్రలోభ పరుస్తుంది. అది సహజం. అప్పుడు సంసారాన్ని త్యజించటం అసాధ్యమౌతుంది.

...—మరి బ్రహ్మ జ్ఞాన సిద్ధి ఎలా సాధ్యం???—

కృష్ణారావు కళ్ల ముందు వివేకానందుని మూర్తి వెలుగుతోంది.

ఆవాణి పలుకుతోంది.

ఎన్నో ఏళ్లుగా తను నడవాలను కుంటున్న దోవ అది.

ఎంతో కాలంగా తనను ప్రభావితం చేస్తున్న పథం అది. ఆత్మగతంగా—అంతరాత్మ పరంగా తన అనుభవాలు అద్భుతమైనవే. చరిత్రాత్మకమైనవే—

తను ఆరాధించేమూర్తి మనసులో నిలవటం తన ఆరాటానికి ఆసరాగానిల్చి సమాధాన పర్చటం క్రొత్తవి కాకపోయినా—

అరుదు—

అరుదుగా అమూల్య సంపద ఇది.

ఎప్పటి కప్పుడే చెలింపజేసే దివ్యాను భూతి ఇది.

వివేకానందుని పలువరస — వెలుగును వెదజల్లింది.

కృష్ణారావు గుండె సవ్వడి కూడా విన్పించనంత తదేకతను స్వంతం చేసుకున్నాడు.

'సంసార జంజాటాన్ని తృణప్రాయంగా చూడనిదే విముక్తి ఏది? భక్తి ఏది? ముక్తి ఎక్కడ?'

సర్వం తృణ ప్రాయంగా తోచని వాడు బ్రహ్మజ్ఞాని ఎలా అవుతాడు? మనకు మృత్యువు ఎప్పుడు — ఏరకంగా దర్శన మిస్తుందో ఎలా తెలుస్తుంది?

రేపు సూర్యోదయాన్ని చూడగలమన్న నమ్మకం ఎంత మందిలో వుంటుంది ? అసలుంటుందా ?


రేపుంటుందన్న భ్రమతో తుచ్ఛమైన విషయ వాంఛలకు ఇవాళే లొంగి పోవాలా ?

రేపంటూలేదనుకుని ఇవాళే పరమార్థానికి దారి వెతుక్కోటం శ్రేయస్కరం కాదా ?

కృష్ణారావు ఆర్తితో కళ్లు మూసుకున్నాడు.

వివేకానందుని శిష్యుని స్థానంలో తనలోని అంతరాత్మ భక్తిశ్రద్ధలతో, తలవంచుకుని — చేతులు కట్టుకున్నట్టుగా — గురువు స్థానంలో వివేకానందుని వెలుగును వెదజల్లుతోంది - ఆ ప్రశాంతమైన చిరునవ్వు వెన్నెల కురిపిస్తోంది

జరిగిన కథ — 3 : తులసమ్మ కుమారులు రామకృష్ణయ్య, కృష్ణారావు. రామకృష్ణయ్య కృష్ణ భక్తుడు. భార్య కళ్లలోకూడ ఆయనకు నీలమేఘశ్యాముని దివ్యరూపమే కన్పిస్తుంది. కృష్ణారావుకి సంగీతం అంటే ప్రాణం. వీరిద్దరి ప్రవర్తన చూసి తల్లి తులసమ్మ తనువారిపై పెంచుకొన్న ఆశలు తీరవేమో అని భయపడింది. తులసమ్మ కృష్ణారావుని వంశం నిలపమని వేడుకొంటుంది. తల్లి కోరిక అన్నతోచెప్పి ఆయన సలహా అడుగుతాడు కృష్ణ. అడిగిన వాళ్లకు రాధ మాధవుల తత్వం బోధించమని కృష్ణను కోరుతాడు రామకృష్ణయ్య. అన్న పరిస్థితి బాగలేదని తల్లిని, వదినను వచ్చి చూడమంటాడు కృష్ణ. రామకృష్ణయ్య మరణిస్తాడు. లక్ష్మి తన శేష జీవితం అత్తగారింట్లోనే గడుపుతానని చెపుతుంది. కృష్ణారావుని పెళ్లి చేసుకొమ్మని తల్లి వేడుకొంటుంది. అత్తగారి కోరిక తీర్చమని కృష్ణకు చెపుతుంది లక్ష్మి.



ఏదో అడుగుదామనుకుని ఆగిపోయాడు కృష్ణారావు.

విచిత్రంగా వుంది తన స్థితి.

చిత్రవిచిత్రంగా వుంది తన పరిస్థితి.

తన శరీరం పక్కమీదే వుంది. నిశ్చలంగా నిద్రావస్థలోనే వున్నట్టుంది.

కళ్ళు మూసుకుని కదలిక లేకుండా పడుకున్నట్టు తెలుస్తూనే వుంది.

ఐతే !!! —

తనలో ఏదో శక్తి — ఆత్మ అనబడే బలవత్తర శక్తి — మరో అనూహ్యమైన శక్తి వల్లా చిత్రహింసలకు గురి అవుతోంది —

ఊహాతీతమైన మరణ బాధననుభవిస్తోంది.

రక్తమాంస నిర్మితమైన ఈ తుచ్ఛ శరీరం నుంచి బైటకు రావాలని వ్యర్థప్రయత్నం చేస్తోంది.

తన శరీరంలో అంతర్భాగమైన శూక్ష్మ శరీరం భూమ్యాకాశాలను ఏకం చెయ్యగలిగినంత శక్తివంతమైనదిగా — అన్నిటికీ అతీతమైందిగా—

దైవత్వాన్నే స్వంతం చేసుకున్నట్టుంది.

శరీరం నిద్రపోతోంది.

సూక్ష్మ శరీరం — ప్రళయతాండవం చేస్తోంది.

ఎదురుగా వివేకానందుని మూర్తి మాయమైపోయింది —

ప్రచండ ప్రళయమే భయోత్పాతాన్ని సృష్టిస్తున్నట్టుంది.

"వివేకానందా — రామకృష్ణ — పరమహంసా — రామకృష్ణ — పరమహంసా — పరమహంసా — రామకృష్ణ— వివేకా — రామా— కృష్ణా—"

మహాప్రళయంగా భూమ్యాకాశాలూ — వలయాలుగా — ఉరుములతో — పిడుగులతో... భయానకాన్ని కల్పిస్తున్న సమయంలో —

కృష్ణారావులోంచి — కాంతివంతమైన జ్యోతి — అతి ప్రయత్నంమీద శరీరాన్ని వీడగలిగింది —

శరీరం పైగా ఆ జ్యోతి వెలుగుతోంది —

ఆ జ్యోతి ఆకృతి కృష్ణారావులా మలచబడుతోంది —

అంతలో అగరుధూపం — కర్పూర సువాసనలు — దివ్య పరిమళాలూ — చిరుగజ్జె మ్రోతలూ...

ఆకారం లేని — ఆకారం తెలియని మరో శక్తి కృష్ణారావు శరీరాన్ని సమీపిస్తోంది.

అసలు శరీరం నిద్రావస్థలో —

శూక్ష్మ శరీరం విస్మయంలో —

విభ్రాంతితో చూస్తున్న భావన.

ఎదుటి దివ్యాకృతి— క్షణాలమీద మారిపోతోంది—

ముందర కాళీమాతగా కరుణనే వర్షిస్తోంది.

మరుక్షణంలో రామకృష్ణ పరమహంస పూజనీయ రూపం లీలగా గోచరిస్తోంది.

ఉత్తర క్షణంలో— వివేకానందుడు కళ్లతోనే కాంతిపుంజాలు నింపుతున్నాడు

ఆ దైవంలో రెండు పవిత్ర ఆత్మలు—

మూడుగా కన్పిస్తున్న ఆత్మల్లో— ఒకే దైవం—

ఒకే ఆత్మలో మూడు రూపాలు—

భిన్నత్వంలో ఏకత్వం—

ఏకత్వంలో భిన్నత్వం

"ధన్యోస్మి !!!—"

కృష్ణారావు అంతరాత్మ వినమ్రతతో తలవాల్చింది.

ఒకే ఆత్మనుంచి— ఒకే వాక్కు— దివ్య వాణిలా— కర్ణపేయంగా— తియ్యగా చల్లగా—

కృష్ణారావును తాకుతోంది—

"బిడ్డా !!!—"

"తల్లీ... స్వామీ... తండ్రీ—!!!"

తడబడ్డాడు కృష్ణారావు.

కృష్ణారావు భౌతిక శరీరం గాఢనిద్రలోనే వుంది.

"...సన్యాసాశ్రమం శ్రేష్టమా ???—"

సందిగ్ధంగా అన్పిస్తోంది కృష్ణారావు స్వరం.

"ఏ సన్యాసాశ్రమం ?—"

అమృతం వొలికిస్తోంది ఎదుటి వాణి.

"అజ్ఞానిని— సన్యాసాశ్రమం వుంటుందని తెల్సుగానీ... రకాలున్నాయా ?— అందులో తారతమ్యాలున్నాయా ?—"

"ఉన్నాయి—"

ఆ వాణి గంభీరంగా మ్రోగింది.

"కావాలనుకుంటే రానిదీ— కృషితో లభించనిదీ— మరే విధంగానూ స్వంతం చేసుకో లేనిదీ పూర్వజన్మ సంస్కారం. ఆ సంస్కారం వల్ల— త్యాగ మావేసించి— త్యాగ నిరతితోపాటు స్వంతం చేసుకున్నప్పుడుగాని— నిజమైన సన్యాస మవలంబించటం సాధ్యం కాదు—

ఈ రకమైన సన్యాసమున్నే విద్వత్ సన్యాస మంటారు.

మరొక సన్యాసమార్గముంది— దీనివే వివిదిషా సన్యాసమంటారు.

శాస్త్రపరిజ్ఞానం అలవడటం కూడా అతి క్లిష్టమైందే— దానికి సాధనే, ఆత్మజ్ఞానం— అణుచుకోలేని తీవ్రతరమైన వాంఛా తోడై— ఒక మహానుభావుడ్ని ఆశ్రయించి— అతని ద్వారా సన్యాసాన్ని స్వీకరించే పద్ధతి కూడా ఉత్తమ మైనదే—

ఆ విధంగా జీవితానికి చరితార్థతను సంత రించుకునే పద్ధతినే— వివిదిషా సన్యాసమంటారు.

కొంతమంది దుర్బలులుంటారు. వారు సంసార కూపంలో చిక్కుకుని—ఆ సుడిగుండాల్లో సుళ్ళు తిరిగి— బాధావేదనలనూ— సహజమైన మనోదౌర్బల్యాలనూ — అణచుకోలేక తీవ్ర మనస్తాపాన్ని తట్టుకోలేక— సన్యసించాలనే — తలపుతో— ఐహిక జీవితాన్ని విస్మరించే పద్ధతినే మర్కట సన్యాసమంటారు. పేరును బట్టే ఆ సన్యాసం స్థిరమైంది కాదు.

ఇక ఆఖరిది 'ఆతుర' సన్యాసమంటారు. అంత్య కాలంలో — మృత్యుదేవత సమీపించే తరుణంలో శాస్త్రాలు ఈ సన్యాసానికి అనుమతి నిస్తాయి. ఆ సమయంలో మరణిస్తే ఆదిశైఫలం అతనికి మరుజన్మలో ఫలాన్ని అందిస్తుంది. మరణం సంభవించకుండా అతను జీవించిన పక్షంలో— తిరిగి పూర్వాశ్రమంలో ప్రవేశించటం దోషమవుతుంది —"

కర్మయోగి

ఆ గంభీరవాణి ముందు పసిపాపలా వున్నాడు కృష్ణారావు— పసితనం అంతరాత్మను అల్లుకుని వుంది.

'బిడ్డా— సంశయమెందుకు ?— సన్యాసం ఎన్ని విధాలుగా వుంది?—ఏ విధంగా పుడుతుంది? ఏరకమైన ప్రయోజనాన్ని సంతరించుకుంటుందీ అన్నది కాదు ప్రశ్న. ఈ విషయంలో ఆతృతా జిజ్ఞాసా కూడా అనవసరం. నువ్వు తెల్సుకోవ ల్సిందీ — సర్వోత్కృష్టమూ, ఆచరణ యోగ్యమూ — సాఫల్యాన్ని అందించగలిగిందీ ఒక్కటే—

— అదే సన్యాస దీక్షాస్వీకారం —

అదే జీవితానికి సరైన గమ్యం చూపి స్తుంది.

ఆ విధంగా బ్రహ్మజ్ఞానం పొందుట మొక్కటే— పరమార్థతను ఆపాదించి పెడు తుంది.

ఐహిక జీవితంమీద మనసునూ-మమకారాన్నీ నింపుకోటం— పెంచుకోటం తగని పని—

అది విజ్ఞులకు సరైన మార్గం కాదు.

సర్వాన్నీ త్యజించినవాడు కానీ— సర్వులకూ సరైన గమ్యాన్ని నిర్దేశించగల అర్హతను సాధించిన వాడు కాదు—

కృష్ణారావు మనసు బలహీనంగా చెలిస్తోంది—

"స్వామీ— గృహస్థాశ్రయం స్వీకరించిన వారికన్నా— సన్యాసమం స్వీకరించిన వారు ఎందులో— ఏ విధంగా అర్హతను సాధించగల అధికులు ?—

వివేకానందుని పెదాలు వెలుగును విరజిమ్మాయి.

"అన్ని విధాలా బంధం, బాంధవ్యం, పాశంలా మనసుని వశం తప్పిస్తుంటే ఇహలోక భాగ్యాలపైన ఆశలు పెంచుతుంటే— పరలోకం పైన వ్యామోహం పెరుగుతుంటే — ఎక్కడికి నిశ్చలత ? ఎక్కడిది వైరాగ్యం ? ? ?

సంసారపాశంలో చిక్కుకున్న ప్రాణి మమతానురాగాలకు దూరమౌటం మనస్సును జయించటం అంత సులభమా ?

అన్నీత్యజించిన వాడికిగానీ — అన్ని బంధా లకూ అతీతమైన వ్యక్తికిగానీ — లోకకల్యాణం కోసం అర్పితమవగల అర్హత వుంటుంది.

ఆ అర్హతను సాధించుకోగలమన్న భ్రమతో భవబంధాలను కౌగలించుకోవటం — జీవితాన్ని నిష్ఫలింగా మృత్యు మందిరంలోకి నెట్టటం వంటిదే..."

కృష్ణారావు కళ్ళముందు వివేకానందుని రూపం మసకబారుతోంది.

"స్వామీ... స్వామీ..."

ఆ ఆర్తి — ఆ రూపాన్ని మరోసారి నిలబెట్టింది.

"స్వామీ — మరి గృహస్థులవల్ల లాభం ?"

"వారు మహాదాతలు. నా దృష్టిలో — ఒక విధంగా పుణ్యాత్ములు. సన్యాసులకు అన్న వస్త్రాలిచ్చి ఆదరిస్తున్నారు. ఒక విధంగా వారిని బ్రతికించి ఆధ్యాత్మికతత్వాన్ని బ్రతికిస్తున్నారు. మహనీయుల శరీరాలు శుష్కించిపోకుండా ఆదుకుని జన బాహుళ్యానికి ఆ రకంగా సేవ చెయ్యగలగటం సామాన్యం కాదు..."

"మరి... మరి... నావల్ల ఎటువంటి సేవలవసరం ?"

కృష్ణారావు మనసు సంధిగ్ధంతో కొట్టుకు లాడింది.

* * *

మనసు వికలంగా వుంది.

అనిశ్చయంతో వుంది.

ఇంట్లోకి అడుగు పెట్టగానే — నిశ్శబ్దం ఊపిరాడనట్టు కమ్ముకుంది.

గుమ్మంలోకి రావటంతోనే విన్పించింది సుపరిచితమైన కంఠం.

తనెప్పుడూ — మర్చిపోలేని— ఆప్యాయతతో కూడిన లాలిత్యం —

కనుబొమ్మలు ముళ్ళుపడ్డాయి.

"ఏమిటీ ? మన కృష్ణుడా ? — మన కృష్ణుడేనా ?"

కృష్ణారావు నవ్వుతూ చేతులు జోడించాడు.


"ఎంతలోకి ఎదిగిపోయావోయ్... రారా... నేను గుర్తున్నానా ?—"

తనకిష్టమైన వింత తేజస్సును శ్రీహరి బాబాయి కళ్ళలో చూస్తూ చిన్నగా నవ్వాడు.

సాధన

అనుకున్నది సాధించడానికి
సాగించే సమరానికి
కావాలి దీక్ష
చెప్పినది చేయడానికి
చేసే కృషిలో
ఉండాలి నిజాయితీ
అవి లేకుండా ముందుకు సాగితే
మిగిలిపోతావు నిరర్థకంగా
ఓ మనిషీ
ఇకనైనా నిరాశా నిస్పృహలను
త్యజించు
దురాచారాలను నిర్భీతితో ఖండించు
అశాంతి ప్రజ్వరిల్లినా
చీకట్లు చెలరేగినా
ఆగిపోకు
నిరంతర పోరాటాన్ని సాగించు
చైతన్య జ్యోతిని వెలిగించు
అభ్యుదయ ధ్యేయాన్ని సాధించు.

— షాజాద్



"ఏమోయ్... గుర్తున్నానా ?"

ఆయన రెట్టిస్తుంటే — అభిమానంగా చూశాడు.

"మిమ్మల్నెలా మర్చిపోతాను బాబాయ్. చిన్నతనంలో మీరు మమ్మల్ని ఆదుకోటం గుర్తుంది. ఆ రోజుల్లా విడవకుండా మీరు చెప్పిన గీత—"

"అదే ఇప్పుడు... ఏకు మేకైంది బాబూ..."

తల్లివంక బాధగా చూశాడు

వదిన ముభావంగా వుంది.

" .ఏది ఏమైనా మన మంచికే అనుకుంటున్నాను బాబాయ్. . అలా అనుకోటంలో తప్పుందా ?"

కృష్ణని చూసి మెత్తగా నవ్వారు శ్రీహరిగారు.

"తప్పు ఎవరిలోనూ లేదు బాబూ ఎవరి పరిధుల్లో వారుండి— ఎవరి ఆలోచన్లను వాళ్ళు బయిట పెట్టుకోటం సహజం. సహజమైన దానిని విమర్శించే హక్కూ అర్హతా— ఐనవాళ్ళకుంటాయి తన వాళ్ళ కోసం బాధపడుతూ వుండటంలోనూ తప్పు లేదు. "

కృష్ణారావుకి అర్థం కాలేదు

బాబాయి ఏదో అనబోయి ఏదో అంటున్నాడు. ఐతే ఆయన రాకకు మాటకు ఏదో బలమైన కారణముందని అర్థమౌతూనే వుంది

ఆ కారణం కూడా అర్థం చేసుకోలేనిదేం కాదు

కృష్ణ విషయం గ్రహిస్తున్నాడని అర్థమైంది శ్రీహరిగార్కి.

వెంటనే సంభాషణ తన ప్రియమిత్రుడు వీరరాఘవయ్య వైపుకూ, రామకృష్ణయ్య వైపుకూ తిరిగింది.

* * *

"చెప్పు కృష్ణా— ముందు ముందు ఏం చేద్దామనుకుంటున్నావ్ ?"

ఆ రాత్రి భోజనాలయాక తన మంచాన్ని దగ్గరగా జరుపుతూ కృష్ణనే నిశితంగా చూస్తూ అన్నారు శ్రీహరిగారు.

'ఏం చేద్దామనుకుంటున్నావ్ కాదు — అమ్మ మాటకి ఎంత మాత్రపు విలువ నిద్దామనుకుంటున్నావ్.'

అన్న భావం స్పష్టంగా విన్పిస్తోంది.

ఈ అవకాశం కోసమే ఎదురుచూస్తున్నాడు కృష్ణారావు.

ప్రొద్దుట్నించీ — పరామర్శలూ — సానుభూతీ— కర్తవ్య బోధలూ— యధా ప్రకారంగా జరిగిపోతున్నా— కృష్ణారావు మనసు మటుకు తేలికపడటమంటూ జరగలేదు. తన జీవితంలో తను కోరని— తను అనుకోని అతి ముఖ్యమయిన అవాంఛనీయ సంఘటనకి జరిగేదంతా— నాందిలా కన్పిస్తోంది.

అందుకే అశాంతిగా గడిచిపోయింది.

తనని అర్థం చేసుకుని— సానుభూతితో తనతో సహకరించి, నిజమైన ఆత్మీయతతో తన మనోభావాలను కలగలుపుకుని తన నిజాయితీతో సలహా నందించగల మానసిక స్థాయి ఒక్క శ్రీహరి బాబాయికే వుందని తనకి తెల్సు

ఇద్దరూ ఇటువంటి ఏకాంతాన్నే కోరుకొంటున్నారు.

ఇద్దరూ ఎవరికి వాళ్ళే న్యాయాన్ని కోరుకొంటున్నారు.

"మీరేమనుకుంటున్నారు బాబాయ్—"

మబ్బులు కమ్మిన చందమామలా వున్నాడు కృష్ణారావు

గాఢంగా నిట్టూర్చారు శ్రీహరిగారు.

"నేనేమనుకుంటున్నాననేది ముఖ్యంకాదు. అమ్మ బాధ చూశావుకదా... నీ నిర్ణయం తెల్సుకోవాలనే ఇవాళ ఆగవల్సివచ్చింది —"

నిస్సహాయంగా చూశాడు కృష్ణారావు.

"కృష్ణా — నీపరంగా వచ్చే నిర్ణయంలో — తొందరపాటుతనం వుంటుందని నేననుకోటం లేదు ఎంత తక్కువ సమయంలోనైనా విజ్ఞతగల నిర్ణయాన్ని తీసుకోగలవని కూడా నేననుకుంటున్నాను.. —"

"... ... ..."

"ఐతే... అమ్మ మాటలూ తీసిపారెయ్యదగ్గవి కావు. —"

"... ... ..."

"అమ్మ బాధ అర్థం లేనిదని నువ్వనుకుంటున్నావా ?"

కృష్ణలో భావాలు వెతకటం చాలా కష్టం.

"...కడుపు శోకం ఎంత బాధాకరమైందో తెల్సు విషయం ఆలశ్యంగా తెల్సినా — క్షణం కూడా ఆలశ్యం చెయ్యలేదు. నా చేతనైనంతగా వోదార్చాలని వచ్చాను... కానీ కృష్ణా — పోయిన రాముడి గురించికన్నా వున్న కృష్ణుడివల్లే మనశ్శాంతి వుండటంలేదని కుళ్ళి కుళ్ళి ఏడుస్తోందావిడ."

కృష్ణారావు మొహం చిన్నబోయింది

ఎందుకో ఆ క్షణంలో — కృష్ణలో పసితనమే కన్పించింది. కన్పించని లోపాలు వెతుకుతూ చిన్నగా అన్నాడు.

"...పైకి చెప్పుకోలేకపోయినా మీ అమ్మ, నాన్నగారితో సుఖపడిందెక్కువ లేదు వీరరాఘవయ్యలాంటి మనుష్యులు అరుదుగా వుంటారు. నిజమే. కానీ అటువంటివాళ్ళు వాళ్ళకోసం వాళ్ళే సుఖాన్ని వెతుక్కోగలరేమో గానీ — తనవాళ్ళని సుఖపెట్టలేరు కారణం నీకు తెలియన్దికాదు. ఒక చేతివేళ్ళు అన్నీ వొకలా వుంటాయా ? ఒకింట్లో వున్నవాళ్ళ మనస్తత్వాలన్నీ ఒకేలా ఎందుకుంటాయి ? మీనాన్నలో వైరాగ్య భావం ఎక్కువ. దాన్నే పెంచుకోలేదని మీ అమ్మని తప్పుపట్టగలమా ?

పెంచుకోవాలని శాసించగలమా ?

అలాగే లక్ష్మి కూడా. ఆ వయసులో ఉప్పు కారం తినేవాళ్ల మనసు ఎంత చెంచలంగా వుంటుందో, కోరికలనేవి కళ్ళాలు లేకుండా ఎలా పరుగులు తీస్తాయో అర్థం చేసుకోవచ్చు.

ఐనా మీ అమ్మ—వీరరాఘవయ్యతోనూ,

లక్ష్మి — రామకృష్ణయ్యతోనూ రాజీపడి పోయారు. ఒకరకంగా చెప్పాలంటే— మనసు చంపుకొని—శిలల్లా—వాళ్ల ఇష్టాఇష్టాలను మర్చిపోయి—జడపదార్థాల్లా బ్రతికారంటాను. నాకలాగే అన్పించింది. కాని అనుకున్నవన్నీ జరగక పోయినా—తనకంటూ కొన్ని కోరికలు మిగిలున్నాయంటుంది మీ అమ్మ. ఆ కోరికలన్ని నాపరంగా తీరాలని ఆశ పడుతోందావిడ ...—''

". . . .."

"...పాపం ఒకర్తి ఇంత ఆస్తిపాస్తుల్నీ— మీ ఇద్దర్నీ ప్రాణంగా పెంచుకొచ్చింది.రాముడలా అన్యాయం చేశాడు..."

కృష్ణారావ్ మొహంలో అర్థంకాని మార్పు కన్పించింది.

"బాబాయ్ ... ఇప్పుడు నువన్నవన్నీ మన స్ఫూర్తిగా అన్నవనే అనుకోనా?"

శ్రీహరి గారు తడబడ్డారు.

"ఏమలా అడిగావ్?—"

"నా చిన్నతనంలో నేనెరిగిన బాబాయ్ ... ఇలా...ఇలా మాట్లాడగలరని అనుకోలేదు...—"

"ఇంకా?"

కుతూహలంలో బాధ్యత కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

"ఈ విధంగా మిమ్మల్ని ప్రశ్నించగలిగే స్థాయి నాకొస్తుందని అనుకోలేదు—" నిర్భయంగా కుండబ్రద్దలు కొట్టినట్టు మాట్లాడుతున్నాడు

"ఆ స్థాయికి నువ్వే దిగానంటావా?— నువ్వూహించని స్థాయికి నేను దిగిపోయానంటావా?"

"ఏదేమైనా నాకంత సంతోషంగా లేదు బాబాయ్.. నామనసులో నాన్నగారికి, అన్నయ్యకూ వున్న స్థానం సామాన్యమైంది కాదు...మిమ్మల్నీ నేనలాగే భావించాను—"

"కానీ — అతి సామాన్యుడిలా అడుగుతున్నారేమిటి?". అన్నభావం చెప్పకుండానే— స్పష్టమౌతోంది. పసివాడు కాదు కృష్ణ. తన అంచనాలను మించి ఎదిగిపోయాడు, అతన్ని

కర్మ యోగి

పూర్తిగా అర్థం చేసుకోవాలంటే—అతని పరంగా తనొక నిర్ణయానికి రావాలంటే తను కొంతసేపు శ్రోతగా వుండటం తప్పని సరి.

"కష్ణా... బాధ్యత...బాధ్యతయ్యా...—"

కృష్ణ నవ్వు విచిత్రంగా విన్పించింది.

తను తెల్సుకోవాలను కుంటున్న అతని భావాలూ—సరిక్రొత్తగానే వుంటాయి. "బాబాయ్...మీకు చెప్పదగ్గ వాణ్ని కాదు. ఆ వయసు జ్ఞానం నాలో లేవు. కాని చెప్పాలనుకున్నది మాత్రం చెప్పగల స్థోమత నాకుంది. అందుకు అర్హతలు అవసరం లేవనుకుంటాను—"

కృష్ణ కళ్లు విచిత్రంగా వెలిగాయి.

"మా పూర్వజన్మ సుకృతమో — జన్మజన్మలా మేము చేసుకున్న పుణ్యఫలమో— కృష్ణభక్తి మా వంశంలో వ్రేళ్ళు నాటుకుపోయింది. ఆ భక్తి, ఇప్పుడిప్పుడే నాలోనూ అంకురిస్తోందనుకుంటున్నాను. ఆ అంకురమే నన్ను భగవంతునికి అర్పించుకునేలా చేసింది. ఐనా భవబంధాల్లో చిక్కుకుని— నా మనస్సుకు నేనే సమాధానం చెప్పకోలేని స్థితిలో వున్నాను నా స్థితి నాకే దుర్భరంగా వుంది. మనసు వైరాగ్యాన్ని కోరుకుంటోంది. కానీ బాధ్యతలు అడ్డంకులుగా—బంధాలు అడ్డుగోడల్లా— ఎప్పటికప్పుడు నా సంఘర్షణని పెంచుతూనే వున్నాయి ...—

బాబాయ్ — కర్తవ్యం తెలియటం లేదు. కాలం విలువ విపరీతంగా భయపెడుతోంది.

అన్నయ్య కోరిక తీర్చలేక— నాన్నగారి స్థాయికి చేరుకోలేకా — ఎందుకూ పనికిరాని వాడినౌతానన్న దిగులుతో— ఎంతకాలం వృధాగా ఖర్చుపెడుతున్నానో తెల్సా బాబాయ్.

ఆత్మను భగవంతుని పరంచేసి—తుచ్ఛమైన ఐహిక బంధాలను అతి తేలిగ్గా వదిలించుకుని — చివరికి 'మోక్షం'— మోక్షాన్ని కోరటం కూడా తుచ్ఛమనే నమ్మిన నాన్నగారి ఆదర్శం ఎవ్వరికీ అర్థం కాదు. ఎవరూ అర్థం చేసుకోలేరేమో. ఇంత ఐశ్వర్యాన్నీ, లక్షలాది ఆస్తినీ— ఇహంలోనే స్వర్గాన్ని సృష్టించుకోగల స్థోమత వున్న నాన్నగారు— అన్నిట్నీ గడ్డిపోచల్లా భావించి నిజమైన పరమపదం వెతుక్కుంటూ వెళ్ళిపోయారాయన.

ఇటువంటి అహేతుక భక్తి ఎంత మందికి స్వంతం అవుతుంది ?

ఇక అన్నయ్యా --

ఆ మహానుభావుడు అతి ఘో౽ విమర్శించబడుతున్నాడు. కొందరు కిరాతకుడంటున్నారు. పిచ్చివాడంటున్నారు. స్వార్థపరుడంటున్నారు. మనసుకు తోచినట్టల్లా అంటున్నారు. కుటుంబాన్ని 'అపహాస్యం పాలు చెయ్యటానికే చాలా మంది కంకణం కట్టుకున్నారు. నాకు తెల్సు. ఆ ప్రభావం నామీద తీవంగా వుంటుంది. పోగొట్టుకున్న కుటుంబ పరువు నావల్ల తిరిగి పొందాలనే బాధను మిగుల్చుకున్న వాళ్ళూ వున్నారు.

అన్నయ్యని ఎవరు -మటుకు అర్థం చేసుకున్నారు? నాన్నగారి అడుగుజాడల్లో నడుస్తూనే 'పుత్త్రం దేహి, యశో దేహి, ధనం దేహి' అన్న చింత లేకుండా— ప్రతీక్షణం ఆ నీలమేఘశ్యాముని సన్నిధికోసం— ఆ మోహనమూర్తి ప్రేమానురాగాల కోసం — నిద్రాహారాలు శుష్కించి — శుష్కించి— ఈ శరీరంలో నుంచి బైటపడాలని ఎంతగా కొట్టుకుపోయాడో.

బాబాయ్. అన్నయ్యది విచిత్రమైన విరహం. ఆ కృష్ణ చైతన్యుడే కళ్ళకు కట్టేవాడు. నిజమైన విరహమంటే ఇలాగే వుంటుందా అన్పించేది. విరహంతో తేలిపోవటమంటే ఇంతేనేమో అన్పించేది. చివర చివర్లో మరీ అమాయంగా ప్రవర్తించేవాడు. దైవత్వాన్ని నాలాంటి వాళ్ళు అమాయకత్వం అనుకోటంలో తప్పులేదనుకుంటాను. ఎందుకంటే — అంతకు మించి మానసికంగా ఎదగలేదు నేను. అన్నయ్య తన లోకాన్నంతా కృష్ణుడితోనే పరిమితం చేసుకున్నాడు. అపరిమితమైన ఆ భగవానుని స్మరణలో అనంత తత్వాన్ని స్వంతం చేసుకున్న అన్నయ్యని చివరిదాకా నేనూ అర్థం చేసుకోలేక పోయాను.

ధర్మపథం

—బులుసు వేంకటరమణయ్య



క్రమశిక్షణ అంటే కఠినశిక్షా?

తప్పు చేసేవాళ్ళని ఆ తప్పు దారిలో నడవకుండా సరియైన మార్గంలో పెట్టడం క్రమశిక్షణ. ఇది పిల్లలనుంచి పెద్దలదాకా అందరికీ అవసరమే! అలా సరియైన పద్ధతిలో నడిపించడానికి ప్రతి సంస్థకూ కొన్ని నిబంధనలు ఏర్పడి ఉంటాయి. ఫ్యాక్టరీలు, విద్యాశాలలు, సంఘాలు, ఇతర సంస్థలు— వీటన్నిటిలోనూ ఆయా నిబంధనలను లనుసరించి నడుచుకోకపోతే పురోభివృద్ధి కలగదు. ఆ నిబంధనలను అనుసరించడమే క్రమశిక్షణ. అట్టి క్రమశిక్షణకు కట్టుబడి ఉండనివారిని ఆ సంస్థనుంచి తొలగించడంకూడా జరగవచ్చు. ఒకటి, రెండుసార్లు హెచ్చరికను ఇచ్చినా విననప్పుడు తొలగింపు జరుగుతుంది.

''మొక్కైఅయి వంగకపోతే మానై వంగదు'' అనే సామెత ఉన్నది. మంచి అలవాట్లు చిన్నప్పుడు అబ్బకపోతే పెద్దఅయిన తర్వాత అబ్బడం సాధ్యంకాదు. అందువల్ల పిల్లలు బడిలో చదువుకొనేటప్పుడే అవి అలవాటు కావాలి. అందువల్ల పాఠశాలల్లో క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వబడుతున్నది. బిడ్డలకు ఇంట్లో తలిదండ్రుల దగ్గర ఎక్కువ చనువు ఉండడంవల్ల తలిదండ్రుల మాటను అంతగా పట్టించుకోరు. పిల్లలను తగినట్లు అదుపు ఆజ్ఞలలో పెట్టగల శక్తి పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఉంటుంది. పిల్లల మనస్తత్వాలు గ్రహించి వారు మంచిగానూ, లేక బెదరించి తగిన మార్గంలో పెట్టవలసి ఉంటుంది.

క్రమశిక్షణ అంటే కఠిన శిక్ష కాదు ప్రక్కవాళ్ళతో — పాఠం జరుగుతూ ఉండగా మాటలాడడం, పరీక్షల్లో — ప్రక్కవాళ్ళ వ్రాతచూచి, అదేమాదిరిగా వ్రాయడం మొదలైన తప్పులు చేస్తే — అలాటి పనులు చెయ్యకూడదని చెప్పడం, కాగితాలు తీసికోవడం చెయ్యవచ్చునేగాని చావగొట్టితే ప్రయోజనం ఉండదు. అలా కొట్టడంవల్ల మనస్సుకుకూడా నొప్పి కలుగుతుందేకాని, మనస్సు మారడం కష్టం! కొన్ని సందర్భాలలో ఎదురు తిరగడం జరుగుతుంది.

ఆడపిల్లల విషయంలో క్రమశిక్షణపట్ల ఎక్కువ జాగ్రత్త వహించాలి. పాఠశాలలలో మగపిల్లలకంటె ఆడపిల్లలు ఎక్కువ వినయ విధేయతలతోనూ, భయభక్తులతోనూ ఉంటారు... మగపిల్లలను కొట్టిన విధంగా వాళ్లను బెత్తంతో కొట్టే అవకాశం వుండదు. కాని క్రమశిక్షణకు పేరుపడిన కొన్ని బాలికా పాఠశాలల్లో ఉపాధ్యాయినులు చిన్న తప్పులకు కూడా కఠినంగా దండించడం, లేత మనస్సులకుకూడా బాధ కలిగించడం జరుగుతున్నది. అది దారుణ పరిణామాలకు దారితీస్తుంది. ఈ మధ్య జరిగిన ఒక సంఘటన హృదయ విదారకమైనది తెలిసింది ఏదో చిన్న తప్పు చేసినదని ఒక పన్నెండేళ్ల అమ్మాయిని ప్రధానోపాధ్యాయురాలు చావ దెబ్బలు కొట్టి, బడి నుంచి పొమ్మనగా, ఆ అమాయికురాలు ఇటు బడికీ — అటు ఇంటికీ భయపడి, దెబ్బల బాధలు ఆ భయానికి తోడ్పడగా — ఏమి చెయ్యడానికీ తోచక రైలుకింద పడి ప్రాణం పోగొట్టుకొన్నది. ఇది ఉపాధ్యాయులకు గొప్ప గుణపాఠం. క్రమశిక్షణ అంటే కఠిన శిక్ష కాదని గ్రహించినప్పుడేవారు పిల్లలను సరియైన మార్గంలో నడపగలుగుతారు. ★

కృష్ణుడికి తనవల్ల అన్యాయం జరుగుతోందని చిన్నపిల్లాడిలా కొట్టుకుపోయేవాడు. కారణం ఏమిటో తెల్సా బాబాయ్ —

తనకు కన్పించి, తనతో ఆడుకుని, తనకు మోక్షాన్ని అందిస్తాననే భరోసా నందించిన చిన్ని కృష్ణుడికి తనేం న్యాయం చెయ్యలేకపోయాట్ట.

మోక్షానికి ప్రతిబంధకమైన ఈ సంసార లంపటంలో చిక్కుకుని దరీ — దిక్కూ తోచని వారికి, తనకు చేతనైనంతగా ఆధ్యాత్మిక తత్వాన్ని బోధించి—సాధ్యమైనంతవరకూ వాళ్ళని విషయవాంఛలనుంచి దూరం చేసి అసలైన గమ్యమేదో చెప్పలేకపోయాట్ట.

చీకటిలో వున్నవారికి తనపరంగా ఒక్క వెలుగు కిరణాన్నైనా అందివ్వగల ప్రయత్నం చెయ్యలేదుట. మానసికంగాకూడా మరింత కృంగిపోయాడు.

బాబాయ్. కేవలం తను నమ్మిన దైవం మీద ప్రేమతో, అడ్డూ అపూలేని అనురాగ స్రవంతితో — అనూహ్యమైన అంతఃకరణానుబంధంలో — ఆ భగవంతునికేన్యాయం చెయ్యలేదని — ఒకవిధంగా ఆత్మాహూతి చేసుకున్నాడే—

తన తోటివారికి—తను పొందిన ఆనందాన్ని పంచలేకపోయానని చివరిదాకా కలవరించాడే —

ఈ రోజుల్లో అటువంటి వ్యక్తిత్వం అరుదు కదూ –

అటువంటి వ్యక్తి దొరుకుతాడా ?

తన ఆరాధ్యదైవంకోసం — ఆదిత్య సందర్శనంకోసం — పరమాత్మలో ఐక్యం అయే మహాభాగ్యంకోసం — రక్తాన్ని అశ్రువులుగా మార్చి — బొట్టు బొట్టుగా అభిషేకించటం ఎందరికి చేతనవ్తుంది?

కొందరికైనా చేతనవాలనే ఆ బాధను అర్థం చేసుకున్నదెవరు ?

మృత్యువుకోసం — మృత్యు సన్నిధికోసం — ఆనందంతో ఎదురు చూడగల స్థాయికి ఎందరు ఎదగగలరు ?

ఎదగగలిగితే అంతకు మించిన ధన్యత ఇంకేముంటుంది ?

''బాబాయ్... కృష్ణ చైతన్యస్వామి — ఎప్పుడు పుట్టాడని తెల్సు. కానీ — ఆయనకి ప్రతిరూపంలా కన్పించే అన్నయ్యని అర్థం చేసుకున్నదెంతమంది ?''

కృష్ణ కళ్ళల్లో కన్నీటి తెరల చాటున ఆవేశపు సెగలూ కన్పించాయి.

''బాబాయ్! ధన వ్యామోహం — పెచ్చుపెరిగిపోతోంది. పరధనాన్ని స్వంతం చేసుకోవాలనే కాంక్ష— అక్రమ నిల్వలకోసం అడ్డదారులూ — పేరు ప్రఖ్యాతుల కోసం, ఆస్తిపాస్తుల కోసం ఆరాటాలూ— తుచ్ఛ శారీరక సౌఖ్యాల కోసం— అవి తెచ్చే—అనుభూతుల కోసం— అవి చూపించే అక్రమమైన వక్రదారుల కోసం— నిరంతర శ్రమా— దానికి విలువైన కాలాన్ని వ్యర్థం చెయ్యటం —

స్త్రీచాపల్యం, ఇంద్రియ లోలత్వం — శారీరక మానసిక వ్యభిచారం, అందుకోసం వ్యయం, వ్యథ, వేదనా— బాధా— ఇంతే కదూ బాబాయ్. వీటినే కదూ అందరూ హర్షించి ప్రోత్సహించేది ?... వీటినే కదూ జీవితానికి అతి ముఖ్యమైనవిగా అనుకునేది ?

ఇతరుల ద్రవ్యాన్నే కాదు— తన ద్రవ్యాన్ని కూడా ఆశించలేదు అన్నయ్య. అసలు 'తన' అన్న మాటకే అర్థం లేదనేవాడు. అందరూ ఆరాధించే ప్రతీ అంశాన్నీ విషాన్ని చూసినట్టు చూసేవాడు.

కానీ— తనెన్నుకున్న మార్గాన్నే అందరూ విమర్శిస్తున్నారు. చులకన చేస్తున్నారు.—

(ఇంకా వుంది)

బట్టతలోపాఖ్యానము



పాలకోడేటి
తులసీశ్రీరామచంద్రమూర్తి

అప్పుడప్పుడు ఆఫీసు [illegible] టకటక ధ్వనితో, స్టాఫు హడావిడితో ఎప్పుడు కురుక్షేత్ర మహా సంగ్రామము జరుగుతున్నట్లు ఉంటుంది. ఈ కార్యకలాపాలన్నిటికి అతీతుడు, సర్వ కార్య పరిత్యాగి అయిన రంగారావు ఆ ఆఫీసులో [illegible] సీనియర్ గా ఇరవై ఏళ్ళ [illegible], అదే సీటులో గడిపేసి ఆ [illegible] ఎటువంటి సమస్యలు [illegible] ఉన్నా చిటికెలో తీర్చి పరిష్కారము చేయగల సమర్థుడు. [illegible] నాలికలాంటివాడు. అటువంటి రంగారావుకి యీ మధ్య పెద్ద సమస్య వచ్చిపడింది.

ఎన్నో సమస్యలని అవలీలగా పరిష్కారము చేయగల రంగారావు తన స్వంత సమస్యకి సమాధానము [illegible] లేకపోతున్నాడు. ఆఫీసుకి వచ్చినా, బజారులో తిరిగినా, యింట్లో నిద్దర పోయినా ఆ సమస్య [illegible] బుర్రని కొరుక్కు తినేస్తున్నది. [illegible] తను గుర్తించలేని సమస్య [illegible] వెలుగులోకి వచ్చి, అందరి నోట్లో నాని, ఆఫీసు స్టాఫు నుంచి బజారులో పడింది. పరామర్శలు ఎక్కువైపోయాయి.

"ఏమిటీ రంగారావుగారు మీకు అప్పుడే బట్టతలా! ఏమి వయస్సు ముదిరిపోయింది మీకు. ఏదో ఎందో చూకో చూడండి" ఒకళ్ళు కాదు, ఇద్దరు కాదు ప్రతి ఒక్కరు తెలిసి వాళ్ళు, తెలియనివాళ్ళు తన బట్టతల గురించి అడుగుతూ ఉంటే రంగారావుకి చిరాకు ఎత్తిపోతోంది. యిది చాలదు అన్నట్లు మొన్నకు మొన్న ఆఫీసులో చేరిన సుశీల కూడా 'రంగారావు గారు బట్టతల మీకు అందాన్ని యిచ్చింది' అని వ్యంగ్యముగా అని కిసుక్కున నవ్వితే అగ్గిమీద ఆజ్యం పోసినట్లు అయింది రావు పని. అద్దంలో చూసుకొన్నాడు. నిజమే! తన విదియ చంద్రుని లాంటి బట్టతల స్పష్టంగా కనిపిస్తోంది నెత్తిమీద వెంట్రుకలు వెనక్కి వెనక్కి పోతున్నట్లు కనిపిస్తున్నాయి. ఆలోచించే కొలది సమస్య జటిలమవుతుంది కాని సమాధానము కనబడదు. అందుకే రంగారావు యిక ఆలోచించడం మానుకోలేదు.

ఆ రోజు ఉదయం లేచాడు. తెలుసున్న మందుల షాపులన్నీ తిరిగి, బట్టతల పోవటానికి ఎవరే మందు మంచిది అంటే అది తెచ్చి యింటి నిండా స్టాకు వేశాడు. తర్వాత రోజున లైబ్రరీకి వెళ్ళి అన్ని మ్యాగజైన్లు తిరగవేసి 'బట్టతల నివారణకు మందు' అని వ్రాసిన ఎడ్వర్టైజమెంట్లు కంపెనీల ఎడ్రస్సులు తెచ్చాడు. [illegible] ఉద్యమములో మొదటి కార్యక్రమము [illegible] తర్వాత అన్ని కంపెనీలకు వ్రాసి మందులు తెప్పించాడు. రంగారావు కార్యక్రమములో [illegible] ఉంటాయి. ఒకదాని

తర్వాత ఒకటి. చూడండి 'సామరంగా' మూడు నెలలకల్లా నెత్తినిండా జుట్టు, గోదావరి కెరటాల్లాగా వంపులు, సొంపులు తిరిగిపోయి ఉంటుంది. ఎవరైనాయీ మధ్యన వ్యాఖ్యానించినా 'ప్ప్' వాళ్ళకేమీ తెలుసుమనతడాఖా' అనినిట్టూర్చి వాళ్ళమీద జాలి పడుతున్నాడు రంగారావు.

సమయము కావాలనుకొన్న వారికి తొందరగా పరిగెడుతుంది. మూడు నెలలు అయిపోయాయి. మందు సీసాలన్ని ఖాళీ అయ్యాయి. రంగారావుకి బట్టతల మీద వెంట్రుక మచ్చుకైనా మొలవ లేదు. యీ మందుల ప్రగతి ఏమిటయ్యా అంటే విదియ చంద్రుని లాంటి అతని బట్టతల నవమి నాటి చంద్రుడిలా తయారయింది. రంగారావుని బట్టతల గురించి ఎవ్వరూ అడగటము లేదు. రావు కూడా దాని విషయమే మర్చిపోయాడు. ఒకవేళ ఎవరైనా అడిగినా 'ఒరేయ్ బడుద్దాయిలు, బట్టతల విజ్ఞాన వంతులుకి తార్కాణం. పెద్ద పెద్ద నాయకులికి, శాస్త్రజ్ఞులకి అందరికి బట్టతలే. 'నేను దేనికి తక్కువా' అని వాళ్ళకి సరైన సమాధానము చెప్పి బట్టతల మురిపంగా నిమురుకుంటాడు. మనస్సులో మాత్రము 'ఎవరిఖర్మకువారేబాధ్యులు' అని కృష్ణ భగవానుని గీతా వాక్యము నెమరువేసుకొంటాడు.

కాలము గడుస్తోంది. గడిచినా అది ఒకలాగ గడవదు. అవక తవకలు, ఎత్తుపల్లాలు, ఆశ నిరాశలు తప్పవు. అవే లేకుంటే యీ ప్రపంచములో కొందరికి ఎప్పుడు సుఖమే ఉంటుంది. మరి కొందరి జీవితము దుర్లభమవుతుంది. అలా కాకుండా రంగారావుకి మళ్ళీ బట్టతల ధ్యాస తీసుకువచ్చింది పక్కింటి బామ్మగారు.

"ఏం నాయనా. ఇంత చిన్న వయస్సులో అప్పుడే బట్టతలా. ఏవైనా మందులు మాకులు వాడావా" యక్షప్రశ్న వేసింది బామ్మగారు ఊడి పోతున్న ముసుగిని, జారిపోతున్న కళ్ళజోడుని సద్దుకుంటూ.

"చాలా మందులు వాడాను కాని ఏమి సుఖములేదు బామ్మగారు" వినయంగానే చెప్పాడు రంగారావు.

'అలాగా నాయనా, అయితే నీవు జిల్లేడు మందు వాడావా? అది వాడితే తప్పక జుట్టు వస్తుందే' బామ్మగారి ప్రశ్న రంగారావుని కలవర పెట్టింది. ఆశలు రేకెత్తించింది.

'లేదండి. ఎప్పుడు వాడలేదు'

'అయితే మాయింట్లో పుస్తకములో ఉంది. తయారు చేసుకొని తప్పకవాడు నాయనా! మీ తాతగారు ఆయన బతికున్న రోజుల్లో ఎంత మందికో బట్టతల నయం చేసారు. యీ మందు వాడేవంటే నీ తలంతా ఒత్తుగా, బొద్దుగా జుట్టు వచ్చేస్తుంది. అప్పుడు సినిమా హీరోలా ఉంటావు' పుస్తకము తేవటం కోసము బామ్మగారు వెళ్ళిపోయింది.

రంగారావు ఆ ముసలాయన గురించి, ఆయన వైద్యము గురించి విన్నాడు. బామ్మగార్కి మనస్సులోనే థాంక్సు చెప్పుకున్నాడు. జుట్టువస్తే బామ్మగార్కి మంచి పట్టుచీర కొని యివ్వాలని నిర్ధారణ చేసుకొన్నాడు.

'ఇదిగో నాయనా! యీ పుస్తకంలో ఎక్కడో వ్రాసారు. 'వెతికి చదువూ' అంటూ ముట్టుకుంటే వూడిపోయే, అప్పటికి ఎన్నో పేజీలు చిరిగిపోయి శిథిలావస్థలో ఉన్న పుస్తక రాజాన్ని అందించింది బామ్మగారు.

రంగారావు ఆత్రంగా పేజీలు తిప్పసాగాడు. పేజీలు చిరిగిపోయి ఉన్నా కరక్కాయ సిరాతో వ్రాయటంతో అక్షరాలు స్పష్టంగా ఉన్నాయి. 'యురేకా' రంగారావు సంతోషముతో ఎగిరి గంతేసాడు. తల గుమ్మానికి కొట్టుకొని బొప్పికట్టింది. తనకు కావలసిన మందు దొరికింది. గబగబా చదవ సాగాడు.

"అప్పుడే కోసిన వంద వేప ఆకుల నూరి రసము తీయాలి. ఒక పండు ఉమ్మెత్త కాయ, రెండు జిల్లేడు ఆకులు కలిపి ఉడకపెట్టాలి. నీళ్ళు యింకిపోయాక వేపరసము యీ ముద్ద మెత్తగా నూరాలి. యీ మందు రాత్రి నిద్ర పోయేటప్పుడు తలకు రాసుకొని తెల్లటి గుడ్డకట్టి పడుకోవాలి. ఇలా ఒకరోజు చేస్తేచాలు. కాని ముఖ్యగమనిక..."

ఆ తర్వాత కాగితము చిరిగిపోయింది. రంగారావు యిక ఏమి ఆలోచించదలచుకోలేదు. చదివిన వెంటనే పుస్తకము అక్కడ పడేసి కావలసిన సరుకులు తేవటానికి వెళ్ళిపోయాడు. ఆవేళ ఆఫీసుకి శలవుపెట్టి మందు దగ్గరుండి తయారు చేశాడు.

రాత్రి పెందరాళే భోజనము చేసి తయారు చేసిన మందు తలకు దట్టంగా పట్టించాడు తలకు తెల్లటి వస్త్రము చుట్టి మంచముమీద నడుము వాల్చాడు. 'రేపటినుంచి తన రూపే మారిపోతుంది.' మగత నిద్దరలో ఒక తియ్యటి కల. కలలో తను హీరో. తన అందమైన, పొడుగాటి జుట్టును మెచ్చుకుంటూ అందమైన అమ్మాయిలు, తన ఒంక మెచ్చుకోలుగా చూస్తు సుశీల. యిలా కల రంగులు మారిపోతోంది.

ఇంతలో తల దురద మొదలు పెట్టింది. నిద్రకు భంగము కలిగింది. తియ్యటి కల నీరు కారిపోయింది. కండూతిని ఓర్చుకోవడము బ్రహ్మదేవునికే తెలియలేదు అటువంటిది పూర్ రంగారావు ఎంత. తల గబగబా బరక సాగాడు. 'ఆహా' పూర్వీకుల నాటు వైద్యము ఎంత గబాలున పనిచేస్తోంది. అప్పుడే ఫలితము కనిపిస్తోంది. తలంతా సూదులు గుచ్చుతున్నట్లు ఉంది. యిదంతా మందు మహిమే. తలలోంచి అప్పుడే వెంట్రుకలు బయటకు చొచ్చుకు వస్తున్నాయి. సంతోషము ఒక వైపు. తల దురద రెండవవైపు తలంతా గోకి గోకి ఆ దురదా సుఖంతో హాయిగా నిద్దరపోయాడు.

ఉదయము లేచేసరికి చాలా ఆలశ్యం అయిపోయింది. లేచిందే తడవుగా నిలువుటద్దము దగ్గరకు పరిగెత్తాడు. తలకు కట్టిన గుడ్డని జాగ్రత్తగా విప్పాడు.

'ఆశ్చర్యము' ఇది కలయా! వైష్ణవ మాయమా! ఎంత మార్పు? ఎంత మార్పు. తన కళ్ళను తనే నమ్మలేకపోతున్నాడు. అద్దంలో ప్రతి బింబము తనదేనా. ఒక రాత్రిలో యింత మార్పా. తను స్పృహలో ఉన్నాడా లేదా [illegible] గిల్లుకొన్నాడు! కళ్ళు మరీ నలుపుకు చూసాడు. అద్దంలో ఉన్నది తనే. రంగారావ్ కాని రంగారావులా లేడే. తను 'రంగారావు మైనస్ ఆఫ్ జుట్టు' అయితే ప్రతి బింబము రంగారావు మైనస్ ఫుల్ జుట్టులా ఎలా కనిపిస్తున్నది. తన నెత్తిమీద జుట్టుకాస్తా ఏమైంది. తనకు బట్టతల పోయి గుండు ఎలా అయింది. ముందు ఆశ్చర్యం తర్వాత ఆలోచనలోపడాడు రంగారావు. తనను యిన్నాళ్ళు అంటిపెట్టుకొని ఉన్న జుట్టు ఏమైనట్లు. తన నవమినాటి చంద్రుని తల, పూర్ణిమ చంద్రునిలా ఎలా అయింది? రంగారావులో ప్రశ్నపై ప్రశ్న. తను ఎప్పుడు ఆఫీసులో యిలా ఆలోచించలేదే! రంగారావులో బల్బు వెలిగింది. ఇదంతా మందు ప్రభావమన్న మాట. ఏమది! ఎంత హతవిధి. అద్దం ముందే స్వగతము, ఏకపాత్రాభినయనము చేస్తున్నాడు రంగారావు.

'అయిందా సంబరము. నేను ఆ మందులు మాకులు వాడద్దని మొత్తుకుంటే విన్నారా. ఇప్పుడు అనుభవించండి' నవ్వాపుకోలేక దులప వలసింది దులిపి కాఫీ గ్లాసు అక్కడ పెట్టి వెళ్ళిపోయింది రంగారావు ధర్మపత్ని.

రంగారావులో ఏదో వెలుగు. ఏదో సంతృప్తి. గుండు అయితే అయింది. బట్టతల వదిలింది. మురిపెంగా నిమురుకున్నాడు గుండును. తన ఫస్టుకేసులో రోగి చస్తే చచ్చాడు వాడి జ్వరము మాత్రము తగ్గింది అని సంతోషముతో కేరింతలు కొట్టే కుర్రడాక్టరులా.

కాని అసలు విషయము మాత్రము రంగారావుకు పదిరోజుల తర్వాత తెలిసింది. అది కూడా బామ్మగారి నోటి ద్వారా. 'నాయనా! ఆ మందు బట్టతల మీదే రాయాలి. అంతేకాని జుట్టుకు తగలనీయకూడదు ఆ! రెండవ విషయము ఎంత దురద వచ్చినా గోకకూడదు.'

'చాల్లే నిర్వాకము తల్లీ' అని మనస్సులో అనుకొని 'నయం, ఇంకాపట్టుచీర తెచ్చి యింట్లో పెట్టలేదు' తన తెలివికి తనే సంతోషపడ్డాడు రంగారావు.

'అమ్మా! నాన్నకు పూర్తిగా గుండు అయింది కదా యిప్పుడా మందు రాస్తే జుట్టు తలంతా వస్తుందా!' తన కొడుకు తల్లిని అడుగుతున్న ప్రశ్న విననట్లు పేపర్లో తల దూర్చాడు రంగారావు.

ఒంటిలో తల్లీ కొడుకుల నవ్వులు సన్నాయి జంటగా వినిపిస్తున్నాయి రంగారావుకు. ★

భార్యని హింసించటం మానసిక జాఢ్యమా?

భార్యని హింస పెట్టటం అనేది సర్వ సాధారణంగా జరిగేదే అని అంగీకరించక తప్పటంలేదు. పత్రికలలో వార్తలే దీనికి నిదర్శనం.

ఆధునిక కాలంలో మహిళల ఉద్యమాలు మొదలయ్యాయి. వీటివలన కూడా ఆడవారికి జరిగే అన్యాయాలు మరింతగా చర్చనీయాంశాలు అవుతున్నాయి. వనితలు ఒకరి ఇంట్లో పుట్టి పెరిగి, తనదంటూ ఏమీలేక ఇంకొకరి దయా దాక్షిణ్యాలమీద బతుకవలిసిన సంస్కృతి మనది. పాతివ్రత్యం, ఇంకా ఇతర మతపరమయిన అంశాలు ఈ సమస్యకి ముసుగులుగా తయారయ్యాయి.

అసలు భర్తలు భార్యలని ఎందుకు హింస పెడతారు ? ఈ రకం నడవడి ఒక మానసిక రుగ్మతా ? చాలామందే ఈ ప్రశ్నలు వేస్తూ ఉంటారు

ఇతరులని హింస పెట్టటం ఒక రకం (మానసిక) బలహీనత. తమకి ఇటువంటి బలహీనత ఉన్నట్లు హింసపెట్టేవారికే తెలియక పోవచ్చు. ఇది చాలామందికే ఉండే బలహీనత. కాని దుస్సంఘటనలు బయటపడకపోవటంతో స్త్రీలు ఎవరితోనూ చెప్పుకోలేక నలిగిపోతూ ఉంటారు.

ఈ బలహీనత అన్ని జాతులలోనూ, కులాలలోనూ, మతాలలోనూ, తరగతులవారి లోనూ ఉంటుంది.

మాదకద్రవ్యాలు తీసుకునేవారిలో ఇది ఎక్కువగా ఉంటుందని పరిశోధనలు తెలుపుతాయి.

ఆడవారిని హింసపెట్టేవారి వ్యక్తిత్వంలో కొన్ని లోపాలు ఉంటాయనుకోవచ్చు. అవి వారి నడవడి, మనసు, సంస్కృతి — వీటికి సంబంధించినవని మనస్తత్వ శాస్త్రజ్ఞులు అంటూ ఉంటారు. మనుష్యుల మధ్య సంబంధాలు కూడా లోపభూయిష్టంగా ఉండవచ్చు.



ఈ వ్యాసరచయిత డాక్టర్ నిప్పన మెట్ల అశోక్ కుమార్, యం.బి.బి.యస్, డి.పి.యం. పట్టాలుపొందారు. ప్రస్తుతంమానసిక వైద్యులుగా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో,సిద్దార్థ మెడికల్ కాలేజిలోని మానసిక వైద్య విభాగంలో సహాయాచార్యులుగా పని చేస్తున్నారు గతంలో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజనులో సహాయక మండల చికిత్స అధికారిగా, మానసిక వైద్యులుగా పనిచేశారు. కర్నూలు మెడికల్ కాలేజిలో వైద్య విద్యనభ్యసించి, ఉస్మానియా వైద్య కళాశాలకు సంబంధించిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌లో పనిచేశారు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, బెంగుళూరులోకూడా కొంతకాలం చేశారు

భార్యలని బాధించటం ఒక వంశంలో ఎక్కువగా ఉండవచ్చు. పెద్దవారిని చూసి పిల్లలు ఈ అలవాటు చేసుకోవచ్చు అంతే కాకుండా హింసకి గురిఅయినవారు సయితం ఇతరులని హింస పెట్టటానికి ఇష్టపడవచ్చు — మేము కష్టపడ్డాము, మీరూ కష్టపడండి ! అనే మనస్తత్వం అలవాటు అవుతుందన్నమాట.

ఈ రకంగా ప్రవర్తించే వారి మనస్తత్వాన్ని మనశ్శాస్త్రవేత్తలు ''పరిపక్వం చెందనిది''అనీ, ''ఇతరుల మీద ఆధారపడేది'' అనీ, ''దృఢంగా వ్యవహరించలేనిది'' అనీ వర్ణిస్తారు.

తమకి ఏదో లోపించింది అనుకునేవారు ఈ విధంగా నడుచుకుంటూ ఉంటారు. తమ మనో దౌర్బల్యాలని ఇతరుల హింస ద్వారా సంతృప్తి పరుచుకోవటం వీరి పద్ధతి. అంతేకాదు. ఎవరిమీద కోపం, ద్వేషం వంటి భావాలు కలిగినా వాటిని తమ భార్యల మీద తీర్చుకోవటం వీరికి అలవాటు.

క్రౌర్యం తమకి తెలియకుండానే ప్రదర్శిస్తూ ఉంటారు వీరు. తండ్రిని అనుకరించటం ద్వారా క్రౌర్యాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. భార్యలకి పరీక్ష పెట్టాలనే కోరికతో కూడా క్రౌర్యానికి పాలుపడుతూ ఉంటారు.

భార్యలని హింసించటం 'మగలక్షణం' అని అనుకునేవారూ ఉంటారు.

ఇక 'ఆడవారు మనుషులు కారు ఆస్తులు' అనుకునేవారు ఎలాగూ ఉంటారు

స్వంత ఆదాయం కల భార్యల మీద కోపం మరీ అధికం అవుతూ ఉంటుంది వారు తమ అదుపులో ఉండరేమో! అన్న అనుమానం మానసికంగా రోగులు అనతగిన భర్తలకి కలిగి నప్పుడు వారు మరీ రెచ్చిపోతారు.

పురుషులమీద ఆధారపడి జీవించటానికి అలవాటుపడిన వనితలు తమ భర్తలు క్రూరులు అని చెప్పుకోవటం తమకి అవమానం అనుకుంటారు. వారు తమని తామే నిందించుకుంటారు కాని భర్తలని ఏమీ అనరు, వారిని ఎదిరించరు. వారిచేత వాతలు పడినా, దెబ్బలు తగిలినా సహిస్తారు. భార్యలని బలాత్కారం చెయ్యటం అనేది కూడా ఉంది. డాక్టరులకి ఈ యదార్థం తెలుసు. భర్తలచేత బలవంతంగా లైంగిక సంబంధాలకి గురిఅయిన వనితల జననేంద్రియాలు గాయాలు పడటం జరుగుతూ ఉంటుంది. భర్తలు సాధారణంగా తాగి ఈ విధంగా ప్రవర్తిస్తూ ఉంటారు

భార్యలని హింసించే వారిలో కొందరు తాత్కాలికంగా పశ్చాత్తాపం చెందుతూ ఉంటారు కాని వారి పశ్చాత్తాపం ఎక్కువ కాలం నిలువదు. మళ్లీ మామూలుగానే హింస మొదలు పెడుతూ ఉంటారు.





భార్య శీలాన్ని శంకించటం ఒకరకం మానసిక జాడ్యం. ఇది ఒక సామాజిక సమస్య కూడా.


ప్రతి భర్త ఒకసారయినా ఆత్మావలోకనం చేసుకోవాలి. ''నేను నా భార్య పట్ల న్యాయంగా, సరసంగా ప్రవర్తిస్తున్నానా ?'' అన్న ప్రశ్న వేసుకుని చూడాలి. అవసరం అయితే మానసిక వైద్యుడి (సైకియాట్రిస్టు)ని సంప్రదించాలి.

మానసిక వైద్యులు వ్యక్తిగతంగా, సామూహికంగా చికిత్స చెయ్యటం అవసరం అంటారు.

అంతేకాకుండా చికిత్సలు మానసికంగానూ, సామాజికంగానూ కొనసాగ గలవు.

భార్యలకి సూచన : భర్తతో సర్దుకుపోవటం అవసరమే. అయితే, మానసిక వైద్యుడి సలహా పొందటమూ అవసరమే.

— డాక్టర్ ఎస్. అశోక్ కుమార్



జొన్నలగడ్డ లలితాదేవి

సీరియల్



మారేడు దళం

(గత సంచిక తరువాయి)

ఒకసారి తండ్రికి ఉత్తరం రాసింది. దానికి వెంటనే జవాబుకూడా రావడంతో ఆమెకి ఉపశమనం కలిగింది.

"చిరంజీవి సింహాళకు, మీ నాన్న దీవించి వ్రాయునది – నువ్వు రాసిన జాబు అందినది. మీ అమ్మ మొన్నీమధ్య మేడమీదనుంచి పొరపాటున కాలుజారి పడిపోయింది. కాలు ఎముక విరిగింది. ఇప్పుడు మంచంలోంచి బొత్తిగా లేవడంలేదు. నీకు ఏమైనా అవకాశంవుంటె ఒకసారి వచ్చి చూసిపోవలసింది."

ఇట్లు,
మీ నాన్న రామగోపాల్.

ఆ ఉత్తరం చదవగానే తల్లి గుర్తు వచ్చి కళ్ళంబడి నీళ్ళు తిరిగాయి.

అది చూడనే చూశాడు ప్రవీణ్.

"ఏమిటి కవరు చేతిలో పెట్టుకుని కళ్ళ నీళ్ళు పెట్టుతున్నారు ?" అంటూ కంగారుగా అడిగాడు.

దానికి సమాధానంగా ఆ కవరే చేతికిచ్చింది సింహాళ.

అప్పటికి మధ్యాహ్నం అందిన ఉత్తరాన్ని సాయంత్రం పనంతా అయ్యాక తీసి చదువుతోంది... నాలుగవసారి. అది పూర్తిగా చదివి తిరిగి ఆమెకే అందిస్తూ –

"వెళ్ళి ఒకసారి చూసిరండి" అన్నాడు ప్రవీణ్.

"నేను అదే అనుకుంటున్నాను. కాని వెళ్ళాలంటే ఏదో బెరుకు."

"బెరుకా ! మీకన్నవారింటికి మీరు వెళ్ళడానికి బెరుకు దేనికి ?"

"మీకు ఏం చెప్పను ?" అంటూ ఆగి –

"మా అమ్మగారికి– నాన్నగారికి యిష్టం లేని పెళ్ళి ఇది. వాళ్ళు ఒప్పుకోకపోయినా నేను తెగించి మీ అన్నయ్యగారి కోసం అందర్నీ వదులుకున్నాను" అంది కళ్ళు వత్తుకుంటూ.

ఆ మాటకి సానుభూతిగా చూశాడు ప్రవీణ్.

"మీరు చాలా పొరపాటు చేశారు. ఇక్కడ మీరు ఏం సుఖపడుతున్నారని ? అన్నయ్య ఉన్న కాసేపూ సూటిపోటీ మాటలతోనే వేధించుకు తింటాడయ్యే– మీరు ఏం చూసి ఇక్కడ ఓరిమితో వున్నారో నాకు అర్థం కావటంలేదు." అంటూ ఆమెకేసి చూశాడు ప్రవీణ్.

సింహాళ దానికి బదులు చెప్పకుండా ఒకసారి ఆకాశంకేసి చూసింది.

ఆకాశంలో తళుకు లీనుతూ తారలు–వాటి మధ్య దశమినాటి జాబిల్లి.

"చూడండి. ఆ ఆకాశంలో ఎన్నో నక్షత్రాలున్నాయి. ఒక్క నక్షత్రం భూమిని చేరడానికి ఎన్నో వేల సంవత్సరాలు ప్రయాణం చేసి వస్తుందట.

అలాగే ఎన్నాళ్ళకయినా ఆయన మనసు మారకపోతుందా అని ఇలాగే నెట్టుకువస్తున్నాను రోజులు" అంది నిరాశ అణచుకుంటూ.

"మీ ఆశాభావానికి మీ ఓర్పుకు నేను హృదయపూర్వకంగా అభినందిస్తాను. కాని ముందు మీరు ఒకసారి మంచాన పడిన మీ అమ్మగారిని చూసిరండి. అది మీ విధ్యుక్త ధర్మం" అన్నాడు ప్రవీణ్

"వెళ్ళాలనేవుంది – మీ అన్నయ్యగారితో చెప్పి ఆయన ఏమంటారో వినాలిగా."

"వినండి. వెళ్ళమంటే మీకు తోడుగా నేను వచ్చి దింపుతాను" అన్నాడు ప్రవీణ్.

అలాగే నన్నట్లు తల పంకించింది.

ఆ రాత్రి ఎందుకనో పాపం పెందరాడే వచ్చాడు నవీన్. మేఘాచ్ఛాదిత చంద్రబింబంలా వున్న ముఖాన్ని చూసి కాస్త తికమకపడ్డాడు

అతని కూతురు భరణిని పంపించేసింది అనూరాధ.

ఆ పిల్లని హాస్టల్లో వుంచాడు కాని యింటికి తీసుకువచ్చి సింహాళ నెత్తిన ఎక్కించలేదు


సింహాళ తీసుకురండి అంటుందేమో ! తెచ్చి ఇంట్లో దింపుదాం అన్నట్టు సిద్ధంగావున్నాడు చెవులు దోరబెట్టుకుని ఆ మాట కోసం. కాని సింహాళ ఆ పిల్లకి చదువుమీదున్న భక్తి శ్రద్ధలు అతని నోటినుంచే విన్నాక ఒకటి రెండేళ్ళు హాస్టల్లో వుంచుతేనే నయం అనుకుని అసలా మాటే ఎత్తలేదు.

ప్రవీణ్ కూడా ఆ విషయంలో మనసులోని సింహాళ అభిప్రాయమే వ్యక్తీకరించాడు పైకి.

అతను కాస్త సౌమ్యంగానే వున్నాడని గ్రహించిన సింహాళ భోజనాలయ్యాక ఆ ఉత్తరం నవీన్ చేతిలో పెట్టింది. ఆ ఉత్తరం ఆ మూలాగ్రం చదివాడు నవీన్.

"అయ్యో ! పాపం మీ అమ్మగారు పడిపోయారా ? తప్పకుండా వెళ్ళు, వెళ్ళి చూసిరా– నేనూ నీతో వచ్చేవాడినే– కాని మా వాళ్ళంతా ఔట్‌డోర్ షూటింగ్‌కు వూటీ వెడుతున్నారు. అక్కడ నేనోచిన్న పాత్రలో నటించాలి. అంచేత రాలేనందుకు ఏమీ అనుకోకు" అంటూ జేబు

జరిగిన కథ – 8 : సమత, అమలేశ్వర్ – జాలయ్య దగ్గరకు వచ్చి వెండి గ్లాసు తాకట్టుపెట్టి యాభై రూపాయలు తీసుకొని హరి దగ్గరకు వెళుతారు. జాలయ్య దగ్గరి వెండి సామానంతా దొంగలించుకు వస్తాడు హరి. దానిని సమత, అమలేశ్వర్, హరి మూడు బాగాలుగా చేసి అమ్మేసారు. సమత తన భాగం డబ్బు అమలేశ్వర్‌కు ఇచ్చేస్తుంది. హరి తన భాగం డబ్బుతో టీ షాపు పెడతాడు. సింహాళ, నవీన్ మద్రాసులో కాపురం పెడతారు. నిర్మాత సినీ దర్శకులు అయిన చక్రధరరావు నవీన్ రాసిన కథను పిక్చరు తీయాలనుకుంటున్నట్లు, ఆ సంగతి మాట్లాడను చక్రధరరావు నవీన్‌ను ఆహ్వానించినట్లు నవీన్‌తో చెపుతాడు సంజీవరావు. వినోద్ అమలేశ్వర్‌కు గుడిలో పూజారి ఉద్యోగం ఇచ్చాడు. నవీన్ తమ్ముడు ప్రవీణ్ కువైట్ నుంచి వచ్చాడు. రాత్రి బాగా తాగివచ్చిన నవీన్ తమ్ముడిని గుర్తించక ఎవరో అనుకొని సింహాళను అనుమానిస్తాడు. సింహాళకు పూలపానుపు అనుకున్న జీవితం నరకం అయ్యింది. అమలేశ్వర్, సమత కారులో పోతున్న దంపతుల దగ్గర నగలు దోచుకొని గుడిలో దాస్తారు. హిందీ చిత్రరంగంలో అప్పుడప్పుడే పైకివస్తున్న తార కాంతి నవీన్‌కు పరిచయమౌతుంది. దినదినానికి నరకతుల్యమవుతున్న తన జీవితాన్ని తలచుకొని కుమిలిపోతుంది సింహాళ. సమతను తీసుకొని అమలేశ్వర్‌ను గుర్రం పందేలు ఆడను బొంబాయికి రమ్మంటాడు వినోద్. సమత అందుకు తన అంగీకారం తెలుపుతుంది. నవీన్‌తో సింహాళ జీవితం దినదిన గండంగా తయారయ్యింది. ఆ బాధలో ఆమెకు తల్లితండ్రులు గుర్తుకు రాసాగారు.



లోంచి పర్సు తీసి డబ్బు చూశాడు— అందులో ఆరుపదిరూపాయల నోట్లు వున్నాయి— అవి తీసి ఆమె కందించాడు. "రేపుదయం ఏదో ట్రైనులో బయలుదేరి వెళ్ళు," అన్నాడు గబగబా.

అది ఆగ్రహమో – అనుగ్రహమో అర్థం కాక తెల్లబోయింది సింహళ.

ఏదయితేనేం తను వెళ్ళడానికి ఏం అభ్యంతరం పెట్టనందుకు, మీ పుట్టింటివారికి ఉత్తరం ఎప్పుడు రాశావు ? ఎందుకు రాశావు ? ఏమని రాశావు ? అంటూ రంధ్రాన్వేషణ ప్రారంభించనందుకు ముందు సంతోషించింది సింహళ.

ఆ పూటే బట్టలు సర్దుకుంది.

"నేను వెళ్ళి రైలు ఎక్కించి వస్తానే అన్నయ్యా!" అన్నాడు ప్రవీణ్.

"అలాగే! ఎక్కించు." అంటూ వెళ్ళి మంచం మీద పడుకున్నాడు. ఈ మధ్య ఒక వర్ధమాన తారతో అతను తిరుగుతున్నాడని సింహళకి పూర్తిగా తెలిసింది.

అయినా ఆమె నిలదీసిఅడగలేదు. అడగి దలుచులేదు కూడా. అడిగి ఇంట్లో రభస ఎందుకులే అని నిర్లిప్తంగా వూరుకుండి పోయింది.

ఇప్పుడు తనని ఆడ్డంగా వూహించుకునే వెళ్ళమన్నాడో — లేక జాలి, సానుభూతితోనే వెళ్ళమన్నాడో ఆమెకి అర్థంకాలేదు. ఆ మర్నాడు ప్రవీణ్ లేచి సింహళతో సమానంగా తయారై పోయాడు. ఆమెని తీసుకుని సెంట్రల్ స్టేషన్‌కి వచ్చాడు. నవీన్ వాళ్ళకంటే ముందే వెళ్ళిపోయాడు.

ట్రయిన్ టిక్కెట్లు రెండు తీసుకుంటున్న అతన్ని చూసి "మీరుకూడా వస్తారా?" అని అడిగింది సింహళ ఆశ్చర్యంగా.

"అవును — ఒక్కదాన్ని పంపడం నాకు ఇష్టంలేదు." అన్నాడు ప్రవీణ్ ఆ మాటకు మనసులోనే సంతోషించింది సింహళ.

ఈ సారి రైలు ప్రయాణం ఆమెకి బోరు అనిపించలేదు-- కావలసినన్ని కబుర్లు చెప్పాడు ప్రవీణ్.

అతను స్వతహాగా సరదా మనిషి చాలా ఫన్నీగా మాట్లాడటం--పదిమందిని నవ్విస్తూ వుండటం అతని స్వభావం.

సింహళ ఆడపిల్ల కావడం అటుంచి అన్న భార్యగా దర్శన మీయడం. అన్నగారిలో అంత వరకూ కనిపించని మనో ప్రవృత్తి లేవో ఒక్కసారిగా దర్శనమీయడం.

తన వూహాల్లో ఎంతో ఉన్నతంగా అన్నని వూహించుకున్నప్పటికీ ఇప్పుడు ధనం — కీర్తి అన్నీ అధికం అయ్యాక మారిన అతని ధోరణికి అతనేమీ ఆనందించలేదు సరిగదా మనసులోనే బాధపడేవాడు.

సింహళపట్ల అతను అనుసరిస్తున్న వైఖరి ప్రవీణ్‌కి చాలా ఆవేదననే కలిగించేది.

ఆమెతోపాటు అతనుకూడా మూగ బాధ ననుభవించేవాడు

ఓ విధంగా ఆమె పుట్టింటికి వెళ్ళడం అతనికి చాలా సంతోషాన్నే కలిగించింది.

ఆమెని ఇంటిదగ్గరకు తీసుకువచ్చాడు ఆటోలో

15

బొంబాయి రేస్ కోర్సు అత్యంత కోలాహలంగా వుంది ఎవరి ముఖాలు చూసినా ఆందోళన, ఉత్కంఠమిళితమై వున్నాయి.

అమలేశ్వర్, వినోద్ బైనాక్యులర్స్‌తో పరుగెడుతున్న గుర్రాలనే ఆత్రంగా గమనిస్తున్నారు.

తను వేసిన టిక్కట్లను ఒకసారి జేబులోంచి తీసి చూసుకున్నాడు అమలేశ్వర్.

పరుగెడుతున్న గుర్రాలను చూస్తున్న వినోద్ ముఖం ఎర్రఅగా కందిపోయింది.

అమలేశ్వర్ వేసిన గుర్రాలు అతని చెవుల్లో గింగురుమంటున్నాయి

అమలేశ్వర్‌కి తను వేసిన గుర్రాలు తీసి చూసుకుంటేగాని గుర్తు రాలేదేమోగాని అతనేం వేశాడో వినోద్‌కి చక్కగా గుర్తుంది. అక్కడ వస్తున్న గుర్రాలను చూసేసరికి చాలామటుకు అర్థం అయిపోయింది వినోద్‌కి.

"నో! అలా వీల్లేదు తిండికి ఠికానా లేనట్లు తిరుగుతూ — తన గుడిలో అర్చకుడిగా పడివుండే వెధవకి గుర్రప్పందాలలో అడుగు పెట్టీపెట్టగానే వేలు లాభమా?" కుతకుతా వుడికిపోయింది వినోద్ మనసు.

అతని బుర్రలో మెరుపులా మెరిసింది ఏదో పాడుబుద్ధి. అంతే! "ఇప్పుడే వస్తాను." అంటూ క్షణంలో మాయమయ్యాడు.

ఎందుకో అర్థంకాని అమలేశ్వర్ గుర్రాలనే కుతూహలంగా పరికిస్తున్నాడు.

తను వేసిన గుర్రాలే వచ్చేట్లున్నాయని మనసులోనే ఆనందిస్తున్నాడు. అంతే! కనుమూసి తెరిచేంతలో ఏం మిరికిల్ జరిగిందో— ఎవరూ వూహించని గుర్రాలు కనిపిస్తుంటే తెల్లబోయి చూడసాగాడు అమలేశ్వర్.

గెలిచిన గుర్రాలను ప్రకటిస్తుంటే నిర్విణ్ణుడై వినసాగాడు. తను వేసిన గుర్రం ఒక్కటీ రాలేదు. తను ఓడిపోయాడు. ఈ మాట తట్టగానే ముఖంలో నెత్తురుచుక్క లేనట్లయిపోయింది అమలేశ్వర్‌కి.

ఆడవాళ్ళ వేపునించి పరుగెత్తుకుంటూ వచ్చింది సమత. కళాకాంతీలేక వెలవెలబోతున్న అమలేశ్వర్ ముఖం చూడగానే గ్రహించింది సమత.

"పద సమతా వెళ్ళిపోదాం" అన్నాడు కంఠం పెగల్చుకుని.

ఇంతలో అక్కడికి వచ్చాడు వినోద్.

"హలో అమల్! నేను చెబుతూనే వున్నానా ఆ గుర్రాలు రావని— నువ్వే కావాలని వేశావు —"

"నేను వేసిందే కరెక్టు అయింది— ఇప్పుడు నాకు ఆరువేల ఎనిమిది వందల యాభై వస్తుంది" అన్నాడు గర్వంగా.

అతనికేసి ఒకసారి చురుగ్గా చూసింది సమత.

"జయాపజయాలు అదృష్టంమీద ఆధారపడి వుంటాయి. మనకి ఇలాంటి గొడవలు వద్దు అని మా బావతో మొత్తుకున్నాను— విన్నాడా."

"ఎవరో పెద్దమనిషి మా బావ చేతిలో ఇలాంటి ధనరేఖ ఏలూరు రోడ్డంత పొడుగుందని చెప్పాడట — అది పట్టుకుని బయలు దేరాడు.

ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కగలదా అని వున్నవూళ్ళో ఉద్యోగం సంపాదించలేక పోయాడుగాని బొంబాయిలో లక్షలు సంపాదిస్తాడట గుర్రపు పందాలలో" అంటూ పేరు బయట పెట్టకుండా వినోద్‌ని అమలేశ్వర్‌ని జాడించేసింది సమత.

ఆ మాటకి ముఖం మాడిపోయి, అప్పడంలా అయింది వినోద్ ముఖం.

"నేను అంటూనే వున్నాను — ఆ గుర్రాల మీద డబ్బు తగలేయద్దని — అయినా పెద్ద ధీమాగా వేశాడు" అన్నాడు వినోద్.

ఆ మాటకి తీక్షణంగా చూశాడు అమలేశ్వర్.

అమలేశ్వర్ అన్నపేరుకు తగినట్లే అతనికి కనుక మూడవ నేత్రం వుంటే వినోద్ భస్మం అయిపోయేవాడే ఆ చూపుకు.

కాని అమలేశ్వర్ సగటు మనిషి—సామాన్య మానవుడు — అందుకే వినోద్ బతికిపోయాడు.

నిజానికి ఈ గుర్రాలు వెయ్యి అనిగాని — ఇవి వద్దు అనిగాని వినోద్ చెప్పనేలేదు.

ఇవిలా వెయ్యాలి — అవి జాక్‌పాట్ — ఇది ఫోర్‌కాస్ట్‌ఫుల్ అంటూ చెప్పాడేగానీ ఫలాని గుర్రాలు జాక్‌పాట్‌లో రాగలవని అతను చెప్పనే లేదు. తనే తనకి తోచినవి వేశాడు.

ఇప్పుడు ప్లేటు ఫిరాయించాడు. తను చెప్పినట్టుగా వినలేదని డబాయిస్తున్నాడు.

ముక్కూ, ముఖం ఎరుగని వూళ్ళో అతన్ని నమ్మివచ్చినందుకు అతనితో తగువుపడి లాభం ఏముంది?

అందుకే మౌనంగా వుండిపోయాడు. సమతకూడా అది గ్రహించినట్లుంది

చూసే మరమనుషులు!

జపానులోని సుమిటోమో ఎలక్ట్రిక్ కంపెనీ నూటికి నూరుపాళ్ళు మానవ నేత్రంలా పనిచేసే పరికరాన్ని రూపొందించారు. దీనిని మరమనుషులకు ఉపయోగిస్తారు దీనితో మరమనుషులు వస్తువుల ఆకారాన్ని గురిుంచటానికి వీలవుతుంది. ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న దృష్టి పరికరాలు వస్తువులు ఏర్పరచే నీడలను బట్టి వస్తువులను గుర్తించగలవు. ఈ కొత్త పరికరం, దృశ్యాన్ని పూర్తిగా కెమెరా కటకాలముందుంచి, దీనిని సమగ్ర దృష్టితో పరిశీలించి, రేఖల వ్యత్యాసంతో వస్తువును గుర్తించగలదు.

''పద బావా! వెళ్ళిపోదాం'' అంటూ బయలుదేరదీసింది.

ఇద్దరూ హోటల్లో రూంకి వచ్చారు.

అమలేశ్వర్ మటుకు వచ్చిరాగానే మంచం మీద వాలిపోయి అదేపనిగా ఆలోచించసాగాడు

ఆ మౌనాన్ని భరించలేక సమతే రెండు మూడుసార్లు పలకరించబోయింది

''ప్లీజ్! సమతా! నన్ను పలకరించకు'' అన్నాడు మెల్లగా

''అదే మనసులో పెట్టుకుంటున్నావ్ బావా! వెధవది— ఆ సిగ్రెట్లు(ఇంటర్వ్యూలు) పోతే పోనీ— వస్తే ఎంత? పోతే ఎంత? దేవుడు చల్లగా చూడాలి గాని'' అంటూ ఓదార్చబోయింది.

''ఆ దేవుడు చల్లగా ఎందుకు చూడడో కనుక్కొందాం''

''ఎవర్ని! మళ్ళీ వినోద్ నేనా?''

''కాదు నా అదృష్టాన్ని నేను పరీక్షించుకుంటాను''

''అందుకు వక్రమార్గం కాకుండా వుంటే చాలు'' అంది సమత

''ఇవన్నీ వెనక రోజులు సమతా! నీతిగా— నిజాయితీగా పోతుంటే ఈ రోజుల్లో గుక్కెడు గంజి కూడా దొరకడం లేదు— అన్యాయంగానో— అక్రమంగానో మనిషి ఆర్జిస్తే చాలు — అంతా వాళ్ళకి దాసోహం అంటూ వుంటారు -'' అన్నాడు ఆవేశంగా

''బాగుంది ఎవరో గడ్డి తిన్నారని మనం తింటామా?''

''ఏం లోకంలో నూటికి 90 మంది తినగా లేంది నువ్వు నేను తింటే వచ్చిందా? నలుగురితో పాటు నారాయణా— కులంతోపాటు గోవిందా! అని సామెత'' అన్నాడు ఇంకా ఆవేశంగానే

''అయితే నువ్వు అనేదేమిటి?'' అని అడిగింది విసుగుదలను కప్పిపుచ్చుకుంటూ

''నేను స్మగ్లింగ్ మొదలుపెడతాను - వాచీలు - బంగారపు బిస్కెట్లు ఇంకా ఇంకా అన్నీ చేస్తాను.''

ఆ మాటకి అదిరిపడింది సమత

''ఆ చేస్తావు పట్టుబడితే శ్రీకృష్ణ జన్మస్థానంకూడా దర్శిస్తావు.'' అంది మంటగా

''ఆ! ఏడిశారు — చేసిన ప్రతివాడూ అరెస్టవుతున్నారా! ఎంతమంచి ఘరానాగా తిరగడంలేదు?'' అంటూ ఎదురు ప్రశ్నవేశాడు.

''ఎందుకు పట్టుబడరు? ఆ టైము వచ్చేసరికి పాపం బద్దలవ్వాల్సిందే!''

''ఈలోగా సంపాదించుకుంటారు—జల్సాగా బతుకుతారు దరిద్రం అనుభవించకుండా — ఆ తర్వాత సంగతి తర్వాత.''

ఇలాంటి పిడివాదనకి మళ్ళీ జవాబు చెప్పాలనిపించలేదు సమతకి.

''ఛీ! బావ ఎలా మారిపోయాడు?

దొంగతనాలు—రేసులు—స్మగ్లింగ్ అంటూ ఎందుకు తనని తను పతనం చేసుకుంటాడు?

చదువు — సంధ్య వచ్చినవాడే ఇలా ఆలోచిస్తుంటే — బుద్ధి పెడదారులు పట్టిస్తుంటే— ఇంక మూర్ఖులకు చెప్పేదేముంది?'' అని అనుకుంది చింతగా.

అసలీ బొంబాయికి రావడానికే ఇంట్లో పెద్ద నాటకం ఆడవలసి వచ్చింది.

''ఎంత మేనల్లుడయితే మటుకు ఆడపిల్లని ఒంటరిగా పంపిస్తారా?'' ఏ తల్లిదండ్రులూ పంపరు.

అసలు బొంబాయని చెప్పకుండా హైదరాబాద్ ఇంటర్వ్యూకని బయలుదేరింది తండ్రి వూళ్ళో లేకపోవడం కలిసి వచ్చింది. లేకపోతే బయలుదేరడం కుదిరేది కాదు

ఆడపిల్లని ఒక్కత్తినీ పంపడం దేనికని తల్లి మేనల్లుడిని తోడిచ్చి పంపిందికాని లేకపోతే పంపేదా? అదీ వెయ్యి జాగ్రత్తలు చెప్పి

ఇంక ఇక్కడ బావగారు స్మగ్లరుగా మారి ఇక్కడే చతికిలపడి కూర్చుంటాడేమో! అనుకుంది హడిలిపోతూ.

''ఇంతకీ నువ్వు ఇక్కడినించి కదిలేదివుందా లేదా?'' అని అడిగింది తీవ్రంగా

''నేను రాను సమతా—మనం గోవాపోదాం అక్కడినించి స్మగ్లింగ్ సరుకులు తెద్దాం లక్షాధికారులం అయిపోదాం'' అన్నాడు అమలేశ్వర్

''పిచ్చి ముదిరింది రోకలి తలకు కట్టమన్నాడట నువ్వు గోవా పోతావో— గోకర్ణం పోతావో నా కనవసరంగాని నేను మటుకు బెజవాడ పోతాను'' అంది ఖరారుగా

''అలాగంటే ఎలా సమతా? పక్కన శక్తి లేందే ఏ పనీ జరగదు అలాగే నువ్వు లేకపోతే నాకు అడుగు ముందుకు పడదు నువ్వు కూడా రా— ఇద్దరం కలిసే పోదాం'' అన్నాడు జాలిగా ముఖం పెట్టి

ఆ చూపుకు కరిగిపోయింది సమత.

''బావా! నేను తల్లిదండ్రుల్ని వదలి ఇంత దూరం వచ్చింది నీ కోసం కాదా!

ఇప్పుడు మళ్ళీ గోవా అంటున్నావు. వాళ్ళేమనుకుంటారో ఆలోచించావా?''

''నిజమేననుకో! ఇంతకాలం నా మనసులో ఏది వుంటే అదల్లా కనిపెట్టి తోడునీడగా నిలిచావు. ఈ ఒక్కసారి కూడా నాకు అండగా నిలబడు. నారోజు బాగుంటే లక్షాధికారినై పోతాను—బాగాలేకపోతే జైల్లోకిపోతాను—అప్పటికి ఈ బావ బాధ నీకుండదు'' అంటూ బతిమాలసాగాడు

''బాగానే వుంది మరి గోవా పోవడానికి సరుకులకి డబ్బేది?''

''నా దగ్గర వున్నది ఇది'' అంటూ బ్యాగులో దాచిన డబ్బు తీసి చూపించాడు

''దీనితోనేనీకు గోవా వెళ్ళి సరుకులు తేవడానికి సరిపోతుందా?''

''ఏం చేద్దాం? వినోదుని అప్పు అడుగుదామా?''

''ఇంత చేసినా నీకింకా వినోద్ కాళ్ళు పట్టుకోవాలనే వుందన్నమాట''


''ఏంచేస్తాం మరి? వసుదేవుడంతటివాడు గాడిద కాళ్ళు పట్టుకున్నాడట. తప్పదు తుందామరి?''

''నాకు తెలుసు ఇలాంటి పరిస్థితి వస్తుందని - అందుకే రహస్యంగా నా దగ్గర వున్నదంతా తెచ్చాను'' అంటూ చూపించింది

ఆ మాటకి సంతోషంగా చూశాడు అమలేశ్వర్.

''నిజంగా నువ్వు నూర్జహానువే! నీతో పోల్చుకుంటే నా తెలివి తేటలు చాలా స్వల్పం'' అన్నాడు అభినందిస్తూ

''ముందు ఆ గోవా ప్రయాణం సంగతేదో చూడు'' అంది సమత



మారేడు దళం

''ఓ. కె.'' అంటూ హుషారుగా లేచి బయటకు వెళ్ళిపోయాడు.

సమత దీర్ఘాలోచనలో పడిపోయింది. ఇంతలో తలుపుమీద తట్టినట్లు అనిపించి ఉలిక్కిపడింది

వినోద్! అతన్ని చూసి రపీమని లేచి కూర్చుంది.

''ఏమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు ?'' అంటూ వచ్చి ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు

''ఏమీలేదు. ఏమిటిలా వచ్చారు ?'' అని అడిగింది.

''ఏముంది ? మీ బావ తెలివితక్కువతనానికి నాకు చాలా బాధగా వుంది ? చెప్పినా అర్థం కాదు. అసలు పక్కన నువ్వు ఉండబట్టి సరిపోతోందిగాని లేకపోతే అతనీపాటికి బికారిలా రోడ్లంబడి తిరిగేవాడేగా !''

సమత మాట్లాడలేదు.

''మీ బావ తెలివితక్కువతనం నువ్వు ప్రత్యక్షంగా చూశావుకదా ! నీకేమనిపిస్తోంది ?''

''ఏముంది అనిపించడానికి ?'' ఎదురుప్రశ్న వేసింది సమత.

''ఏముందా ? అంత మూర్ఖుడితో మసలడం విసుగ్గాలేదూ ?''

లేదన్నట్టు తల వూపింది పెంకిగా

''అతనంటే నీకు చాలా ఇష్టం అనుకుంటాను.''

''అవును.''

''అతనిలో ఏముంది నువ్వు వరించడానికి?''

''అది మీకు అర్థం కాదులెండి — అయినా అడిగారు గనుక మీరు స్వప్నలో ఏముందిని వరించారో నాకు అతనిలో అవే కనిపించాయని అనుకోరాదు ?''

ఆ మాటకి పెద్దగా నవ్వాడు వినోద్.

''స్వప్నా! స్వప్న అందమైంది, వయసు తెచ్చిన ఆకర్షణ కనిపించే ఆమె చుట్టూ తిరిగాను— కాని న్యాయంగా ఆలోచిస్తే ఆ అందం కరిగిపోతే ఆమెలో ఏమీ వుండదు ఆకర్షించడానికి. పిండిబొమ్మ, కాని నువ్వలా కాదు — సానబెట్టిన వజ్రంలాంటి దానివి నీలాంటి మేధావంతురాలు పక్కన వుంటే భూతలాన్ని జయించవచ్చు. అందం వయసుతో పాటే అణగారిపోవచ్చుగాని తెలివితేటలు అలాంటివి కావు. మనిషి జీవితకాలం— ఆటుపోటులకు తట్టుకుంటూ మరింత రాటు తేల్తుంటాయి అందుకే నువ్వంటే నాకు చాలా చాలా యిష్టం!'' అన్నాడు వినోద్.

ఆ మాటకు ముఖం ఎర్రబడింది సమతకి.

మౌనంగా వున్న ఆమెని చూసి మళ్ళీ మొదలుపెట్టాడు వినోద్.

''మీ బావదగ్గర పైస డబ్బు లేదు. పోనీ ఆర్జించే తెలివీలేదు. అదీకాక అనకూడదుగాని ఇతనూ ఒకప్పుడు స్వప్న చుట్టూ తిరగడం నేను చూశాను. ఇలాంటివాడు నిన్నేదో ఉద్ధరిస్తాడనుకుంటే అది నీ భ్రమ మాత్రమే '' అని ఆగాడు ఆమె ముఖంలోకి చూస్తూ

''అలాగే నేను మిమ్మల్ని మీ మాటలకి లొంగి వరిస్తాననుకోవడం కూడా మీ భ్రమ మటుకే—మీరూ స్వప్న చుట్టూ తిరుగుతున్నారు. అతనూ తిరిగాడు—లేదా తిరుగుతున్నాడు ఏదైనా కానీయండి. ఆమె అందం, చదువు, డబ్బు అన్నీ వున్న బొమ్మ. మీకు సమ ఉజ్జీ. అలాంటి ఆమెని కాదని — ఏదో నాలాంటి సామాన్యురాలిని ప్రేమించుతాననడం — లేదా బోవడం — రెండూ తప్పే — మా బావ జహంగీరు — నేను నూర్జహాను అని మీరు ఏనాడో చెప్పారు. అది అంతే! దానికింకా తిరుగులేదు'' అని ఖచ్చితంగా చెప్పింది సమత.

''నీ మాట ఇంతేనా ?''

''ఆ! ఇంతే.''


''సరే! మీరు ఇక్కడినించి ఎలా వెడతారో చూస్తాను'' ఉక్రోషంగా అన్నాడు

''చూడండి'' నిర్లక్ష్యంగా జవాబిచ్చింది సమత.

ధుమధుమలాడే ముఖంతో అవతలకి వెళ్ళిపోయాడు వినోద్‌కుమార్.

(ఇంకా ఉంది)

సొంతగూడు



కొండవీటి సత్యవతి

"కర్మణ్యే వాధి కారస్తే.." కంఠతావచ్చిన శ్లోకం పుస్తకంలోని అక్షరాలు కనబడక పోయినప్పటికీ చదివేయగలిగింది సుందరమ్మ. దాని వ్యాఖ్యానం చదవబోయేసరికి, రెండు మూడుసార్లు కళ్ళజోడు సవరించుకున్నప్పటికీ.. కుదరలేదు. నడుంపీకి, కళ్ళుమండి, విసుగెత్తి, తలెత్తి చూసింది.

బోధపడింది!

మొదలే చీకటి కొంపలా ఉండే అద్దె ఇల్లు. నల్లటి మబ్బుల్తో కమ్మేసిన ఆకాశం వల్ల మరింత కారుచీకటైంది పుస్తకం మూసేసింది.

అప్పటికి గుర్తొచ్చి గాభరా పుట్టింది సుందరమ్మకి

వరండా గుమ్మం దగ్గిర కూచున్న సుందరమ్మ లోపల గదిలో ఓ మూల వంట చేస్తున్న కోడల్నిచూస్తూ... "అమ్మాజీ చిన్నాడింకా రాలేదేం." అంది.

"అదే నేనూ చూస్తున్నానత్తయ్యా.." అంది కోడలు.

పొద్దుటనగా వెళ్ళేడు. ఇంకా రాలేదు వెళ్ళిన పనేవయ్యిందో! ఏమవుతుంది... ఇలా మబ్బుల్తో దేవుడే దండెత్తి వచ్చేస్తే బక్కవాళ్ళ బతుకులేమవుతాయి...? ఎంత మన కర్మ మనం చేసుకుపోదామనుకున్నా... చెయ్యనిస్తాడా? ఇన్నేళ్ళకిన్ని తరాలకింత నీడ దొరకబోతున్నందుకెంత సంతోషించింది!

ఓసారి చూరుకిందికి వచ్చి తలెత్తి చూసింది సుందరమ్మ. పూల జల్లులా మెత్త మెత్తగా కురుస్తోంది. ఇంకా ముఖం దించనైనా దించలేదు. హోరుమంది. ఆ వెంటనే జోరుగా కురవడం మొదలైంది.

మళ్ళా చిన్నాడు కళ్ళల్లో మెదిలేడు.

చిన్నాడికి చిన్నతనంలోనే భుజాలు బరువుతో కాయలు కాసేయి. బాధ్యత తెలిసినవాడు బాధ్యతలనుండి తప్పుకోలేదు – తప్పించుకోడు. తన గురించికన్నా తనవారి గురించే కష్టపడతాడు. అందుకె వాడిగురించి అంత తపన.

ఇంతలోనే అంతదూరంలో వస్తూ కనిపించేడు. తడుచు కుంటూ వచ్చి తుడుచు కుంటూ వాకిట్లో నిలబడ్డాడు.

"తడుచు కుంటూ రాకపోతే ఎక్కడైనా కాసేపు నిలబడ లేకపోయావురా చిన్నాడా?" అంది తువ్వాలందిస్తూ సుందరమ్మ.

"ఫర్లేదులేమ్మా .. ఆకలేస్తోందండుకని వచ్చేసేను..." అన్నాడు నెమ్మదిగా.

కడుపు చెరువైపోయింది సుందరమ్మకి.

"అమ్మాజీ ..చిన్నాడికి తొందరగా అన్నం పెట్టమ్మా.." అంటూ కోడలికో కేకవేసి.

అప్పటికే చిరు చిరు చీకట్లు చిమ్ము తున్నాయి. లైటు వేస్తేగాని పట్టపగలైనా

వెలుతుర్రాని ఆ ఇంట్లో చిన్నాడి చేతికి పెద్దరికం వచ్చిందగ్గర నుండి వుంటోంది.

అదే ఆలోచిస్తూ...అడపాదడపా తుప్పర్లు తుళ్ళు తున్నప్పటికీ వరండాలోనే కూర్చుంది సుందరమ్మ. "వర్షం పడుతుంటే అక్కడెందు కమ్మా... లోపలికి వచ్చెయ్యగూడదు..." అని భోంచేస్తూనే కేక పెట్టేడు చిన్నాడు

అది మామూలే, సాడేముప్పాతిక గదిలో మొగుడూ పెళ్ళాలు కాక తనొకర్తె కూడానా అనుకుంటుంది సుందరమ్మ. కొడుకూ, కోడలూ తమతో పాటే పెద్దావిడకూడానని అనుకుంటారు.

"ఫర్వాలేదుగ్గానా . ఇవాళ ఇంటి పని నవ్యంగా జరిగిందా..." అని టాపిక్ మార్చింది సుందరమ్మ.

"ఆఁ ఆఁ జరిగినట్టే రేపొద్దున్న చూస్తేగాని చెప్పలేం..." అన్నాడు

"చిన్నాడికి మంచి నీళ్లియ్యి తల్లీ..." లోపలికి తొంగి చూడకుండానే అతని అవసరం గుర్తించి కేకపెట్టింది.

వర్షం కాస్త నిమ్మళించగానే రామా ఎంగిలి పడి వరండాలో మంచం వాల్చుకుని మేను వాల్చింది ఉండి ఉండీ జల్లు కురుస్తుంటే అప్పుడూ అప్పుడూగా ఆలోచనలు కళ్లలో గుమ్మరిస్తుంటే నిద్రపట్టేలా లేదు సుందరమ్మకి.

ఇటీవల విజయవాడలో ప్రముఖ రచయిత, పత్రికా రచయిత శ్రీ జె. నరేంద్రదేవ్‌కి జార్జి డిమిట్రోవ్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా చేసిన కృషికి బల్గేరియా ప్రభుత్వం తరఫున "జార్జి డిమిట్రోవ్ స్వర్ణ పతకం" బహూకరిస్తున్న బల్గేరియా సాంస్కృతిక విభాగం (న్యూఢిల్లీ) డైరెక్టర్ శ్రీమతి ఇ కమోవాని చిత్రంలో చూడవచ్చు



సొంత గూడు

సుందరి పెద్దింట్లోనే పుట్టింది. ముగ్గు రన్నదమ్ముల తర్వాత పుట్టి ముద్దుల పట్టిగా పెరిగింది. ఆమె పుట్టినిల్లు—ఇల్లవడానికి వీళ్లే దన్నంత పెద్దది ముందూ వెనకా తోట అట్టహాసంగా అందంగా వుండేది. అంత ఇంట్లో చెలరేగి తిరిగినా పదిమంది ఉండే ఆ ఇంటిలో ఒకరికొకరు కనిపించేవారు కారు

వస్తూ వస్తూ ఉన్న జ్ఞానంలో .. పుడుతూ పుడుతూ ఉన్న కోరిక — అటువంటిది కాకపోయినా విశాలమైన ఇంటనే కాలు పెట్టా లన్నది !

దానికి వ్యతిరేకంగా ఆ చిన్నవయసులోనే మరో ఇంట అడుగు పెట్టింది. అది అతి చిన్న ఇరుకు గదుల అద్దె ఇల్లు అప్పుడప్పుడే పురివిప్పుతున్న అంతర్నేత్రంతో పుట్టింటినీ, మెట్టినింటినీ బేరీజు వేయసాగింది అయితే అత్తింటివారిని తన మనసులో మెదిలే భావాలతో ఏనాడూ చిన్నబుచ్చడం ఇష్టంలేక భర్తవైపే మొగ్గు చూపింది.

అయితే ఇంత పెంకుటిల్లు లంకంతమేడగా ఎదిగినట్టు ఆమె మనసులోని కోరిక ఎదగ సాగింది. కాని ఎప్పటికప్పుడు పెరుగుతున్న బాధ్యతలూ, ఖర్చులూ, అప్పులూ చూస్తూ చూస్తూ తిరిగిపోతున్న అవకాశాలను ఆమోదించ సాగింది. భర్త హయాంలో కాకపోయినా రాను లక్ష్మణుల్లాంటి ఇద్దరు కొడుకులూ తన కోరికను కార్యరూపంలోకి తేలేకపోరని సర్దిచెప్పుకుంది.

అడ్డాలనాడు బిడ్డలు గానీ గడ్డాలొచ్చేక బిడ్డలా అన్న సామెత పెద్దాడు బుజావు చేస్తే, 'పుత్రుడు' అన్న పదాన్ని సార్థకం చేస్తూ భర్త నుండి బాధ్యతలను వారసత్వంగా పుణికి పుచ్చు కున్నాడు చిన్నాడు. అంచేతనే భర్త పోయేక చిన్నాడి పంచను చేరగలిగింది సుందరమ్మ.

తనకున్న చిరుద్యోగం వల్ల వచ్చే స్వల్పా దాయంతోనే గుట్టుగానే అయినా గట్టిగానే బ్రతుకులాగిస్తున్నాడు చిన్నాడు. జీవితమంతా అద్దెకొంపల్లో బతికీబతికీ, అందులోని కష్టనష్టా లన్నీ జీర్ణించుకుపోయిన సుందరమ్మ చిన్నాడు పడుతున్న సంసారయాతన చూస్తూ తన మనసులోని కోరిక బయటపెట్టలేదు. చీకటి కోణంలాంటి ఒంటిగదీ, బయటి వరండాల అద్దె కొంపనే మహాభాగ్యంగా ఎంచుకుని, కోడలి సాయంతో దాన్నే సుఖవంతంగా తీర్చిదిద్దు కుంది.

పెద్దాడు పెద్ద ఉద్యోగమే చేస్తూ పెద్దగా బతుకుతూన్నప్పటికీ వాడికిలేని అభిమానం తనకుమాత్రం ఎందుకని అభి మానంతో చిన్నాడి ఇంటనే వుండిపోయింది.

ఇప్పుడు ఇన్నాళ్ళకి ఇన్నేళ్ళకి తన కలలు పండే తరుణం వచ్చింది. ఆ వార్త విన్నప్పుడు చిన్నాడికన్నా, కోడలికన్నా ఎక్కువ సంతోషించిన వ్యక్తి సుందరమ్మే.

కో—ఆపరేటివ్ బిల్డింగు సొసైటీలో ఎప్పుడో మెంబరుగాచేరి, దరిమిలా డబ్బుకూడా వాయిదాల రూపంలో కట్టేసిన చిన్నాడికి మూడు వందల చదరపు గజాలస్థలం కేటా యింపు జరిగింది !

"ఏమిటమ్మా ... అంతగా సంతోషిస్తు న్నావు గాని...దాని మీద హౌసింగ్ ఫెడరేషను నుండి లోను తీసుకొని కట్టించబోయేసరికి తాతలు దిగి వస్తారు. ." నిరాశగా అన్నాడు చిన్నాడు

"అలాగని వదులుకుంటావ్రా " అని ఆదుర్దాగా అడిగింది సుందరమ్మ.

"వదులుకోవడమంటే ..తిరిగి అమ్మేసు కుంటే వెయ్యో రెండు వేలో లాభం రాకపోదు.. " అన్నాడు

. "మనం డబ్బు కట్టడం కట్టినా . అప్పుడూ అప్పుడూ కట్టడం వల్ల ఆట్టే కష్ట పడలేదుకదా ..అంచేత అనుకోకుండా ఒచ్చిన పెన్నిధి కూడాను. కనక అమ్మేయడంలాంటి పిచ్చిపనులు చెయ్యకుమీ. ."

"మరేం చెయ్యమంటావమ్మా. " అన్నాడు ఏమీ తోచని స్థితిలో చిన్నాడు...

"సొంత గూడు అయ్యిండాలిగాని అద్దె కొంపపాటి చెయ్యద్రూ.. మన తాహతునిబట్టి తాటాకుల్తో ఓ శాల వేసుకుంటే చాలదూ " అంది.

సుందరమ్మ చెప్పిందాంట్లో బేసబబేమీ కన్పించలేదు చిన్నాడికి. అంచేతను వెంటనే ఒప్పుకున్నాడు అప్పటినుండీ రెండు మూడు నెల్లపాటు పాదుపుచేసి, కర్రా కంపా పోగుచేసి పని మొదలెట్టేడు.

ఇవాళ అదే పనిమీద వెళ్ళి మట్టి తొక్కించేడు. మధ్యాహ్నానికి కాస్తంత గోడకూడా లేపేడు. అయితే వర్షం ముంచుకొచ్చింది. ఆరుదల లేకపోవడం మూలాన పచ్చిమీద గోడంతా కరిగిపోతే వృధా ప్రయాసే... ఆ రోజు కూలీ ఖర్చు బూడిదలో పోసిన పన్నీరే ...

అది తల్చుకుంటుంటే మంచంమీద పడుకున్న సుందరమ్మ ప్రాణం గిలగిల్లాడి పోయింది.

మంచం కింద మరచెంబుతో నీళ్ళు పెట్టడానికి వచ్చిన కోడలు ... "అత్తయ్యా... అత్తయ్యా..." అంటూ కేకేసేసరికి లోనుండి పరుగున వచ్చేడు చిన్నాడు.

"ఏంటమ్మా ... ఏవయ్యింది ... అలా మూలిగేవు ... " అన్నాడు ఆదుర్దాగా.

"అబ్బే... ఏం లేదురా గుండెల్లో గాభరాగా వుంది ... అంతే ... " ఒళ్ళంతా నీరు కమ్మే స్తుంటే నింపాదిగా తుడుచుకుంటూ అంది సుందరమ్మ.

"ఉండు ... డాక్టరుని పిలుస్తా ..." అంటూ వెళ్ళబోయేడు చిన్నాడు.

అదికూడా ఎందుకు ... ఈ రోజుకి మరో దండుగా ... అందుకే "వద్దురా. అదే సర్దుకుంటుంది ... అమ్మాజీ కాస్త వేడిగా కాఫీ కలిపి ఇవ్వుచాలు ..." అందివాడి తృప్తి కోసం.

మర్నాడు మళ్ళా ఇంటి పనిమీద బయల్దేరిన చిన్నాడిని ఆపింది సుందరమ్మ.

"ఒరే చిన్నాడా ... ఇంటిపని కొంచెం తొందరగా కానియ్యరా..." అంది ప్రాధేయపడు తున్నట్టుగా.

"ఇదిగో నిన్నటిలా వర్షం అడ్డుపడకుండా వుంటే ఓ వారం పదిరోజుల్లో అయిపోదేం టమ్మా...అయినా ఏవిటిలా అడుగుతున్నావు ?" అన్నాడు అనుమానంగా.

"అబ్బే శ్రావణమాసం దాటిపోకుండా సొంత గూటిలోకి చేరిపోతే బావుంటుంది గదాని..." అంది.

"సర్లే వెళ్లొస్తానమ్మా" అంటూ వెళ్లిపోయేడు.

నాలుగైదు రోజులు పని చురుగ్గా అయ్యింది.

రోజులు గడుస్తున్నకొద్దీ సుందరమ్మ ఆత్రుత ఎక్కువయ్యింది. పదిహేనురోజులుగా సెలవు పెట్టిన చిన్నాడు ఎండనక వాననక తిరుగుతున్నాడని ఒకవైపూ, ఇంటిపని ఎప్పటికి పూర్తవుతుందా అని మరోవంకా గింజుకు పోతోంది సుందరమ్మ.

ఆ రోజు ఉదయం కమ్మ నేయించడానికి వెళ్లేడు చిన్నాడు. అంచేత వాడటు వెళ్ళగానే పంతులుగారిని పిలిపించింది గృహప్రవేశానికి మంచిరోజు చూడ్డానికి.

మూడోరోజున ముహూర్తం పెట్టేడు.


మధ్యాహ్నానికి మండుటెండంతా మటు మాయమైపోయి మేఘాలెత్తుకు వచ్చేయి — మబ్బులు చూస్తుంటే బెంబేలెత్తి పోతోంది సుందరమ్మ.

"మరేంగాభరాలేదత్తయ్యా ... గోడల్లేచి పోయేయి కదా...కమ్మనేతకూడా అయిపోతూంది ...వర్షంవల్ల అడ్డులేదుగాని మీరు నిమ్మళంగా వుండండి..." అంటూనే వుంది కోడలు.

అయినప్పటికి చిటపట చినుకులు రాల్తుంటే గిలగిల్లాడిపోయింది. ఉరుములుండుండి ఉరుముతూంటే మొదలునరికిన చెట్టులా కూలిపోయింది సుందరమ్మ.

అప్పుడే తడుచుకుంటూ ఇంట్లో అడుగు పెట్టిన చిన్నాడు... "అమ్మా" అని పెట్టిన కేకగానీ, "సొంతఇంట అడుగు పెట్టాలంటూ నీ గూడు నువ్వు వెతుక్కున్నావా అమ్మా..." అంటూ చేసిన ఆక్రోశంగానీ సుందరమ్మ విన్పించుకోలేదు. ★

పుష్పలోయ



పుష్పావతీ నదిపై మంచువంతెన

పశ్చిమ హిమాలయాలలో బదరీనాథ్ మార్గంలో 'గోవింద ఘాట్' అనే శిక్కుల పుణ్యక్షేత్రం ఉంది ఇక్కడ లక్ష్మణ గంగ అలకనంద నదితో సంగమిస్తుంది ఈ సంగమ స్థానం నుండి ఉత్తర దిశగ పర్వత లోయలలో పద్నాలుగున్నర కిలోమీటర్ల దూరం కాలి నడకన ప్రయాణిస్తే విశ్వవిఖ్యాతిగాంచిన 'పుష్పలోయ' దర్శించుకొనవచ్చును దీనినే ఆంగ్లంలో ''వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్'' అంటారు

యాత్రికులు అనేక ప్రయాసలకోర్చి మొదట పదకొండు కిలోమీటర్ల దూరంలో ఉన్న 'ఘఘారియా' చేరుతారు ఇక్కడ శిక్కుల 'గురుద్వారా' అందరికి ఆశ్రయమిస్తుంది ఘఘారియా నుండి పుష్పలోయ మూడున్నర కిలోమీటర్లు ఉంటుంది శిక్కుల పుణ్యక్షేత్రం అయిన హేమకుండ్ అయిదు కిలోమీటర్లు ఉంటుంది హేమకుండ్ నుండి ప్రవహించే 'హేమవతీ', పుష్పలోయనుండి ప్రవహించే 'పుష్పవతీ' నదులు ఘఘారియా వద్ద కలిసి 'లక్ష్మణ గంగ' పేరుతో ప్రవహిస్తాయి

ప్రయాణంలో ప్రమాదాలు

ఘఘారియానుండి పడమరగా మంచు దిబ్బల మీదగ వెళితే పుష్పలోయ వస్తుంది మంచుమీద నడవటం చాల ప్రమాదకరంగ ఉంటుంది ఎముకలు కొరికే చలిలో, కాళ్ళు జారుతుంటాయి కర్ర ఊతగా పట్టుకొని మంచులో గుచ్చుకుంటూ యాత్రికులు నడుస్తారు 'పుష్పవతీ' నది సంవత్సరంలో ఎక్కువ కాలం గడ్డకట్టి ఉంటుంది క్రింద నీరు ప్రవహిస్తూ పైన మంచు వంతెనలాగ ఏర్పడుతుంది దానిని దాటాలి ఒక్కోసారి దానిలో కూరుకుపోయే ప్రమాదముంది పైగా మంచు, వర్షం తుఫానులు వస్తుంటాయి

2000 రకాల పుష్పజాతులు !

ఇన్ని బాధలు ఓర్చి యాత్రికులు పుష్పలోయ సందర్శిస్తారు ప్రపంచంలో మరెక్కడా కనుపించని చమరీ మృగాలు, కస్తూరి మృగాలు యిక్కడ సంచరిస్తుంటాయి పెద్దపులులు, మంచు ఎలుగులు తిరుగాడుతుంటయి జూలై 15 నుండి ఆగస్టు 15 వరకు మరెక్కడా లభ్యం కాని రెండువేల రకాల పుష్పజాతులు విచ్చుకుంటాయి

పుష్పలోయ పొడవు 5 కి మీ , వెడల్పు 2 కి మీ , ఎత్తు 3658 మీ ఉంటుంది

ఇక్కడకు విదేశీయులు కూడ వస్తుంటారు చమరీ, కస్తూరి మృగాలు మరికొన్ని ముఖ్యమైన మూలికలు ఈ లోయలో నుండి మాయమవు తున్నయి అందుకని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాటు 'వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్' కు ఎవ్వరూ వెళ్ళకుండ నిషేధించింది

మంచు కరిగినప్పుడు ఇక్కడి శిలల నుండి అనేక పుష్పజాతులు విచ్చుకుంటాయి అక్టోబరు నుండి మే నెల వరకు పూర్తిగా మంచుతో కప్పబడి ఉంటుంది అప్పుడు మొక్కలన్నీ చనిపోతాయి పోతెంతిలా, ప్రిములు, రానుంకుల, బ్రహ్మకమల్, ఆస్టర్, అంద్రోసాక,నోమాచరస్, ఫ్రితిలర్, దూగర్ పుష్పాలు యిక్కడ ముఖ్యమైనవి శివపూజలో బ్రహ్మకమలానిది అగ్రస్థానం ఇవికాక 'సంజీవని' కూడా యీ లోయలో ఉన్నదని 'మర్యాలీలు' అంటారు

పగలే వెన్నెల !

మనకు మండువేసవిగా ఉన్నప్పుడు పుష్పలోయలో మధ్యాహ్నపు సూర్యుడు శరచ్చంద్రుని లాగనూ, ఎండ శరజ్యోత్స్న లాగనూ అనుభూతిని కలిగిస్తాయి చుట్టూ రజత శిఖరాలమీద మేఘ మాలికలు విహరిస్తుంటాయి ఆకాశం నిర్మలంగాను, ఎక్కువ నీలంగాను కానవస్తుంది సూర్యుడు దగ్గరగా చల్లగా, మార్దవంగ ఉన్నట్లు కనుపిస్తాడు 'మృదు సూర్యాస్సనీహారాః, పటుశీతా స్సమారుతాః' అన్న వాల్మీకి వర్ణన జ్ఞప్తికి వస్తుంది

చాల ఉన్నత ప్రదేశం కనుక ఇక్కడ సూర్యకాంతి సాయంకాలం గం 7—30 వరకు ఉంటుంది అరుణ భానుని హిరణ్యకిరణాలు ధవళశిఖరాల పైపడి విభిన్న కోణాలలో విభిన్న రంగులలో ప్రసరిస్తూ—

'నమో హిరణ్య బాహవే
సేనాన్యే దిశాంచ పతయేనమో ! '

సూక్తిని స్ఫురింప చేస్తాయి


రాత్రి ఆకాశం బాగా నల్లగాను, నక్షత్రాలు ప్రకాశవంతంగాను చాల దగ్గరగా ఉన్నట్లు కానవస్తాయి ధ్రువనక్షత్రం భూమి మీదకు మామూలుగా 10 డిగ్రీలతోను, సప్తరుషి మండలం 30 డిగ్రీలతోను కానవస్తాయి కాని ఇక్కడ ధ్రువనక్షత్రం 50 డిగ్రీలతోను, సప్తరుషి మండలం 70 డిగ్రీలు ఉన్నట్లు కన్పిస్తాయి ఉదయం గం 4 00 లకే సూర్య కిరణాలు నలుదిశల వ్యాపిస్తాయి

సమస్త భారతావనికి హిమాలయ శోభ తలమానిక మనుకుంటే ''వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్'' అందులో ఒక వెలలేని మణిపూస

ఫొటో, వ్యాసం

— శ్రీషైక్ షేక్ మౌలాలీ

మంచుతో కప్పబడిఉన్న పుష్పలోయ






ఖేతాన్* ఫాన్‌లో చేరిన చిన్న చిన్న విషయాలే దాని ప్రత్యేకతకి కారణాలు. అల్యూమినియం బ్లేడ్లని చూడండి చివరభాగాలు ఇతర ఫాన్ బ్లేడ్లకన్నా వెడల్పుగా వుంటాయి. అందుకే గాలి ప్రతి మూలకి వీస్తుంది.

ఇప్పుడు బాల్ బేరింగ్స్ చూడండి అవి గ్రీస్ పాక్‌డ్‌వేకాక ప్రీ-లోడెడ్‌వి కూడా అందుకే ఫాన్ దీర్ఘ కాలం మన్నుతుంది ఆ తర్వాత మోటార్. ఇతర వాటిలో 14 లేక 16 పోల్స్ వుంటే ఇందులో 18 పోల్స్ వున్నాయి.

ఆ కారణంగా ఖేతాన్ మోటార్ ఎంతో ఎక్కువ గాలిని అందిస్తుంది.



అంతేకాక సెంట్రీఫ్యూగల్ విధానంతో డైకాస్ట్ చేసిన రోటార్, యంత్రసహాయంతో రాగితీగ చుట్టిన స్టేటర్ కలసి 32% ఎక్కువ సమర్ధతని, ISI వివరణలకన్నా 10% ఎక్కువ గాలిని యిస్తూ 30% తక్కువ విద్యుత్‌ని వినియోగిస్తాయి. ఆకర్షణీయమైన రూపకల్పన, సరిగ్గా సరిపోయే రెగ్యులేటర్ లతో సాటిలేని ఫాన్. ISI ముద్రతో 5 సంవత్సరాల గ్యారంటీ వున్న ఫాన్.

* ఇచ్చిన వివరాలు ఖేతాన్ ప్రీమియమ్ 1200 మిమి (48") స్వీప్‌కి సంబంధించినవి.

వాస్తవంగా సర్వశ్రేష్ఠమైన ఫాన్

సినిమా

అనూరాధ 'ఘరానా రౌడీ'



నరేష్ హీరోగా విజయనిర్మల దర్శకత్వంలో "ముక్కోపి"

"ఈ టైటిల్ బట్టే తెలుస్తుంది కదా చాలా వెరైటీ అయిన కథ అని ? హీరోకు ఎప్పుడూ ముక్కు మీదే కోపం ఉంటుందిగాని, మంచి పనులన్నిటికీ తానే ముందుంటాడు మా నరేష్ టేలెంట్స్ ప్రదర్శించడానికి అనువైన పాత్ర ఒక విధంగా చెప్పాలంటే చాలెంజ్ పాత్ర" అన్నారు విజయనిర్మల ఈమె స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో మే, జూన్, జూలై మాసాలలో చిత్రీకరణ జరిగే విజయకృష్ణా మూవీస్ "ముక్కోపి" చిత్రంలో నరేష్ సరసన రాధ నాయిక సత్యనారాయణ, రావుగోపాలరావు, రమాప్రభ ఇతర ముఖ్య భూమికలు నిర్వహిస్తారు రమేష్‌నాయుడు సంగీత దర్శకుడు పుష్పాల గోపీకృష్ణ ఛాయాగ్రాహకుడు

కేతినేని పిక్చర్స్ తొలిచిత్రంలో కృష్ణంరాజు

"హైదరాబాద్‌లో ఫిబ్రవరి 12 నుంచి 20 వరకు మొదటి షెడ్యూల్, మార్చి 21 నుంచి 31 వరకు రెండవ షెడ్యూల్ చివరి షెడ్యూల్ ఏప్రిల్‌లో 20 రోజులపాటు జరుగుతుంది," అన్నారు బి భాస్కరరావు ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో కేతినేని బాబు నిర్మించే ఈ సంస్థ తొలిచిత్రానికి ఫిబ్రవరి 6న పాటల రికార్డింగ్‌తో ప్రారంభోత్సవం జరిగింది కృష్ణంరాజు, జయసుధ, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, సురేష్, రాజేష్, జీవా వగైరా తారాగణం డాక్టర్ ఎం ప్రభాకరరెడ్డి కథకు పూసల సంభాషణలకర్త వేటూరి గీతాలు, జె వి రాఘవులు సంగీతం, సత్తిబాబు ఛాయ, మార్తాండ్ కూర్పు నిర్వహిస్తున్నారు



'ఉక్కు మనిషి' కృష్ణంరాజు, రాధిక

కొన్ని చిత్రాల పేర్లు

శోభన్ బాబు హీరోగా కె బాపయ్య దర్శకత్వంలో హిమబిందు నిర్మాతగా రాయపరాజు సమర్పించే చిత్రం "దండయాత్ర"

కృష్ణంరాజు, జయసుధ నాయికా నాయకులుగా బి భాస్కరరావు దర్శకత్వంలో ఆర్ కేతినేని నిర్మిస్తున్న చిత్రం "భారతంలో శంఖారావం"

నందమూరి బాలకృష్ణ హీరోగా భారతి–వాసు దర్శకత్వంలో పీతాంబరం సమర్పించే గజలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ చిత్రం "సాహసమే జీవితం

"అదిగో అల్లదిగో" లో నాస్తిక వైద్యుడు

డాక్టర్ తేయాకు (రాళ్ళపల్లి) ఓ రోగికి మందు పొట్లాలు ఇస్తూ "తీరాలు, పుణ్యక్షేత్రాలు తిరిగితే—కాళ్ళ నొప్పులు, దారి ఖర్చులు తప్ప అనుకున్నవేవీ జరుగవు విభూదికే జబ్బులు తగ్గిపోయి అనుకున్నవన్నీ జరిగితే—ఇనప్పెట్టెలో డబ్బుకు బదులు విభూదే ఉండాలని ఈ డాక్టర్ తేయాకు ఘోషిస్తున్నాడు మనిషి బలహీనతే దేవుడు మనిషి మనిషిగానే పుడుతున్నాడు, చస్తున్నాడు చావాలి దేవుడులేడనీ

డాక్టర్ తెయాకు ఇది వరకే ఎన్నో సార్లు నిరూపించాడు ఇప్పుడు మళ్లీ ఘోషిస్తున్నాడు ఈ మందులు వాడండి కృషితో నాస్తి దుర్భిక్షం!' అంటూ ఆ రోగిని అలా సాగనంపాడో లేదో అతని భార్య ఆపసోపాలుపడుతూ వచ్చింది "ఎక్కడ్నుంచి వస్తున్నావ్?" అడిగాడు డాక్టర్ తెయాకు

"రావి చెట్టు చుట్టూ ప్రదక్షిణాలు చేసి " ఆయాసంతో ఆగింది భార్య అండాళ్ళు (శ్రీశైలజ)

"ఎందుకు — ఎందుకు? రావి చెట్టు చుట్టూ తిరగడం వల్ల సైంటిఫిక్ యూజెస్ ఏమైనా ఉన్నాయా?"

"పిల్లల కోసం"

"పిల్లల కోసం మొగుడు చుట్టూ తిరగాలి గాని— రావి చెట్టు చుట్టూ, కొబ్బరి చెట్టు చుట్టూ తిరిగితే, ఆ మొగుడు వెధవని ప్రజలు ఏమంటారు?"

"మొగుడు వెధవా—అంటారు"

"ఆ!"


"ఆ మాట మీరే కదా అన్నారు?"

"అన్నానే బుర్ర తక్కువై అన్నాను ఆ బూడిదేమిటే?"

"గౌరీనాథ శాస్త్రిగారి దగ్గరికి వెళ్ళాను వనజాక్షి కూడా శాస్త్రిగారి విభూది వాడిన తర్వాతే నెల తప్పిందట ఆయన కంటే ఆయన కోడలి మహిమే గొప్పదంట"

"ఓ ఆ గౌరీనాథ శాస్త్రి ఒక నాటకం, వాడి విభూది ఒక నాటకం ఇప్పుడు కల్పిస్తున్న వాడి కోడలి కథ మరో కొత్త నాటకం వాళ్ళ నిజస్వరూపాల్ని త్వరలోనే నిరూపిస్తానని డాక్టర్ తేయాకు ఘోషిస్తున్నాడు లిన్న విభూది అంతా బూడిదని తెలుసుకుని ప్రజలు కక్కుతారు మందులిచ్చి మళ్ళీ వాళ్ళను నేనే రక్షిస్తాను

'అదిగో అల్లదిగో' సుహాసిని





'ప్రళయ సింహం'లో సుమన్, సుమలత

వెళ్ళు వెళ్ళి విస్తర భోజనానికి ఏర్పాటు చేయి"

భర్త అలా అన్నందుకు నవ్వాలో ఏడవాలో తెలీకుండా అండాళ్ళు వంట గది వైపు వెళ్ళింది

కోడి రామకృష్ణ కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించే మంజులా క్రియేషన్స్ "అదిగో అల్లదిగో" చిత్రానికి ద్వారకనాథ్ బాబు, ఎన్ నాగేశ్వరరావు నిర్మాతలు మోహన్ బ్రదర్స్ సమర్పణ

శోభన్ బాబు హీరోగా "ఇల్లాలు—ప్రియురాలు"

"ప్రతివారూ వారి శక్తి సామర్థ్యాలను చూపించడానికి అనువైన పకడ్బందీయైన కథ," అన్నారు ఎ కోదండరామిరెడ్డి ఈయన స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో అట్లూరి పూర్ణ చంద్రరావు సమర్పించే బాబూ ఆర్ట్స్ "ఇల్లాలు—ప్రియురాలు" చిత్రానికి ఫిబ్రవరి 3న తొలి గీతం ధ్వనిముద్రితమైంది శోభన్ బాబు, సుహాసిని, సత్యనారాయణ, వేలు, వీరభద్రరావు, అన్నపూర్ణ వగైరా తారాగణం సత్యానంద్ మాటలు, వేటూరి పాటలు రాశారు చక్రవర్తి సంగీత దర్శకుడు సదాశివరావు, బుల్లెయ్యారెడ్డి సహకార దర్శకులు వి సత్యనారాయణ, బి జి రెడ్డి నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు మార్చి 3 నుంచి ఏప్రిల్ 10 వరకు ఒకే షెడ్యూల్లో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు నిర్మాత జి బాబు

రచయిత కొంపెల్ల విశ్వం చిత్రాలు

భ్రమరాంబికా మూవీస్, ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్, కె భాగ్యరాజ్ దర్శకత్వంలో శ్రీ సారథీ స్టూడియోస్ నిర్మించే చిత్రం, వేజెళ్ళ సత్యనారాయణ, జి సి శేఖర్, జనార్ధన్ దర్శకత్వం వహించే చిత్రాలకు కొంపెల్ల విశ్వం స్క్రిప్టులు రాస్తున్నారు.

"తాళి తెగబడితే"

''కట్న పిశాచ కబంధ హస్తాలకు చిక్కుకున్న ఓ అభాగినులకు విముక్తి కలిగించి ఎందరికో కనువిప్పు కలిగించే ఇతివృత్తం, గుంటూరులోని లక్ష్మీపురం, కృష్ణనగర్, బ్రాడీపేట, శారదా కాలనీ, ఇంకా అమరావతి, కొండవీడు ప్రాంతాలలో ఒకే షెడ్యూల్లో షూటింగ్ పూర్తి చేశాం,'' అన్నారు కేదారి సూరిబాబు. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వంలో ముంగర లక్ష్మి నరసమ్మ నిర్మించే హనుమాన్ ఆర్ట్ పిక్చర్స్ వారి పై చిత్రంలో వరలక్ష్మి, నవ యువకుడు విజయకృష్ణ నాయకా నాయకులు. రాళ్ళపల్లి, మాడా, నర్రా, నళినీకాంత్, పి.ఆర్. వరలక్ష్మి. జయ విజయ, కె. వి. లక్ష్మి, శైలజ శ్రీలక్ష్మి, కొందరు రంగస్థల కళాకారులు ఇతర పాత్రధారులు. రాజ్‌కోటి సంగీతం, పి. లక్ష్మణ్ ఛాయ, రంగారావు శిల్పం, అంకిరెడ్డి కూర్పు,

సినిమాగా

ఎ గోపీనాథ్ నిర్వాహణతో జి సూర్యనారాయణ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, ఎం నరసింహారావు, బి జగన్మోహనరావు, జె కొండలరావు సహ నిర్మాతలు సమర్పణ పైడి భుజంగరావు

డైరెక్టర్ వేజెళ్ళ సత్యనారాయణ చిత్రాలు

''ఈ చదువులు మాకొద్దు'' వేజెళ్ళ దర్శకత్వం వహించిన ఎనిమిదవ చిత్రం. ఫిబ్రవరి 27 నుంచి కన్నడంలో యు. ఎస్. ఆర్. మోహనరావు నిర్మించే చిత్రం, ఏప్రిల్ రెండో వారం నుంచి మద్రాసులో ఒకే షెడ్యూల్లో పూర్తయ్యే డి. వి. ఎస్. రాజు నిర్మించే చిత్రం, జి. సత్యనారాయణరాజు నిర్మించే చిత్రం, ఖమ్మం వాస్తవ్యులు లాయర్ అప్పారావు నిర్మించే చిత్రం, సంతోష్ ఆర్ట్ మూవీస్ సమర్పణలో రాఘవేంద్ర పిక్చర్స్ పతాకంలో ఎ. రాజప్రసాద్ నిర్మించే ''జీవితంలో నటిస్తే ?'' వగైరా చిత్రాలకు వేజెళ్ళ దర్శకత్వం వహించనున్నారు.

"దానవుడు"లో మానవుడు

రాజా (శోభన్‌బాబు) మారువేషంలో వచ్చి మామ్మ (నిర్మల)ను, చెల్లెలు శాంతి(సంతోషిని) హడలగొట్టాడు. చివరికి మీసం పడిపోవడంతో




'కోడె త్రాచు' లో

''నచ్చినోడా ! వీధిలో నాటకాలు ఆడింది చాలక ఇంట్లో నాటకాలాడి నమ్మల్ని బెదిరిస్తావా ? నిన్ను —'' అంటూ కొట్టబోయింది మామ్మ.

''అదేమిటి, ఊరూ వాడాంత నన్ను ఉత్తమ నటుడని పొగడుతుంటే — నువ్వేమో నన్ను కొడుతున్నావ్. అదేమైనా న్యాయంగా ఉందా?'' అన్నాడు రాజా.

''వీధిలోని మనుషులు పగటి వేషగాళ్ళని



శ్రీదేవి, శోభన్‌బాబు

చూసినా వళ్ళికిలిస్తారు మనకి కావస్సింది అలాంటి గొప్పలుకాదురా సుబెదార్ చంద్రయ్య గారి మనవడిలా నువ్వు మసలుకుంటే అప్పుడు గొప్ప''

"అయితే, ఈసారి తాతయ్యలా మేకప్ చేసుకుని, ఉత్త చంద్రయ్యలాకాదు, సుబేదార్ సీక చంద్రయ్యలా డైలాగ్‌లు చెప్తానే!''

"ఒరేయ్, అంత చదువూ చదివి, ఇలా నాటకాలు ఆడే బదులు నాలుగు రాళ్ళొచ్చే ఉద్యోగం సంపాదించుకోకూడదురా ఎప్పుడు సంపాదిస్తావో, ఎప్పుడు దీని పెళ్ళి చేస్తావో కనీసం ఓ చిన్న ఉద్యోగమైనా దొరికితే –'' అంటూ మామ్మ నిట్టూర్చింది

పక్కనే ఉన్న శాంతి "ఛీ ఛీ! అన్నయ్యకి చిన్న ఉద్యోగం ఏమిటి, మామ్మా జిల్లా కలెక్టరంత ఉద్యోగం దొరకాలి అప్పటిదాకా నేను పెళ్ళి చేస్కోను,'' అంది

"అలా నువ్వు మొండికెత్తి కూర్చుంటే, ఈ పాపిష్టి కళ్ళకి నీ పెళ్ళి చూసే అదృష్టం దక్కకుండానే హరీ అంటాను,'' అంది మామ్మ

"నువ్వు హరీ అన్నా–ఏమ్హాం సరే అనకుండా నువ్వేం అనవులే, దీని కూతుళ్ళని, మనవళ్ళని ఎత్తుకుని, ఆడించేదాకా నీ ప్రాణాలకేం ఢోకా లేదు నాది గారంటీ'' అన్నాడు రాజా

మామ్మ తనలో తానే నవ్వుకుంది

ఎ పోతరాజు సమర్పణలో కోడి రామకృష్ణ దర్శకత్వం వహించే సంతోష్ ఆర్ట్స్ మూవీస్ "దానవుడు'' చిత్రానికి ఎ శ్రీనివాసరావు, ఎ లక్ష్మణరావు నిర్మాతలు

ఎడారిలో వానజల్లు...

ఆనందభైరవి

సినిమా అంటేనే కమ్మర్షియల్ అనే భావం వున్న రోజులు ఇవి –

లక్షలుపెట్టి తీసే సినిమాలలో నీతి సందేశం అంటూ కూర్చుంటే మిగిలేది ఏమిటి ?– అనేవాళ్ళు చాలా మంది వున్నారు

ఆ మాట నిజం కూడా!

ఇలాంటి రోజుల్లో జనాలకి సందేశాలు అందించాలని తహతహలాడేవారు కొందరుంటారు!

ప్రజలలో ఏదో చైతన్యం తేవాలనే వారు వుంటారు

మిరపకాయబజ్జీలు తినే ప్రేక్షకులచేత హోమియోపతి మాత్రలు తినిపించే ప్రయత్నం చేస్తారు కొందరు –

అలాంటి కొందరిలో జంధ్యాల ఒకరు! ఆయన అభిరుచికి తగినట్టు నిర్మాతలు కూడా అలాంటి వారే దొరుకుతారు

'ఆనందభైరవి' సినిమా చూసినప్పుడు జంధ్యాల దర్శకత్వ జీవితం ధన్యం అయింది అనిపిస్తుంది ప్రతి వొక్కరికి!



కూచిపూడి నాట్యం. కూచిపూడి సాంప్రదాయం చాలా గొప్పవి అని అనుకుంటాం– ఇది కూచిపూడి నాట్యం అని చెబితే చూసి ఆహా అంటాం!

కూచిపూడి భాగవతులు పండుగల ముందు ఇంటింటికీ తిరుగుతూ అభినయిస్తూ పాటపాడితే ఓహో అని వింటాం!

'మా కళను పోషించే వారు లేక ఇలా రోడ్డున పడ్డాం ' అని వాళ్ళు అంటే 'అయ్యో పాపం!' అని జాలిపడి పదిపైసలు బదులు రూపాయి ఇచ్చి పంపుతాం!

'మన కూచిపూడి నాట్యం కూచిపూడి సాంప్రదాయం విదేశాలలో కూడా ఖ్యాతి పొందింది! ఆ కళకు ప్రభుత్వం ఎన్నో రకాల సహకారం అందిస్తోంది! ' అని – ఎవరైనా మంత్రిగారు అంటే, చప్పట్లు కొడతాం! అంతవరకే మనకి తెలుసు కానీ– ఆనందభైరవి సినిమా చూశాకా తెలుస్తుంది ఆ కళ ఎంత గొప్పదో ఆ కళ ఏ స్థితిలో వున్నదో!

మన సంగతి మనకంటే మన పొరుగు వాళ్ళకే బాగా తెలుస్తుంది! అందుకే కాబోలు– 'ఆనందభైరవి' కన్నడ చిత్రానికి కర్ణాటక ప్రభుత్వం వినోదం పన్ను తీసివేసింది!

'ఆనందభైరవి' మామూలు చిత్రంలా తీయలేదు! ఫార్ములాకి భిన్నంగా ప్రయత్నం చేశాడు దర్శకుడు! కానీ, మంచి డ్రామావుంది! సాంప్రదాయబద్ధమైన సంగీతం, నాట్యం వున్నా ఓహో అనిపించేలా గోపాలరెడ్డి, రమేష్‌నాయుడు కృషిచేశారు నటీనటులు పేర్లు కొన్ని తెలిసినా వారివారి పాత్రలే గుర్తుంటాయి


కళా తపస్వి కె విశ్వనాథ్‌కి సమర్పించిన యీ చిత్రం ఆయన అభిరుచికి స్థాయికి తగినదిగా తీర్చిదిద్దిన జంధ్యాల ధన్యజీవి! కాకపోతే– ఈ ప్రయత్నం కన్నడం, తెలుగు భాషల్లో కాకుండా బెంగాలీ, హిందీ భాషల్లో చేసి వుంటే చిత్రం విడుదల కాకుండానే నాలుగు బంగారు పతకాలు, ఏడు వెండి పతకాలు, 22 అవార్డులు వచ్చి వుండేవి!

ఇన్ని అవార్డుల సినిమా అని తెలుసుకొని అప్పుడు చూసి ఓహో అని మనం అనుకొనే వాళ్ళం!

పోనివ్వండి మన తెలుగు భాష దేశ భాషలందు లెస్! ఉత్తరాది వాళ్ళముందు దక్షిణాది వాళ్ళు పూర్! మనవాళ్ళు గొప్ప వారంటే మనమే సహించలేం! అది మన వీక్‌నెస్!!

ఒక్కటే మాత్రం నిజం! కూచిపూడి నాట్యానికి ప్రభుత్వం ఏ మాత్రం ప్రోత్సాహం ఇస్తోందో నా దగ్గర లెక్కలు లేవుగానీ ఈ చిత్రం మాత్రం ఆ కళకి మళ్ళీ ప్రాణం పోస్తుంది!

— మధ



(గత సంచిక తరువాయి)

రావు ఏది చేసినా ఒక ప్రణాళిక తయారు చేసుకుని, దాని ప్రకారమే చేస్తాడు. అలా చేసిన ఎందులోనూ అతనింత వరకూ అపజయాన్ని పొందలేదు. ప్రేమ వ్యవహారంగానీ, మరోటికానీ, తొందరపాటు పనికిరాదని అతని నమ్మకం. అందులోనూ, ఎంతోమంది అమ్మాయిలతో స్నేహాలు నడిపిన అనుభవమూ ఉన్నదేమో, ఎప్పుడేది చేయాలి, ఏ మాట మాట్లాడాలి, బెడిసి కొట్టకుండా వ్యవహారాన్ని ఎలా ముందుకు నడిపించాలి అన్నది బాగా తెలుసు.

మొట్టమొదట పార్టీలో కలుసుకున్న రోజే అరుణ తత్వం ఎలాంటిదో తెలుసుకున్నాడు రావు ఆమె మొదట హరిమీద మనసు పడిందనీ, అతనదేమీ పట్టించుకోకపోవటం అవమానాన్నీ, మరొక అమ్మాయిని పెళ్ళి చేసుకోవటం అసూయనీ ఆమెలో కలిగించాయనీ కొంత చూసి తెలుసుకున్నాడు, మిగిలింది ఊహించుకున్నాడు.

అటువంటి సమయంలో, ఎవరికీ చెప్పు కోలేని బాధతో, ఎంత ఒంటరితనంతో బాధ పడుతూ ఉంటుందో ఊహించగలడు అందుకే మెల్లగా ఆమెనీ, ఆమె అందాన్నీ పొగిడి, మురిపించి మంచి చేసుకున్నాడు, కొన్ని నిముషాల్లోనే. మాటల్లో తను వేసిన సమ్మోహనాస్త్రాలని ఆమె కొన్ని నెలలయినా మరచిపోలేకుండా చేశాడు.

ఎన్నాళ్ళు స్నేహం చేసినా, ''నన్ను ముట్టు కోవద్దు.'' అని ఏదో సామెత చెప్పినట్టు, అర ఫర్లాంగు దూరంలోనే వుండిపోయే అమ్మాయిలని ముందే పసికట్టేసి, దూరంగా ఉంటాడు. మగవాడు కాస్త స్నేహం చేయగానే బరితెగించే అమ్మాయిలంటే అసహ్యం అతనికి తన రూపాన్ని, జోరును చూపులతోనే ఆరాధిస్తూ, తన మాటలన్నీ విని పొంగిపోతూ మెల్లగా, వెరుకుగా దగ్గరయ్యే అమ్మాయిల స్నేహంలో థ్రిల్ ఉంటుందని అనుకుంటాడు అతను. అరుణ ఈ కోవకి చెందుతుందని తెలుసుకున్నప్పట్నించీ. ఆమెని వలలో వేసు కునేందుకు ఏం చేయాల్సిందీ ఆలోచించి పెట్టుకున్నాడు.

కొన్ని రోజులు పార్కులో షికారులు సాగిన తర్వాత, అప్పుడప్పుడూ అరుణని సినిమాలకి తీసి కెళ్ళటం మొదలు పెట్టాడు రావు. ఆమె దగ్గిర బాగా డబ్బుంటుందని తెలిసింతర్వాత, పర్స్ పోయిందనీ, పొరపాటున ఖాళీ పర్స్‌తో వచ్చేననో సాకులు చెప్పి, ఆమెతో బాగానే ఖర్చు చేయించే వాడు. ఇవేవీ అర్థమయేవి కాదు అరుణకి. అర్థం చేసుకోలేనంత ఫూల్ కాకపోయినా, అతని స్నేహంలో ఉన్న మత్తు ఏమిటో, ఏం చేసయినా అతన్ని తనవాడుగా ఎప్పటికీ ఉండేలా చేసు కోవాలని తాపత్రయపడేది.

ఒకరోజు తన గదికి రమ్మని ఆహ్వానించాడు. ఒంటరిగా అతని రూమ్‌కి వెళ్ళటానికి భయ పడింది అరుణ. పోనీ '' 'సుంకేసుల'కి వెళ్ళి ఒక రోజు గడిపి వద్దాం, రమ్మని'' బలవంతం చేశాడు.

''నిన్నింతగా ప్రేమిస్తున్నందుకు నన్ను నిరాశ పరుస్తావా ? ఈ చిన్నకోరిక తీర్చలేవా?'' అని నిష్ఠూరం చేశాడు.

ఎవరికీ తెలీకుండా స్కూటర్లో ఒక ఆదివారం ఉదయం వెళ్ళి గెస్ట్‌హవుస్‌లో సాయంత్రం దాకా గడిపి వచ్చారు. అరుణ బెరుకు కాస్త తీరిపోయింది. ధైర్యం వచ్చేసింది ''అతన్ని నేనెలాగూ పెళ్ళి చేసుకుంటాను. అతని వెంట వెడితే మాత్రం ఏం తప్పంది'' అని సర్ది చెప్పుకునేది మనసులోనే. అప్పుడప్పుడూ అతని గదికి వెళ్ళి గడపటం కూడా అలవాటు అయి పోయింది.

''ఎవరో ఒకరం నాన్నతో మన పెళ్ళి విషయం చెప్పాలి'' అని అడిగింది అతన్ని. అతను సరే అంటే తనే అడగటానికయినా వెనుకాడేది కాదు. కానీ అతనికి అసలు పెళ్ళి చేసుకోవాలనే అభిప్రాయం ఎక్కడుంది? ఎప్పటికప్పుడు దొరికిన అనుభవంతో సంతృప్తి పడటమే కానీ, ఎవర్తినో స్థిరంగా ఉండిపోవాలని అనిపించదు రావుకి అందుకని ఏదో ఒకసాకు చెప్పి తప్పించేస్తున్నాడు పెళ్ళి విషయం అరుణ దగ్గిర.

''నేనింకా మీ నాన్న దగ్గర అంత బాగా సెటిల్ కాలేదు. ఇంకొన్నాళ్ళు వెయిట్ చేసి చూడు. ఆయనే వచ్చి నన్ను అడుగుతాడు, 'మా అమ్మాయి అరుణని చేసుకుంటావేమోయ్ ?' అని'' అని ఒకసారీ, ''సమయం రానీ డియర్. నేనే అడుగుతాను'' అని ఇంకోసారీ చెప్పి మరిపిస్తున్నాడు.

36

అరబ్ దేశంనుండి వచ్చిన ఒక వ్యాపారస్థుడు కర్నూల్లో త్రీస్టార్ హోటల్ ఒకటి ఓపెన్ చేశాడు. ప్రారంభానికి కొన్ని నెలల ముందే హోటల్ ప్రకటనలు 'గోరంత దీపం'లో వస్తూ ఉన్నాయి.

ప్రారంభోత్సవానికి వచ్చిన ఆహ్వానంతో, హరి హోటల్‌కి వెళ్ళాడు. మామూలు హడా విడీ, చెవులు పగిలే రికార్డు సంగీతం, అన్నిటి మధ్యా మంత్రిగారు రిబ్బను కత్తిరించటం

జరిగిన కథ — 15 : 'గోరంత దీపం' పత్రిక దినదినాభివృద్ధి చెందుతోంది పరశురాం కట్టించిన బిల్డింగ్‌లోకి పరశురాం అండ్ కం., 'గోరంత దీపం' పత్రిక ఆఫీసు మారిపోయాయి. అనంతపురంలో తన స్నేహితుని కూతురి పెళ్ళికి రమణని వెంటపెట్టుకొని వెళతాడు విశ్వమూర్తి. విక్టోరియా నర్సింగ్‌హోమ్‌లో ఒక అస్తమా పేషంటు [illegible] నిర్లక్ష్యానికి బలైపోయాడనే వార్త 'గోరంత దీపం' పత్రిక మొదటి పేజీలో [illegible] విశ్వమూర్తి, ఆ సిస్టర్‌ని ఆ వార్త చదివిన వారంతా యాగీ చేయగా ఆమె నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంగతి తెలిసి ఆమె మరణానికి పరోక్షంగా తనుకారణ మయ్యానని కుమిలిపోతాడు విశ్వమూర్తి. ఏక్సిడెంట్‌లో కాళ్ళుపోగొట్టుకున్న పార్థసారథి జీవితాన్ని కథగా 'గోరంత దీపం'లో ప్రచురిస్తాడు విశ్వమూర్తి [illegible] పెళ్ళికి వచ్చిన రావును అతని కోరికపై అరుణకు పరిచయం చేస్తాడు హరి [illegible] పత్రిక [illegible] హరిప్రసాద్ చేతుల్లోకి వచ్చింది. రావు 'గోరంత దీపం' [illegible] [illegible] గర్భంలో ఉన్న రమణ కోరికపై చనుట, హరి [illegible] [illegible] కోరుతాడు రావు.

అయింది. ముఖ్య అతిథులకి పార్టీ ఇచ్చారు. హరి కావాలనే హడావిడి తగ్గేదాకా కాచుకుని ఉన్నాడు, చివర్లో హోటల్ ఓనర్‌ని కలిసి ఇంటర్వ్యూ చేయాలని. హోటల్లో అడుగు పెట్టినప్పట్నించీ, చివర్లో తనకి అవకాశం దొరికేదాకా, మధ్య సమయం అంతా, మనసులోనే కొన్ని ప్రశ్నలు తయారుచేసి ఉంచుకున్నాడు.

ఫ్రీ పబ్లిసిటీకి అభ్యంతరం ఏముంటుంది? సంతోషంగా ఒప్పుకున్నాడు అతను. తన ఏర్ కండిషన్డ్ ఆఫీస్ రూంకి తీసుకువెళ్ళాడు. ఒక వయిపు గోడకున్న షెల్ఫ్‌లో పేర్చిన బాటిల్స్ చూపుతూ, "ఏ డ్రింక్ తీసుకుంటారు ?" అని ఆఫర్ చేశాడు.

"నో. థాంక్యూ. ఏదయినా సాఫ్ట్ డ్రింక్ చాలు" అని జవాబిచ్చాడు హరి.

ఎవరికి కావలసిన డ్రింక్ వారి చేతికి వచ్చిన తర్వాత మామూలు సంభాషణలోనే అతన్ని గురించి చాలా వివరాలు తెలుసుకున్నాడు హరి. అంతకుముందు ఫంక్షన్ టయింలో, వాళ్ళ ఫొటోగ్రాఫర్ కొన్ని ఫొటోలు తీసుకుని వెళ్లాడు.

తనకోసం టయిం స్పేర్ చేసినందుకు, ఆతనికి 'థాంక్స్' చెప్పేసి బయట పడ్డాడు.

అప్పటికి రాత్రి తొమ్మిది గంటలయింది.

అతను చెప్పిన విషయాలనే గుర్తుచేసుకుంటూ వెళ్ళాడు హరి ఆఫీస్‌కి. "ఎందరో ఇండియన్స్, డబ్బు సంపాదించేందుకు, అరబ్ దేశాలకి వెళుతోంటే, అతన్ని ఇక్కడ, ఈ దేశంలో, ఈ వూరిలో ఆకర్షించినదేమిటి ?" అన్నది హరి మొదటి సందేహం.

అందుకు ఆ పెద్దమనిషి చెప్పే కారణాలు ప్రచురణకి పనికివచ్చేవి కావు. అందుకని ఆ మాటలేవీ హరి పట్టించుకోలేదు.

తన బంధువులెవరో వచ్చి ముందుగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారనీ, వారి సలహా మీదనే తాను తన వ్యాపారానికి కర్నూలు ఎన్నుకున్నాననీ స్పష్టంచేశాడు అతను. అది సమంజసంగానే కన్పించింది. ఇటీవల కొన్ని సంవత్సరాలుగా కర్నూలు బాగా అభివృద్ధి చెందుతోంది. ఎన్నో కొత్త ఫేక్టరీలు వెలిసాయి, వాటి వెంబడే జనాభా పెరగటం, దానితోబాటు నాలుగు దిక్కులా విస్తరిస్తున్న హవుసింగ్ కాలనీలు అన్నీ చేరి మెల్లిగా కర్నూలుని సిటీగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయి. ఇటువంటి వూర్లో కొత్తగా త్రీస్టార్ హోటల్ నడపటం లాభదాయకంగానే ఉండవచ్చును--అనిపించింది హరికి.

చివర తను బయల్దేరే ముందు, అతను రహస్యం చెబుతున్న వాడిలా టేబిల్ మీదికి వంగి తనతో అన్న మాటలు పదే పదే గుర్తొస్తున్నాయి హరిప్రసాద్‌కి. "మీ దేశం అమ్మాయిలు భలే అందంగా వుంటారు ... ఇక్కడికొచ్చిన తర్వాత నేను పన్నెండు మంది బంగారు బొమ్మల్లాంటి అమ్మాయిలని పెళ్లిచేసుకున్నాను తెలుసా ?" అన్నాడు. అతను ఒళ్ళుమరిచిపోయేంతగా ఏమీ తాగలేదు. అంతవరకూ బాగానే మాట్లాడుతున్నాడు. కాబట్టి ఈ మాటా నిజమే అయి ఉండాలి అనిపించింది హరికి.

కానీ ముస్లిం లా ప్రకారం అయినా ఒక మగవాడు నాలుగు పెళ్లిళ్లు మాత్రమే చేసుకోవచ్చునని తనకి తెలుసు. మరి ఇతను పరాయి దేశం వాడయినా ఇక్కడ స్థిరపడి పోయాడు. ఇతగాడు పన్నెండు మందిని పెళ్లిళ్లు చేసుకోవటం చట్టం ప్రకారం నేరం కాదూ ? అయితే అతనా రహస్యాన్ని తన కెందుకు చెప్పాడు ? ఆ విషయం పేపర్లోవచ్చేస్తే అతను ఇరుకున పడతాడు కదా ? అంతమాత్రం తెలిసి ఉండదా? ఇందులో తన తెలివికి అందని విషయం ఏదో ఉంది అనిపించింది హరికి. తను వచ్చే వరకూ ఉంటానని చెప్పాడు విశ్వమూర్తి. ఆయన్ని అడిగేద్దాం అనుకుంటూ ఆఫీస్‌లో అడుగు పెట్టాడు.

ఆఫీస్ అంతా ఖాళీగా ఉంది. లోపల తన గదిలో విశ్వమూర్తి ఒక్కడే టేబిలు ముందు కూర్చుని సీరియస్‌గా ఏదో ఆలోచిస్తున్నాడు. ఆయన ఏమిటో కొంచెం డల్‌గా ఉన్నట్లు కన్పించింది హరికి.

"మీరు ఇంటికి వెళ్ళాలిసింది. నా కోసం కూచున్నారా?" అనడిగాడు అందుకే.

"నో అదేంలేదు. ఏదో ఆలోచిస్తూ ఉండి



గోరంత దీపం

పోయాను ఫ్లాస్క్‌లో కాఫీ ఉంది చూడు తాగుతావా?''

ఇద్దరికీ రెండు కప్పుల్లో పోసుకొని వచ్చి కూర్చున్నాడు హరి "ఎలా జరిగింది ఫంక్షన్?"

"మామూలే. కొన్ని కోట్లు ఖర్చు పెట్టి ఏర్పరచిన హోటల్, ప్రారంభోత్సవం ఎలా ఉండాలో అలాగే వుంది."

"ఇంటర్వ్యూ అయిందా..."

"అయింది. కాని నాకొక చిన్న సందేహం వచ్చింది" అని సందేహాన్ని వివరించి చెప్పాడు హరి.

ఒక నిమిషం ఆలోచించి, "నాకు తెలిసినంత వరకూ ఇందులో ఒక గూఢార్థం కనిపిస్తోంది. అతను తనకి పన్నెండు మంది భార్యలున్నారు అని చెప్పటం నిజంకాదు. తన హోటల్‌కి వచ్చే కస్టమర్స్ కోసం, పన్నెండుమంది అమ్మాయిలని రెడీగా ఉంచాను అని అతని అర్థం కావచ్చు. మనం పేపర్లో వేసే అతని ఇంటర్వ్యూని ఎంతమంది చదువుతారో తెలుసు, కాబట్టి ఆ విధంగా, ఒక ప్రకటన ద్వారా చెబితే అసహ్యంగా అనిపించే మాటని ఇలా చెప్పాడు అంతే".

ఆశ్చర్యం వేసింది హరికి. అతను అందులో అంతటి అర్థం ఉన్నదంటే నమ్మ లేకుండా ఉన్నాడు కానీ ఆ వివరణ ఇచ్చిన మాటలకి ఆధారం అయిన విశ్వం అనుభవం అది నిజమే అని నమ్మమంటోంది.

"ఇలాంటివి ప్రచురించే విషయంలోనే చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. నీకే పరిస్థితుల్లో అయినా ఏదయినా సలహా అవసరం అయినప్పుడు, ఆ సమయంలో నేను లేకపోతే, నువ్వు మన కంపెనీ లాయరు భాస్కర్రావుగార్ని సంప్రదించవచ్చు. ఆయన నాకు మంచి స్నేహితుడుకూడా.

అన్నట్టు మీ పెళ్ళికి ముందు నేను నీకొక దీర్ఘమయిన ఉత్తరాన్ని ఇచ్చాను. అది పూర్తిగా చదివి, మన పేపర్‌కి ఉన్న గౌరవాన్ని, మన పాలసీలు, ధ్యేయాలని కొంతయినా అర్థం చేసుకోగలిగావనుకుంటాను.

బాగా ఉన్నట్టు ఇలా కనిపిస్తూనే నేనెప్పుడు మిమ్మల్నందర్నీ వదిలేసి మరో లోకానికి పోతానో నాకే తెలీదు. హార్ట్ ట్రబుల్ ఉన్న వాళ్ళ ఆరోగ్యం ఎంత హఠాత్తుగా విషమిస్తుందో నీకు తెలుసుగా ?

అయినా, నేను అందుకు రెడీగానే ఉన్నాను. నాక్కావలసిన వారంతా సంతోషంగా ఉన్నారు. నా 'గోరంత దీపం' నీ చేతుల్లో చక్కగా నడిచి, మరింత పేరుని సంపాదించు కుంటుందన్న సంతృప్తి ఉంది నాకు. ఇంకేం కావాలి ?"

"అదేం మాట..." అని హరి ఏదో చెప్ప బోతుంటే, అడ్డుపడ్డాడు విశ్వమూర్తి. "ఉహు. ఇవాళ నన్ను మాట్లాడనీ. నాకు అడ్డురాకు. నీకు ఎన్నో చెప్పాలని ఉంది. యవ్వనంలో ఆవేశం ఎక్కువగా వుంటుంది. ఎప్పుడూ సెన్సేషనల్ న్యూస్ కోసమే వెతుకుతాడు. నేను చేసిందీ అదే. తెలిసీ తెలియక కొన్ని పొరపాట్లు, కొన్ని మంచి పనులుకూడా చేశాను. కానీ నా అనుభవంతో, నువ్వు పొరపాట్లు జరిగే అవకాశాలు రాకుండా చూసుకోవాలి! అదే నేను నీనుండి ఆశించేది.

న్యూస్ పేపర్ అన్నది కొంతమంది పాఠకులకు రోజూ ఉదయం కాఫీ తాగినట్టు, ఆదివారం వస్తే ప్రత్యేకంగా ఏదయినా స్పెషల్ తిన్నట్టు ఒక అలవాటుగా మారిపోతుంది. కానీ అందులోని విషయాలని పెద్ద సీరియస్‌గా తీసుకోకపోవచ్చు ఇలాంటివారు. కానీ కొందరు పాఠకులు పేపర్లో ఏది రాసినా అది నిజమనీ, నిజం కానిదే మనం ప్రచురించమనీ నమ్ముతారు. ఒక విధంగా ఈ ప్రవృత్తి మన పేపర్ పట్ల వాళ్ళకున్న గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది.

మనం వెలువరించే అభిప్రాయాలు, విషయాలు ఈ రెండో కోవకి చెందిన పాఠకుల మనసుల్ని బాగా ఇన్‌ఫ్లూయన్స్ చేస్తాయి. ఉదాహరణకి ఎన్నికల ముందు, మన పేపర్‌ని శ్రద్ధగా చదివి ఎవరు ఎలాంటివారు, ఎవరికి ఓటు వెయ్యాలి అని నిర్ణయించుకునేటందుకు, మన అభిప్రాయాల సహాయం తీసుకునేవారెందరో ఉంటారు. మనం ఒక పుస్తకాన్నో, సినిమానో రివ్యూ చేస్తే దాన్ని సీరియస్‌గా తీసుకుని, ఫలానా సినిమాని చూడాలా వద్దా అనీ, ఫలాని పుస్తకం కొని చదవటం మంచిదేనా అనీ నిర్ణయించుకొనేవారూ ఉన్నారు.

అందుకనే ప్రతీ ఒక్క అడ్వర్టయిజ్‌మెంట్ మొదలు, వార్తలు, అభిప్రాయాలు వెలువరించే వ్యాసాలు, సంపాదకీయాలు, లేదా కాలమ్స్ ఏదయినా బాగా ఆలోచించి, అది చదివే పాఠకుడికి ఉపయోగకరమూ, అతని మనసుని సరి అయిన పద్ధతిలోనే ఇన్‌ఫ్లూయన్స్ చేస్తుంది అని నిర్ధారించుకున్న తర్వాతే, ప్రచురణకి తయారుచేసుకోవాలి."

విశ్వమూర్తి మాటల్లోనే అలసిపోతున్నట్టుగా తెలుస్తూనే ఉంది హరికి. కానీ అడ్డుచెబితే కోపం వస్తుందేమో అని మౌనంగా వింటున్నాడు.


"ఇంక నీకు నిజమనీ, సరిఅయినదీ అనిపించిన విషయాన్ని పత్రికలో ప్రచురించేందుకు నిర్ణయించుకున్న తర్వాత, దానికి తిరుగు అనేది ఉండకూడదు. నువ్వు నమ్మిన పద్ధతిలో పేపర్ రన్ చేయటానికి, ఎవరు అడ్డువచ్చినా, ఎంత ఒత్తిడి తెచ్చినా ఖాతరు చేయనక్కరలేదు ప్రభుత్వం కానీ, ప్రకటనదార్లు కానీ, ఏ రాజకీయపార్టీ నాయకుడు కానీ, ఆఖరికి పరశురాం అయినా సరే. ఒకరి మాట విని వారిని సంతోష పెట్టే ఉద్దేశంతో నీ నిర్ణయాలని మార్చు కోవటం కన్నా, నీ ఉద్యోగానికి రాజీనామా ఇవ్వటం గౌరవనీయమయిన పని."

విశ్వం కొంచెం నిదానంగా మాట్లాడు తున్నాడిప్పుడు.

"అసలు ముఖ్యంగా చెప్పవలసిన విషయం మరొకటుంది. ఇంతవరకూ చెప్పిన మాటలన్నీ నా బాధ్యతగా చెప్పినవే కానీ అందులో నీకు తెలియనివి ఏమీ లేకపోవచ్చు. కానీ ఇప్పుడు చెప్పబోయే విషయం రమణకి కూడా తెలీదు, తెలియాల్సిన అవసరమూ లేదు. ఈ కంపెనీ మొత్తాన్ని, నా భాగం కొంచెం తక్కువ అయినా, నేను పరశురాం ఇద్దరమూ కలిసి అభివృద్ధి చేశాము. మా ఇద్దరిలో ఎవరు ముందుపోయినా, కంపెనీ ముక్కలు అవకుండా మిగిలిన ఒకరి చేతిలో ఒకటిగా ఉండాలనే కోరికతో ఒక అగ్రిమెంటు వ్రాసుకున్నాము. అంటే ఏ పరిస్థితిలో నయినా నేను చనిపోతే కంపెనీ నా భాగానికి వచ్చే లాభాలు అనుభవించే హక్కు మాత్రమే నా వారయిన మీ ఇద్దరికీ వుంటుంది అయితే అగ్రిమెంటు కంపెనీ వరకే పరిమితం ''

'ఈయన కేమయిందివాళ ? ఎందుకిలా

గుడివాడ 'కళా వాహిని' ఆధ్వర్యంలో విశ్వ విఖ్యాత నైరూప్య చిత్రకళావేత్త శ్రీ. యస్.వి. రామారావు అభినందన సభలో నృత్య ప్రదర్శన చేసిన చి. వడ్లమూడి రజని.



గోరంత దీపం

అన్నీ అప్పగింతలు పెడుతున్నాడు?' అని లోలోపలే ఆశ్చర్యపోతున్నాడు హరి.

"పోన్లెండి. నిదానంగా మాట్లాడుకోవచ్చు ఈ విషయాలన్నీ, బాగా అలసినట్లు కన్పిస్తున్నారు. ఇంటికి వెళ్ళి రెస్ట్ తీసుకుంటే మంచిదేమో !"

ఇద్దరూ కలిసి వారం క్రితమే కొన్న కొత్త కార్లో బయలుదేరారు. పరశురాం ఎన్నాళ్ళుగానో కొను కొనమని పోరి విసుగెత్తి మానేసాడు. హఠాత్తుగా ఇన్నాళ్ళకి కారుకొనాలన్పించింది. తెలిసిన వాళ్ళెవరో కొత్త కారునే అమ్మేస్తుంటే కొనేశాడు. "ఈ విశ్వం తనకయి మనసు వెళ్ళే దాకా ఏ పనిచేయడు. అంతదాకా ఎవరెన్ని చెప్పినా ఏమీ ప్రయోజనం లేదు" అనుకున్నాడు పరశురాం.

హరి ప్రసాద్ అనుమానం నిజమయింది. కారు సగం దూరం అయినా వెళ్ళక ముందే, విశ్వం "నాకేమిటో గుండెల్లో పట్టేసినట్లుగా వుంది హరి. నేను వెనుక కూర్చుంటాను" అని చెప్పాడు మెల్లగా రష్‌గా లేని చోట చూసి రోడ్డుకి పక్కగా కారు ఆపి, ఆయన్ని వెనక్కి పంపించి, "మీరు కొంచెం రిలాక్స్ అవండి" అని చెప్పాడు.

"ఫరవాలేదు పదవెళదాం" అని విశ్వం అయితే అన్నాడు కానీ, హరికి భయంగా వుంది. ఇంతవరకు ఆఫీసులో ఆయన మాట్లాడినతీరు, ఇప్పుడిలా నొప్పి అనటమూ చూస్తుంటే...

మధ్య మధ్య వెనక్కి చూస్తూనే డ్రైవ్ చేస్తున్నాడు. నొప్పితో ఎంత బాధ పడుతున్నాడో! విశ్వం పూర్తిగా సీటు మీద జారిగిలబడి కళ్ళు మూసుకుని ఉన్నాడు.

"నేరుగా హాస్పిటల్‌కి వెళితే మంచిదేమో! అనుకుని సుందరం నర్సింగ్ హోమ్‌కి తీసుకు వెళ్ళాడు. డా॥ సుందరం పేరు పొందిన కార్డియాలజిస్ట్. విశ్వంకి, పరశురాంకీ ఏ అవసరం వచ్చినా మొదటి నుండీ ట్రీట్‌మెంట్ ఇస్తున్నది ఆయనే.

విశ్వంకి దారిలోనే స్పృహ తప్పింది. ఆ కొన్ని నిమిషాలు రోడ్ మీద దృష్టిని ఎలా నిలిపాడో ఎలా కారు నడిపాడో హరికే తెలీదు. కారు నర్సిగ్‌హోమ్ పోర్టికోలో అడుగు పెట్టే దాకా ఎక్కడ ఆక్సిడెంట్ చేస్తానో అని భయ పడుతూనే వచ్చాడు.

విశ్వం వచ్చాడని తెలియగానే డా॥ సుందరం స్వయముగా బయిటికి వచ్చి స్ట్రెచర్ మీద తీసుకెళ్ళాడు లోపలికి.

పేషంటుని చెక్ చేసి, వెంటనే అతనికి అవసరమయిన పరికరాలన్నీ అమర్చి వెళ్ళారు డాక్టరు. "ఆయన ఎన్ని గంటలకి మన స్పృహలోకి వస్తాడో చెప్పలేను. అంతవరకూ ఆయనకీ రెస్ట్ ఇవ్వటం ముఖ్యం. వీలయినంత వరకూ ఆయన్ని చూసేందుకు ఎంత తక్కువ మంది వస్తే అంత నిశ్శబ్దంగా, ప్రశాంతంగావుంటుంది. స్పృహ వచ్చిన తర్వాత అయినా, ఆయనకే మాత్రం అలసట కలిగించటం తగదు" అని చెప్పి వెళ్ళాడు డాక్టరు.

సిస్టర్ ఒకామె వచ్చి, "ఆయనకి స్పృహ వచ్చినా, ఏదయినా అవసరం అయినా ఈ బెల్ నొక్కండి. నేను వస్తాను" అని చెప్పి వెళ్ళి పోయింది

హరికీ ఒంటరితనం భరించలేనన్పించింది వెంటనే ఇంటికి ఫోన్ చేసి రమణకి చెప్పాడు. ఆమెకిప్పుడు ఏడు నెలలు నిండాయి. ఆఫీసుకి రావటం కూడా మానేసింది.

తండ్రికి మునుపెన్నిసార్లో గుండె నొప్పి రావటం, డాక్టరు చూడటం తెలుసుగాని, ఇలా హాస్పిటల్లో అడ్మిట్ అవటం ఇదే మొదలు. "ఏమయింది? అసలాయిన్ని ఇంటికయినా రాకుండా, అలాగే తీసుకెళ్ళాల్సిన అవసరం ఏమొచ్చింది?" అనుకుంది. ఆమెకేమిటో అనుమానంగా ఉంది. చీరమార్చాలని కూడా గుర్తు రాలేదు. ఆదుర్దాగా ఇల్లు తాళం పెట్టి నర్సింగ్ హోమ్‌కి వచ్చేసింది.

మంచం మీద యోగనిద్రలో ఉన్నట్టు పడుకుని ఉన్న తండ్రినీ, ఆయన చుట్టూ వున్న ఆక్సిజన్ సిలిండర్, సెలైన్ డ్రిప్ ఆపరేటస్‌లనీ ప్రక్కనే కుర్చీలో చేతుల్తో తల రుద్దుకుంటూ కూర్చుని ఉన్న హరిని చూడగానే రమణకి మతి పోయింది.

"ఏమండీ ! ఏమయింది నాన్నకి ! ఎందుకు నేరుగా ఇటు వచ్చారు?" అంటూ తండ్రి దగ్గరికి వెళ్ళబోయింది రమణ. చెయ్యిపట్టి ఆపాడు హరి.

గది అవతలికి తీసుకెళ్ళిచెప్పాడు. ఆఫీస్‌నుండి ఇంటికి వస్తుండగా దార్లోనే గుండెల్లో నొప్పిగా ఉందన్నారు నొప్పితో బాగా బాధ పడుతున్నట్లు కనిపించింది. మళ్ళీ రావడం, డాక్టర్‌కి ఫోన్ చేయటం అదీ ఆలస్యం అవుతుంది అని, నేరుగా ఇలా తేసుకొచ్చేను. దార్లోనే స్పృహ తప్పింది. ఆయనకి అవసరమయిన ట్రీట్‌మెంట్ ఇస్తున్నాము. ఆయనెప్పుడు కళ్ళు తెరుస్తారా అని వేచి చూడటం తప్ప మనం చేయగలిగింది ఏవీ లేదు .. హాస్పిటల్లో అడ్మిట్ చేశారు అనగానే వూరికే గాభరా పడద్దు. ఇప్పుడయినా, ఆయనికి స్పృహ వచ్చేక అయినా, మనం ఎంత కామ్‌గా ఉంటే ఆయనకి అంతమంచిది. .. ... అదుగో చూడు ..అప్పుడే కళ్ల నీళ్ళు..... తప్పు కదూ !.... ఇప్పుడేమయిందని" అనునయిస్తున్నాడు హరి, రమణని అక్కడే ఉన్న ఒక బెంచీ మీద కూచోబెట్టి.

ఈ పరిస్థితిలో ఆమెకి దుఃఖం కలగటం సహజమే. నిజానికి తనకే ఏమిటో కాళ్ళు, చేతులు స్వాధీనం తప్పినట్లు అవుతున్నాయి. కాని అదేమీ బయటికి చూపించకుండా, ఆమెకి ధైర్యం చెప్పటమే తన విధి అనుకున్నాడు.


కొంతసేపు భర్త చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తూ వుండిపోయింది.

ఆ రాత్రి వాళ్ళిద్దరికీ భోజనం ఆకలి ఏవి గుర్తురాలేదు. ఇద్దరూ విశ్వమూర్తి పక్కనే కంటికి కునుకు లేకుండా గడిపేశారు. తెల్లవారినా ఆయన పరిస్థితిలో ఏం మార్పులేదు. అప్పటికి రమణకి దుఃఖం కొంత ఉపశమించింది. ధైర్యం కూడ దీసుకుంది. అంతవరకూ మొద్దుబారి పోయిన మెదడు పనిచేయటం ఆరంభించింది.

"ఏమండీ మీరింటికి వెళ్ళిపొండి. ఇద్దరమూ కూర్చుని అయినా చేయగలిగేది ఏముంది ? మీరిద్దరూ లేకపోతే ఆఫీస్‌లో కష్టం కదూ ?" అని భర్తని వప్పించి పంపేసింది.

సమయానికి సరిగ్గా పరశురాం ఊళ్ళో లేడు. తాము పబ్లిష్‌చేసే పుస్తకాలు కొన్ని మలేషియాకి ఎగుమతి చేయాలని అనుకున్నాడు అతను. అందుకు అవసరమయిన ప్రయత్నంలోనే ఢిల్లీ వెళ్ళాడు.

(ఇంకా వుంది)



ఫాలాక్షుని పేరి

పెట్టెలో పసికందు


గంగానగర్ గురుద్వార గురుసింగ్ సభ ఆఫీసుకొక భక్తుడు వచ్చి, వో సూటుకేసు ఆఫీసు రూములో పెట్టి, యిప్పుడే వస్తానని చెప్పి వెళ్ళిపోయాట్ట. ఈలోగా ఆ పెట్టి ఏడుపు లంకించుకుందట. అదిరిపడ్డ చూపరులు కలయో, వైష్ణవమాయయో అని పాడబోయి, పెట్టె తెరిచిచూస్తే వో పసికందుందటా పెట్టెలో !

లండన్‌లో సుబ్రహ్మణ్యేశ్వరుని ఏడో ఇల్లు !

లండనులో వో కొండ మీద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కోవెలను అతి సుందరంగా నిర్మించారట. ఈ కోవెల కుంభాభిషేకం ఫిబ్రవరి 12వ తేదీన అట. ఇది సుబ్రహ్మణ్యేశ్వరునకు ఏడో (పడవీడు) ఇల్లుగా పిలువబడుతోందట. ఆరు ఇళ్ళు తమిళనాడులోనే వున్నాయాయనకు.

దానంకోసం వెళితే వస్త్రాపహరణం!

పోలీసు డిపార్టుమెంటులో హెడ్ కానిస్టెబుల్‌గా పనిచేసి భోపాల్‌లో రిటైరయిన నూర్‌ఖాన్ వో వాచి రిపేరుషాపు పెట్టుకుని కాలం గడుపుకుంటున్నాడట. వోనాడతని షాపుకో యిద్దరు వ్యక్తులువచ్చి, అవతల వీధిలో ఒక ధర్మాత్ముడు బట్టలు దానం చేస్తున్నాడని పిలుచుకు వెళ్ళి లొడుక్కున్న బట్టలు విప్పి మా చేతికిచ్చి నువ్వెళ్ళు అనిచెప్పి, వున్న బట్టలిప్పించి తీసుకునుడాయించారట. ఆతని చొక్కా జేబులో కొంత డబ్బూ, ఎనిమిది రిస్టువాచిలు కూడా వున్నాయట. పోలీసు శాఖలో అన్నాళ్ళు పనిచేసి అంతలా ఎలా మోసపోయితివోయీ వో నూర్ఖానూ !



సైన్యంలో అగ్రస్థానం !

ప్రపంచంలో కల్లా చైనా దేశంలో సైన్యం సంఖ్య చాలా ఎక్కువట. 1980 లెక్కల ప్రకారం 36,00,000 లట. సోవియట్ రష్యాలో 18,25,000 లట. మన దేశంలో ఎంతో!

అతి ఖరీదయిన హోటల్ !

యు.యస్.ఎ. కు చెందిన న్యూయార్క్‌లో అతి ఖరీదైన హోటళ్ళలోకల్లా అతి ఖరీదయిన హోటలు ఒకటి (పేరు తెలీదు) వున్నదట. ఆ హోటల్లో టేబులు రిజర్వేషను ఫీజు 6,500 డాలర్లట ఆనక తిండిఖర్చెంతో ఆ భగవంతునికే తెలియాలి. భగవంతునికెలా తెలుస్తుంది – ఆయనేమైనా హోటల్లో తింటాడా – పాయింటే !

నీళ్ళకుండ కింద నగలు !

తమిళనాడు సెంగోట్టైకు చెందిన తిరుమలాపురం అనే వూళ్ళో వీరన్ అనే అతను, అతని భార్య 50 ఏళ్ళ వళ్ళియమ్మా, తమ అల్లుడికి భయపడి, వున్నదెక్కడ వూడ్చుకుపోతాడో అని అనుమానించి, ఇంట్లో వో గొయ్యి త్రవ్వి, అందులో నగలు పాతేసి, అక్కడ మంచినీళ్ల కుండ పెట్టారట. ఓరోజు వళ్లియమ్మ ఆ కుండ తీసుకు మంచినీళ్లకు వెళ్లి, తిరిగివచ్చేసరికాచోట మన్నంతా తీసి, గొయ్యి వుందట. దాంతో లబో దిబో మని పోలీసులకు చెప్తే వారు విచారించి, ఆ వళ్లియమ్మ పక్కింటి రాజమ్మను అరెస్టు చేశారట. విషయం పసిగట్టిన ఆ పక్కింటి రాజమ్మ నగలు తస్కరించి, తూత్తుకుడికి వెళ్లి, ఆక్కడమ్మేసి డబ్బు తెచ్చేసుకుందట.

రైళ్ళలో విదేశీ వస్తువుల అమ్మకం!

గోహతి—బరేన్‌ల మధ్య పరుగెత్తే రైళ్ళలో విదేశీ వస్తువులను మన రైళ్ళలో వేరుశనక్కాయలమ్మిలంత స్వేచ్ఛగా అమ్మేస్తున్నారట ఎలక్ట్రానిక్ వాచీలు, సౌందర్య సాధనాలూ, చిన్ని టేపురికార్డులు, పెన్నులు, గొడుగులూ, కెమెరాలూ అన్నీ ఆ రైళ్ళలో దొరుకుతున్నాయట.

ఫ్రెండు కోసంవెళితే .... !

సేలం అరిసి పాలయం తమ్మణ్ణసెట్టి రోడ్డులో ఫిబ్రవరి ఎనిమిదో తేదీ రాత్రి వో యువకుడు నడిచి వెళ్తుండగా ఒకతను అతన్ని ఆపి, మిమ్మల్ని ఆ లాడ్జిలో వున్న మీ ఫ్రెండు పిలుస్తున్నారన్నాడట. దాంతో ఆ యువకుడు ఆ లాడ్జికి వెళ్లేసరికి వో రూములో ఫ్రెండుకు బదులు అయిదుగురమ్మాయిలుండి రారా నా మన్మథ రాజకుమారా ! వో పదిరూపాయలకే నీకన్నిసుఖాలూ యిస్తామోయీ రారా అని తమిళంలో పాట పాడుతూ అతన్ని వేళాకోళం చేయ నారంభించారట. దాంలో ఆ యువకునికి భయం పట్టుకుని సుఖం సంగతలావుంచి, వూకుమ్మడిని సుఖరోగాలిస్తారేమోనని తారుకు పారిపోయి పోలీసులను శరణు జొచ్చాడు




మరణానంతరం

పరీక్ష రాసిన విద్యార్థిని ! ?

దాల్మియానగర్ మహిళా కాలేజిలో ఇంటరు చదువుతూన్న డెప్రిహ అనే వో అమ్మాయి మొన్న ఏప్రియల్ పరీక్షలలో ఇంగ్లీషు, సంస్కృతం పరీక్షలకు మాత్రం హాజరై ఇంగ్లీషులో 41, సంస్కృతంలో 57 మార్కులు సంపాదించుకుందట. ఇంతకూ ఆశ్చర్యకరమయిన విషయమేమంటే ఆమె 1982 డిశంబరులోనే చనిపోయిందట. కాలేజీ వో సంతాపసభ కూడా ఏర్పరచిందట. 1982 డిశంబరులో చనిపోయిన యీమె 1983 ఏప్రియల్‌లో ఎలాగ పరీక్ష రాసింది ! ఆమె వచ్చి కూర్చుని పరీక్ష రాసిందని ఇన్విజిలేటర్లు అంటున్నారట. ★

బతుకు బరువు



వి. వాణీప్రసాద్

చంద్రి గుండెల్లోని దుఃఖంలా బయట వర్షం నింగి నేలలను ఏకం చేస్తూ కురుస్తున్నది.

ఆ బీద గుండెల్లో పొంగే బాధలా ఆ ఊరి ఏరు హోరున శబ్దిస్తున్నది. ఒంటరి బ్రతుకులోని ఆవేదనలా గుడిసెలోని దీపం రెపరెపలాడుతున్నది నిస్తేజమైన చంద్రిచూపులా తోడునీడలేని బ్రతుకులా చిమ్నీ మసిబారింది. కప్పుకున్న ఒక్క దుప్పటినీ నిద్రలోనే చెరో వైపుకు లాక్కుంటున్న రామన్న లక్ష్మణులు, కన్నీటితో నిండిపోయిన చంద్రి కళ్ళకు మసగ్గా కన్పిస్తున్నారు. జారిపడ్డ కన్నీళ్ళు ఒలికిపోయిన జీవన మాధుర్యంలా చెదిరిపోయాయి అలో ఆ తను పడ్డ మాటలు మళ్ళీమళ్ళీ విన్పిస్తున్నాయి చంద్రికి

కఠినంగా, గుండెను బ్రద్దలుచేసే ఆ మాటలు వింటూ కూడ తప్పనిసరిగా పనిలోనే ఉండిపోయింది.

"లోకం బరి తెగించింది పిదపకాలం, పిదప బుద్ధులు. మొగుడుచచ్చి దినాలు ఎళ్ళీ ఎళ్ళకముందే పన్లోకొచ్చిందే ఇది ఆ నాయుడు పెళ్ళాంచూడు పాపం నాయుడు పోయి మూణ్ణెల్లయినా మనిషి కనిపించి, పలకరిస్తే చాలు బావురుమంటున్నది. ఇదీ ఉంది ఎందుకు? ఆడదాని పరువు తీయటానికి కాకపోతే..."

నిరసనగా అంటు బుగ్గలు నొక్కుకుందో ఆడకూలి. పొర్లివస్తున్న దుఃఖాన్ని భూమాతకు విన్నవించుకోటానికా అన్నట్లు చప్పున వంగి తలదించుకుంది చంద్రి. చేతిలోని వరి నారును దోయల్లో నాటటానికి ప్రయత్నించింది. కళ్ళకు నీటిపొర క్రమ్మి క్రింద భూమిగాని, చేతిలోని నారుకాని కన్పించలేదు.

"నీకెందుకసే, ఎవరికట్టం ఆరిది. ఎవరి బతుకారిది. బేగి కానీండెహె" అంటూ పనిలోకి వంగేలా చేసింది మరో ఆడకూలి.

ఎట్లాగో పనివేళయ్యేదాకా ప్రాణాలుగ్గబట్టుకుని, కూలి తీసుకుని గూటికి చేరింది చంద్రి పైసలిచ్చి కొడుకుని నూకలకని పంపేసి ముఖం చేతుల్లో దాచుకుని మరీ ఏడ్చింది. ఎవరూ ఆర్పలేని, తీర్చని దుఃఖాన్ని ఏడ్పు ద్వారానైనా ఉపశమింప చేసుకోవటానికి ప్రయత్నించింది చంద్రి. కాని; ఎదురైన కష్టాన్ని, రాజన్న లేని లోటును భరించక తప్పదు కదా !?

ఔను...

రాజన్నపోయి పదిహేనురోజులే అయింది. నిజమే.. కాని ఈ పదిహేను రోజులు తను, పిల్లలు ఏం తిన్నారో, తినలేదో, ఎలా ఉన్నారో చంద్రికి మాత్రమే తెలుసు.

కళ్లలో ప్రాణాలు పెట్టుకునీ "అమ్మా! ఆకాలే ఆకలేస్తోందే!" అని లోపలికి పోయిన కడుపులతో తన ముందు నిలబడితే.....ఇంట్లో పెట్టటానికేం లేక గుండె రాయి చేసుకుని, దుఃఖాన్ని ప్రక్కకు నెట్టి, ఓపిక కూడదీసుకుని ముఖం చాటు చేసుకుంటూనే పన్లోకి వెళ్ళింది చంద్రి.

పిదప బుద్ధిని ఎగతాళి చేశారే కాని తిండి తప్పాడ లేని తన అతీగతిని ఎవరు చూశారు? ఎవరు పట్టించుకున్నారు ?

ఆడదాని పరువు తీశావని ఎద్దేవ చేశారే కాని ఆ ఆడతనంలో అమ్మను ఎందుకు గుర్తించలేక పోయారు??

నాయుడి పెళ్ళాం గురించి గొప్పగా చెప్పుకున్నారు. కాని నాయడి పిల్లలు "అమ్మా! ఆకలి. .అన్నం పెట్టవే" అని ఏడుస్తున్నారా? వాళ్ళ ఆకలిని తీర్చలేని దరిద్రం లేదే ఆ అమ్మకి??

తనో.. తన రాజన్న తన ఆశ, సంతోషం తీసికెళ్ళిపోయాక, తననే అంటి పెట్టుకుని, దీనంగా, బిక్కముఖాలతో చూస్తున్న బిడ్డల కోసం బతుకుతున్న అభాగ్యురాలు, దిక్కులేని ఒంటరి.

చంద్రి కళ్ళముందు భవిష్యత్తు ఓ ప్రశ్నలా నిలబడి భయపెడుతున్నది. ఔను...

తల్లి దండ్రి వరద పాలైపోతే జ్ఞానం వచ్చే వరకూ అమ్మమ్మే ఆధారమూ, తోడు నీడ అయింది. పెద్ద తనంలో పడిన శరీరం పనికి



శ్రీ.శే. దామోదరం సంజీవయ్యగారి ఆంగ్ల ప్రసంగాలను తెలుగులోకి అనువదించిన శ్రీ సిద్దాని నాగభూషణంగారికి సన్మానం చేస్తున్న ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు. ఈ సభకి లోకాయుక్త శ్రీ ఆవుల సాంబశివరావు అధ్యక్షత వహించారు. జస్టిస్ శ్రీ కె. పున్నయ్య తెలుగులో సంజీవయ్యగారి ప్రసంగాలని ఆవిష్కరించారు.

బ్రతుకు బరువు

ఒక్కటేక ప్రమాదం జరిగితే, అంత వరకు ఇంటి పెద్దనే పని పాటులు నేర్చుకుంటున్న చంద్రి తమ ఇద్దరి బ్రతుకుతెరువు వెతుక్కుంటూ ఏటి ఒడ్డుకు వచ్చింది.

ప్రయాణీకుల సామానులు పడవలోకి చేర వేస్తూ, వాళ్ళిచ్చే పావలో, అర్ధో తీసుకుని బ్రతుకు సాగిస్తున్న చంద్రికి పడవతో పాటు పడవ రాజన్నతోనూ పరిచయమైంది .... పరిచయం స్నేహంగా...

"మనిద్దరం మనువాడదామే సెంద్రీ" అని రాజన్న అనే దాక వచ్చింది. తొలిసారిగా, కళ్ళు విప్పార్చుకుని రాజన్న వంక చూసింది చంద్రి. తెడ్డువేసి వేసి బిగిసిన కండలతో దృఢంగ కన్పిస్తున్న చేతులు, విశాలమైన ఛాతీ, కొన దేరిన ముక్కు, నిర్మలత్వానికి నిలయమైన కళ్ళు ఆత్మీయంగ నవ్వే పెదాలు, రంగు తక్కువే అయినా నిగనిగలాడే శరీరం, చెక్కిన శిల్పం వంటి అన్నిటికీ మించి అతని మంచితనం నచ్చింది చంద్రికి... 'ఊ' అనేసింది. మనువాడారు.

ప్రయాణీకులకు సాయపడుతూ, రాజన్నతో పాటే పడవపై ఆ ఒడ్డు నుండి ఈ ఒడ్డుకు ఈ ఒడ్డు నుండి ఆ ఒడ్డుకు సాగిపోతుంటే పడవ పూల తేరులా అన్పించేది చంద్రికి.

ఏటి అలలపై వీచే గాలి తియ్యని పాటలు విన్పిస్తున్నట్లుండేది. ఎగిరే పిట్టల్లాగే తన మనసూ మబ్బుల్లో విహరిస్తున్నట్లు అన్పించేది. ఏడి దుడుకులు లేని సాగిపోయే పడవలో ప్రయాణం తన ప్రస్తుతపు జీవితంలాగే హాయిగా ఉందనిపించేది చంద్రికి.

ముందుకు సాగిపోతున్న పడవకు ఎదురీదూ దారి యిచ్చే ఏటి నీరు తన ముందు జీవితానికి దారి ఇస్తున్నట్లు కన్పించేది చంద్రికి. ఒక్కొక్క పూసే పిచ్చిపూలతో మాల అల్లి రాజన్న మెడలో వేసి మురిపెంగ చూసుకుంటుంటే, చిలిపి చూపు చూస్తూ రాజన్న నీటిని గుండెలపై చిలకరించినప్పుడు అవి ముత్యాలు జల్లుల్లా, అలల నురుగుల్లా తాకి పరవశత్వాన్ని కల్గించేవి చంద్రికి.

సంతోషం పట్టలేనప్పుడు ఏదో పాట అందుకునే రాజన్న గొంతు చంద్రి గుండెల్లో గూడు కట్టి మళ్ళీ మళ్ళీ విన్పించేది.

ఏ కష్టం కలగకుండ పువ్వులా చూసుకునే రాజన్న... చంద్రి మొదటిసారి కడుపుతో ఉన్నప్పుడు ... కదిలితే కందిపోతుందేమో అన్నట్లు చూసుకున్నప్పుడు 'తనను కన్నవాళ్ళు లేరు' అనే బెంగే లేకపోయింది చంద్రికి.

కొడుకు రామన్న పుట్టాడు. రాజన్నతో పాటు పడవమీద పోకుండ కొడుకును చూసుకుంటూ, గుడిసె నుండే నిలబడి తన వాడైన రాజన్న కోసం ఎదురుతెన్నులు చూసేది.

పొద్దు పడమటి మారినా, ఇంకా గుడిసెకి చేరని రాజన్న కోసం కంగారు పడుతుంటే "ఏమే! పిచ్చిదానా, ఆడిపోతా వాకిట్లోనే నిలబడ్డావ్ ? పద... లోనికి పద..." అంటూ లోపలికి తీసుకొచ్చి బుజ్జగించేవాడు రాజన్న.

"ఏటి మామా? ఇంతా వర్షంలో ఏం పడవ నడుపుతున్నావ్? ఏరు పొంగితే ఎట్టాగాక్? " అని చంద్రి కోపగించుకుంటే... "పిచ్చిదానా! నీ రాజన్న గజ ఈతగాడే. నా ప్రాణానికేం ఢోకాలేదు. అవతలొడ్డున బస్సు దిగిన జనం నా కోసం నా పడవ కోసం సూస్తుంటే పడవకు లంగరేసి ఎట్టొరానే ? నన్ను, నా పడవను చూశాక ఆళ్ళ సంబరం సెప్పలేక లేందా ? ఆనాటి గుహుడు నాకు గురువే మొన్న గుళ్ళో అయ్యగారు చెప్తుంటే ఇనలేదూ? రాముడు సయితం వచ్చి నా పడవెక్కాక పోవచ్చు కాని సెంద్రీ! అందరిలో రాముడున్నాడే" — అని అలిగిన చంద్రికి నచ్చచెప్పేవాడు రాజన్న.

తన బిడ్డలకు రామన్న, లక్ష్మణ అని పేర్లు పెట్టుకొని "ఆళ్ళని నాలాగ చదువు రానోళ్ళని చెయ్యనే కూలి బతుకియ్యనే మంచి సదువులు సదివిస్తా. ఫలానా పడవ రాజన్న కొడుకులు 'హన్నా! ఎంత గొప్పోళ్ళయ్యారు' అని అందరూ ముక్కుమీద వేలేసుకునేలా సేస్తా. ఎంత కష్టమైనా సరే" — అని కలలుకన్న రాజన్న ఆ కలల్ని ఇలలో నిజం చేసుకోకుండానే ఏ శూన్యంలోకో వెళ్ళిపోతే గుండె బద్దలయ్యేలా ఏడ్చింది చంద్రి.

రామన్న లక్ష్మణుల తర్వాత ఓ కడుపు పోయి, బలహీనపడి లేవలేకపోయిన చంద్రికి, బెంగ పడిపోతూ, తల్లికంటె మిన్నగ సేవచేసి, కడుపులో దాచుకున్న రాజన్న "ఇక మనకు పిల్లలొద్దే. ఉన్నోళ్ళిద్దరు సాలు. ఆళ్ళను బాగ పెంచి గొప్పోళ్ళను సేస్తే సాలు. మొన్న సుమారి కొప్పు డాక్టరు సెప్పినట్టు ఆపరేషన్ సేయించుకుంటానే" అని డాక్టరు దగ్గరకెళ్ళిన రాజన్న

తనకున్న ఒక్క పుట్టింటి బంధువు, తనకు రాజన్న తోడయ్యేవరకూ అండగ ఉన్న అమ్మమ్మ పోతే "పిచ్చిదానా! సావు బతుకులు మనసేతిలోనా ? ఇయ్యాల అమ్మమ్మ. రేపు నేనో, నువ్వో, ఎవరి బతుకు కాశితమే. బగవంతుడు కబురంపేదాక బతకాలి. సిలవంగా నే నవ్వుతూ పోవాల ఏడవకే సెంద్రీ. నువ్వేడిస్తే నే సూడలేనే." అని ఓదార్చి, తనకు తెలిసిన సత్యాన్ని బోధించాడు.

చంద్రికి తండ్రి, తోడు నీడ, ప్రాణం — జీవితం అన్నీ అయిన రాజన్న అటువైపున్న ప్రయాణీకులకోసం పడవ తీసుకెళ్తుంటే వర్షం మొదలై ఉధృతంగ వీచిన గాలికి, ప్రవాహ వేగానికి కొట్టుకుపోయి మూడోనాటికి శవంలా ఒడ్డుకు కొట్టుకొస్తే; రాజన్నకోసం కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్న చంద్రికి సంగతి తెలిసి ఒక్క పరుగున నీటిఒడ్డుకు చేరింది.

ఉబ్బిపోయి, చేపలు కొరకగా భయంకరంగా ఉన్న రాజన్న శరీరాన్ని చూసి ఆ రాజన్నేనా ఈ రాజన్న !? తన ప్రాణం రాజన్న అని మూర్ఛ పోయింది.

తెలివి వచ్చాక, లేచి... ఒకటే పరుగుతో తనూ ఆ ఏట్లోనే కలిసిపోదామని ముందు దురికింది.

జనం వెంబడి పడ్డారు.. ఆపలేకపోయారు.

కాని... కాని చంద్రి ఆగిపోయింది. . నిలిచి పోయింది.

"అమ్మా ! అమ్మా ! నాన్నా !" అనే బిడ్డల పిలుపు, ఏడుపు పేగు కదిలించింది... గుండె కరిగించింది... ప్రేమ ప్రవహించింది. వెనక్కు తిరిగి చూసింది.

దీనంగా... దీనాతి దీనంగా తనవైపే పరుగెత్తుకొస్తున్న తన బిడ్డలు, తన కడుపు పంటలు .. ఉహూ... తన రాజన్నను ప్రతి రూపాలకోసం వెనక్కు మళ్ళింది.

తను బ్రతికి కలలు పండించాలనుకుంది.

కాని... బిడ్డల్ని కావలించుకుని ఏడ్వటమే తప్ప వాళ్ళకేంకావాలో కనుక్కోలేకపోయింది.

అప్పటికి వాళ్ళను చేరదీసి, వాళ్ళ ఆకలిని ప్రక్కింటి తల్లి తీర్చింది. అలా ఒకరోజు .. రెండో రోజు... తర్వాత ? తర్వాత ?? మెల్ల మెల్ల మెల్లగా దుఃఖాన్ని ప్రక్కకు నెట్టుతూ ఇంట్లో ఉన్న బియ్యమో, నూకలో, జొన్నలో ఏదో వండి వాళ్ళకి పెట్టింది.

ఆకలితో నకనకలాడుతున్న పేగులు పెడుతున్న బాధను తట్టుకోవటంకోసం కంచంలో పెట్టు కున్న ముద్దనోట్లో పెట్టుకోబోతుండగా...

ప్రేమతో రాజన్న తననోటి కందించిన ముద్ద గుర్తుకువచ్చి వలవలా ఏడ్చింది కన్నీళ్లు పెదవులపై ప్రాకి వర్తమానంలాగే ఉప్పగా తగిలాయి జిహ్వకి. తమ చిన్నారి చేతులతో తల్లి కన్నీళ్ళు తుడిచి మరో ముద్ద నందించారు రామన్న లక్ష్మణులు... తండ్రికి వారసులుగా. బిడ్డల్ని చూసుకుంటు తనూ తిన్నా నన్పించింది చంద్రి

కాని.......అవీ నిండుకుంటే.... ఎక్కడా పుట్టకపోతే, ఆ ఆకలి తీరేదెలా ? ? . .తను ముడుచుకు పడుకుంటే ఆ బిడ్డలూ పడుకో గలరా ? ?..."అమ్మా ! ఆకలే.. ఆకలేస్తుందే" అన్న వాళ్ళ రోదనే చంద్రిని లేపింది. 'బగమంతుడా ! మనిషికీ ఆకలి నెందుకుపెట్టా వయ్యా ?!"-అని కన్పించని ఆ భగవంతుడ్ని అడుగుతూనే విధిలేక పన్లోకి వెళ్ళింది.

కాని ..అక్కడ తనతోటి ఆడదే తన నన్న మాటలు మనసును తూట్లు చేస్తుంటే, తనకు రాజన్న అంటే ప్రేమలేదా ?...దిగులు లేదా ? బాధ లేదా ? ...లేదా ? ? రాజన్న మంచి తనానికి మెచ్చుకున్న ఈ జనం ఆ రాజన్నే ఏటి పాలయితే ఆడి పెళ్ళాం పిల్లల గురించి పట్టించు కోలేదేం ? ? ఎదుటవాని మంచిని గురించి మెచ్చుకున్న ఈ మనుషుల్లో మంచితనం ఎండ మావేనా ?

తోటి ఆడదాన్ని గురించి అంత గుండెలేని మాట అనగల్గిన ఆమెకి బిడ్డల ఆకలి తెలీదా ? బతుకు బాధ తెలీదా ? ?

బగమంతుడా ! బుద్ధి తెలిసేనాటికి తల్లిని, తండ్రిని కరువుపాలు చేశావు. ఓ ముసలమ్మను ఆసరా ఇచ్చావు. అదీ లాక్కున్నావు. మళ్ళీ ఓ మంచి తోడునూ కూర్చావు. ఓ గూడును ఇచ్చావు. కడుపు పంట పండించావు. చివరికి ఒంటరిగానే ఈ మనుషులలో విడిచి శపించావు. ఇట్లాంటి మనుషుల మధ్య నా బిడ్డలను పెంచి, నా రాజన్న కలల నెలా పండించగలను ? అయినా తప్పదు...

అందుకు ధయిర్యాన్ని, బలాన్నీ నువ్వే ఇవ్వు తండ్రీ ! అదీ నీ బారమే. ఇకనాకు అన్నీ నువ్వే ...అని ఏనాడో, రాజన్న గుడిసె గోడకు తగి లించిన; అభయ మిస్తున్నట్లున్న సీతారాముల పఠానికి చేతులెత్తి నమస్కరించింది చంద్రి

'జీవితమంటేనే కష్టసుఖాల కలయిక. ధైర్యంగా నీ కర్తవ్యం నువ్వు నెరవేర్చు. అన్నిం టికి నేనున్నానని'— రాములవారు అంటున్నట్లుగ అన్పించింది చంద్రికి.

లేచి కొడిగడుతున్న దీపానికి, సీసాలో ఉన్న కొద్దిపాటి చమురును పోసింది. ఆ క్రొత్త వెలుగులో పఠంలోని రాములవారి చిర్నవ్వు మరింత వెలిగింది. చంద్రి గుండె తేరుకుంది.

రామన్న లక్ష్మణులు ప్రశాంతంగా నిద్ర పోతున్నారు.


వర్షపు జోరు, ఏటి హోరు నెమ్మదించింది. ★

చదివే కంప్యూటర్ !

...చేయబడిన ... ఒక కొత్త కంప్యూ టర్ ... వెలువడింది. ...

... కొనటానికి ... దీని గ్లాస్ ... ఉంచిన పేజీలోని మాటలను ఈ కంప్యూటర్ చదువు తుంది. కంట్రోల్ ప్యానెల్ సహాయంతో కంప్యూటర్ పఠన వేగాన్ని తగ్గించు కొనవచ్చు, హెచ్చించుకొనవచ్చు. ఈ యంత్రం, పేజీలోని పంక్తులను మళ్ళీ మళ్ళీ చదువగలదు. స్పెల్లింగ్ చెప్ప గలదు. కామా, ఫుల్‌స్టాప్ మొదలైనవి కూడా చెప్పగలదు. దీని వెల సుమారు 30 వేల డాలర్లు.

జిరాక్స్ కార్పొరేషన్ అనుబంధ సంస్థ దీనిని తయారుచేసింది. జిరాక్స్ కార్పొరేషన్ అమెరికాలో కెల్లా పెద్ద ఎలెక్ట్రానిక్ సంస్థ. ఈ సంస్థ 200 పఠన యంత్రాలను దేశవ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలకు యూనివర్సిటీలకు విరాళంగా ఇచ్చింది.





ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

వి. భి. ఆర్. — మచిలీపట్నం

ఈనాడు రేడియోలో ప్రత్యేక కార్యక్రమాలు కల్పించి, పత్రికలలో ప్రత్యేక శీర్షికలు కేటాయించి, సిటీబస్సుల్లో ప్రత్యేకం సీట్లు ఇప్పించి ప్రభుత్వ శాఖల్లో 30% కేటాయించి, ప్రత్యేక విశ్వవిద్యాలయం స్థాపించి, తండ్రుల ఆస్థిలో వాటాకు చట్టంచేసి— సినిమా టిక్కెట్లలో ముందే ఇచ్చి ఇంకా ఇంకా సదుపాయాలు కలగచేస్తున్నా నేటి మహిళ లేచిన దగ్గరనుంచి పడుకునేదాకా— తనకు అన్యాయం జరిగిపోతోందని— అరవడంలో ఆంతర్యం ఏమిటి ?

ఇన్ని చేశామంటున్నా — తనవొక మనిషిగా— వ్యక్తిగా గుర్తించడం లేదని— చెప్పక చెప్తోంది— ఆ అరవడంతో ! చదువుకున్నా, సంపాదిస్తున్నా, కుటుంబ భారాన్ని మోస్తున్న అక్కరలేని సంతానాన్ని కంటున్నా, వారికోసం మనసులేని దాంపత్యం సాగిస్తున్నా— ఆమెకి సానుభూతి ఎక్కడ లభిస్తోంది ? హక్కులిచ్చారు. వాటిని నిజంగా వినియోగించుకునే స్త్రీలని మీరే— ఏమంటున్నారు? హర్షిస్తున్నారా ? ఆదరిస్తున్నారా ?

యి. ఎమ్. కాశీబుగ్గ

నా వయస్సు ఓన్లీ ట్వంటీటూ. అప్పుడే లైఫ్ అంటే బోర్ కొట్టేస్తోంది. మీ కింత వయస్సు వచ్చినా ఎలా నిశ్చింతగా వుండ కల్గుతున్నారు ?

★ ఐ కీప్ మై సెల్ఫ్ బిజీ — పనితోనో సరదాలతోనో ఎప్పుడు ఏదో వ్యాపకం పెట్టుకుంటాను. అందుకే—నా వయసుకీ— నా మనసుకీ సంబంధం వుండదు. శరీరానికి కాని వయసు మనసుకి కాదు. ఇరవైకే ఇలా అంటే ఎలా? ధ్యేయం లేకుంటె కుర్రాళ్లకి యిలాగే వుంటుంది. కీప్ డూయింగ్ సమ్‌థింగ్.

డి. ఎ. కె. — హైదరాబాదు

రామలక్ష్మిగారూ మీ ముఖం చూస్తే మాకు కోపంగానూ, శ్రీ శంకరశాస్త్రిగారి ముఖం చూస్తే జాలిగానూ వుంది ?

★ మీ జాలి అనవసరం ఆ గెడ్డంలో ముఖం చూశానంటే — నేను నమ్మను !!

కె. ఎస్. ఎస్. ఎస్. — డామ్

దేవుడున్నాడంటారా ?

★ ఉండే వుంటాడు సోదరీ — లేకపోతే — ఈ కలుషితమైన వాతావరణంలో యింకా ఎలా బ్రతికి వుంటున్నట్టు ?!

కె. వి. ఆర్. — భీమారాలపేట

నాగుబాముని నమ్మవచ్చుగాని ఆడదానిని నమ్మగూడదు అని రావణుడు అన్నాడు ప్లీజ్ కామెంట్.

★ రావణుడన్నాడా మీరంటున్నారా?

పెండ్లి అయిన తరువాత చాలామంది భార్యల చేతిలో కీలుబొమ్మలై పోతున్నారు కారణం ఏమిటి కె. రా. గారూ ?

★ వయసు మోజు స్వామీ అంతే

ఎ. వి. ఆర్. — కాత్రేనికోన

వరకట్నంపై మీ అభిప్రాయం ఏమిటి ?

★ అది మనుషుల కక్కుర్తికి చిహ్నంగా; సిగ్గులేనితనానికి నిదర్శనగా తోస్తుంది నాకు.

పి. ఆర్. — ఇల్లెందు

ప్రేమ విషయంలో అబ్బాయిది తప్పయితే— అమ్మాయికి సానుభూతి చూపుతారు. కాని అమ్మాయిది తప్పయితే అబ్బాయికి సానుభూతి చూపి ఆదరించరెందుకు ?

★ అతగానికేం ? మగమహారాజు అంటారు. ''విజిబుల్'' ఫలితాలు — అమ్మాయికేగాని అబ్బాయికి వుండవు కనుక. అయ్యో పాపం అంటారు అమ్మాయిని.

ఈ దేశంలో ప్రజల కంటే ముందు — అవినీతికి, అధికారులకి స్వతంత్రం వచ్చిందనుకుంటున్నాను.

★ నిజమే — తెల్లదొరలే తినిపోతున్నారని పోరాడి నల్లదొరలకి — ఆ ఛాన్సు యిచ్చారు — స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న యోధులు. అందుకే వాళ్లంతా పింఛనులతోటే తామ్రపత్రాలతోటే తృప్తిపడి — ఆవేదనను — దిగ్రమింగుకుంటున్నారు.

శ్రీనివాస్ — భువనేశ్వర్

ఓనమాలంటే మారాంచేసే బుజ్జిగాడిని కూడా డిస్కో డిస్కో అంటూ కుప్పిగంతులు వేయిస్తున్న యీ డిస్కో డిసీజ్ — పై మీ అభిప్రాయం ?

★ మీరే అన్నారుగా డిసీజ్ అని. దాని కోర్సు అది రన్ అవాలి. అప్పుడే క్యూరు అవుతుంది ! తాత్కాలికమైన యిలాంటి సరదాలని గురించి బెంగపడితే ఎలా ? ఈ డిస్కోలోకి వచ్చి శృంగారాన్ని, జుగుప్సని చొప్పిస్తున్న 'సినిమా డిస్కో'లని అనండి— అవి చూస్తోంటే నాకూ సిగ్గుగానే వుంది. మనతో వచ్చిన చిక్కేయిది — ఏదొచ్చిన విపరీతమే !


పి. యి. యమ్. — విశాఖపట్నం

క్షణికమైక జీవితానికి ఆంక్షలు ఎందుకో నాకు అర్థం కాదు

★ ఆ క్షణంలోనే — జీవితాన్ని కుక్కలు చింపిన విస్తరిగా తయారు చేసుకోకుండా వుండడానికి.

ప్రేమ పేరుతో మీ ఆడవాళ్ళు కూడా పురుషుల్ని మోసం చేస్తున్నారు. మీకు తెలియదనుకుంటాను.

★ ఎందుకు తెలియదు ? మోసపోడానికి సిద్ధంగా పురుషులు వుండగా !! ★




సెనగపిండి వాడినా, పసుపు వంటికి రాసినా శరీరం తెల్లబడేనా—ఏమంటావు ఓ మనసా!

వసిమి ఛాయ ఎందులో వుంది? సెనగపిండి, నిమ్మరసం - గ్లిసరీన్, పసుపు, పాల మీగడ, దోస రసం ... ఈ పారంపరిక చిట్కాలు మహా యిస్తే చర్మానికి కాస్త నిగారింపు ఇస్తాయి అంతే. కాని వంటి ఛాయని నిజంగా తెల్లబరుస్తాయా?

మీ చర్మం రంగును నిర్ణయించేది ఏమిటి?

మీ చర్మం లోపల మెలానిన్ అనే నల్లని రంగు పదార్థం వుంది. ఇది చర్మంలో ఎంత ఎక్కువగా వ్యాపిస్తే మనుషులు అంత నల్లగా కనబడతారు. మీ చర్మం రంగు మీద ప్రభావం చూపే బయటి కారణాలు కూడా ఉన్నాయి. ఎండలో మీరు బయటికి వెళ్లినప్పుడు సూర్యరశ్మిలోని అల్ట్రావయొలెట్ కిరణాలు మిమ్మల్ని మరింత నల్లబరుస్తాయి.



వంటి ఛాయను పెంచడానికి సరియైన పద్ధతి ఏదైనా ఉందా?

ఉంది. మొట్టమొదటిసారిగా సాధించిన ఓ వైజ్ఞానిక విజయం ఫెయిర్ అండ్ లవ్‌లీ—నల్ల చర్మాన్ని తెల్లపరిచే క్రీమ్. ఇది మీ చర్మం నల్లబడటాన్ని అరికట్టి, తిరిగి ఎర్రగా రంగుతేలేలా చేస్తుంది.

ఫెయిర్ అండ్ లవ్‌లీ ఎలా పనిచేస్తుంది?

లోపలా, బయటా 2 విధాలుగా.

<u>చర్మం లోపల</u>: ఫెయిర్ అండ్ లవ్‌లీ క్రీము చర్మం అడుగున మృదువుగా, సురక్షితంగా పనిచేసి, నల్లబడుతున్న చర్మం తిరిగి రంగు తేలేలాగ చేస్తుంది

<u>చర్మం బయట</u>: ఫెయిర్ అండ్ లవ్‌లీలోగల 'సూర్య రశ్మిని వడబోసే' ప్రత్యేక పదార్థాలు, అల్ట్రావయొలెట్ కిరణాలు మీ చర్మాన్ని నల్లబరచకుండా అడ్డగిస్తాయి. అయినప్పటికీ, సూర్యరశ్మిలోని ఆరోగ్యమంతటినీ మీరు పూర్తిగా పొందగలుగుతారు

రంగు తేలడానికి కేవలం 6 వారాలు!

ఫెయిర్ అండ్ లవ్‌లీని ఆరు వారాలపాటు క్రమం తప్పకుండా రోజుకు రెండుసార్లు రాసుకోండి. మొదట, చర్మం మీద కాస్త జిమజిమలాడవచ్చు. ఫెయిర్ అండ్ లవ్‌లీ పనిచేస్తున్నదనడానికి అది నిదర్శనం. ఆరు వారాల్లో ఇచ్ఛితమైన తేడా మీకు కన్పిస్తుంది, ఇతర్లకీ కన్పిస్తుంది, క్రమం తప్పకుండా వాడుతూ ఉండండి, ఫెయిర్ అండ్ లవ్‌లీ శరీర ఛాయతో అలాగే వుంటారు మీరు.

ఫెయిర్ అండ్ లవ్‌లీ గురించి మీరు మరిన్ని వివరాలు తెలుసుకోవాలనుకుంటే, ఈ చిరునామాకు వ్రాయండి:

FAIR & LOVELY ADVISER,
P.O BOX 758,
BOMBAY 400 021.



ఫెయిర్ అండ్ లవ్‌లీ

నల్ల చర్మాన్ని ఎర్రపరిచే క్రీమ్

హిందూస్థాన్ లీవర్ వారి
విశిష్ట ఉత్పత్తి

ఇది సహజంగా, మృదువుగా మీ వంటి ఛాయను పెంపొందిస్తుంది.

సీరియల్

కలనిజమైతే...!

— విన్నకోట సుశీలాదేవి

(గత సంచిక తరువాయి)

కిరీటి మోచేతిని కళ్లకు అడ్డుపెట్టుకున్నాడు. అతికష్టం మీద బాధని అణచుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

సారథి లేచి కిరీటి దగ్గరకు వచ్చి, అతని బుజంమీద చెయ్యివేసి —

''కిరీటీ ! వూరుకోరా ! ఆ చెడుఘడియలు దాటిపోయాయిరా ! ఇక నీ జీవితమంతా పండువెన్నెలే !'' అన్నాడు.

కిరీటి టవల్‌తో ముఖం గట్టిగా తుడుచుకున్నాడు.

''సారథీ ! మీనాక్షి వుదయం ఆరు గంటలకు వుత్తరం రాస్తే నాకది సాయంత్రం వరకూ చేరలేదురా ! మీనాక్షి చెప్పినా ఆ కుర్రాడెందుకు నా దగ్గరకు వెంటనే రాలేదో ! ఆపరేషన్ అవగానే మీనాక్షి కళ్లు తెరిచి నాకోసం చూసి వుంటుంది. నేను కనబడక ఎంత బాధపడిందో?'' దుఃఖంతో ఇక మాట్లాడలేకపోయాడు కిరీటి.

''కిరీటీ ! అదంతా ఒక పీడకలగా మర్చిపోరా ! నీ మీనాక్షి తిరిగి నీ దగ్గరకు వస్తోంది కదా ! ఇంకెందుకురా విచారం !''

కిరీటి మాట్లాడలేదు.

''రేపే బుధవారంరా, కిరీటీ !''

కిరీటి కళ్లెత్తి సారథివేపు చూశాడు. క్షణకాలం అతని కళ్లల్లో 'ఆశ' తళుక్కుమంది.

* * *

సారథి మీనాక్షి కనబడిందని చెప్పిన దగ్గర్నించి ఒక సందేహం కిరీటి మనస్సుని పురుగులా తొలుస్తోంది.

మీనాక్షి జీవించివుంటే ఇన్నాళ్లూ తనని కలుసుకోడానికి ఎందుకు ప్రయత్నించలేదు ? హైద్రాబాద్ బ్యాంకులో కనుక్కుంటే తనీ వూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న విషయం చెప్పేవారు కదా ! ఎందుకు వూరుకుంది ?

ఆమె తనని మర్చిపోయిందా? లేక తనమీద ప్రేమ చచ్చిపోయిందా ? లేక ఆమె కళ్లు తెరిచేసరికి తను ఎదురుగా వుండనందుకు కోపం వచ్చిందా ?

అసలు సారథి చూసిన ఆ మ్మాయి మీనాక్షేనా ? లేక సారథి పొరబడ్డాడా ?

కిరీటి ఇలా ఆలోచనల్తో సతమతమైపోతుండగా — సారథి లోపలకు అడుగుపెట్టాడు.

కిరీటి అతడివేపు ఆత్రంగా చూశాడు. కానీ కిరీటి ఆశించిన వుత్సాహం — ఆనందం సారథి ముఖంలో కనబడలేదు.

''సారథీ ! ఏవయింది ? ఆ అమ్మాయి షాపుకు రాలేదా ?'' కిరీటి 'మీనాక్షి' అనలేకపోయాడు.

''ఉహు రాలేదు.''

''మరి కళ్లజోడు ఎప్పుడు తీసుకుంటుంది ?''

''కళ్లజోడు తీసుకుంది !''

కిరీటి విసుక్కున్నాడు. ''అబ్బ ! అసలు విషయం త్వరగా చెప్పరా ?''

సారథి కిరీటి కెదురుగా నున్న కుర్చీలో కూర్చున్నాడు.

''మీనాక్షి నిన్న షాపుకు ఫోను చేసిందిట ! వాళ్లు కళ్లజోడు వచ్చిందని చెప్పారుట. నిన్న సాయంత్రమే ఒక కుర్రాడిని పంపించి తెప్పించుకుందిట !'' అని చెప్పాడు సారథి.

''ఇప్పుడిక ఎలాగురా !'' కిరీటి నిరాశగా అన్నాడు.

''ఏం ఫర్వాలేదులేరా. ఒక్క మార్గం వుంది !''

''ఏమిటది ?''

''ఆ షాపులో నా ఫ్రెండు వున్నాడని చెప్పాగా అతడొక తెలివైన పని చేశాడు !''

''ఏమిటది ?'' ఆత్రంగా అడిగాడు కిరీటి!

''ఆ షాపు యజమాని రసీదు ఇస్తూ ఆ కుర్రాడి పేరు అడిగాడుట — ఆ కుర్రాడు పేరుతోపాటు తను చదివే కాలేజీ పేరు కూడా చెప్పాట్ట ! మనవాడు వాటిని జాగ్రత్తగా విని - వేరే కాగితంమీద రాసిపెట్టుకున్నాట్ట !''

సారథి జేబులో నుండి కాగితం తీసి చూపాడు !

''దీనివలన ఏం ప్రయోజనంరా !'' పెదవి విరిచాడు కిరీటి.

''ఎందుకు లేదురా! ఈ కొద్ది క్లూ వుంటే చాలు. అన్ని విషయాలు తెలుస్తాయి !''

''ఎలా ?''

''ఆ కాలేజీ కెళ్లి ఆ కుర్రాడిని కలుసుకుంటాను అతని ద్వారా మీనాక్షి వివరాలు తెలుసుకుంటాను. కిరీటీ ! నీకెందుకు నువ్వు నిశ్చింతగా వుండరా. అనుకున్నది సాధించే వరకూ ఈ సారథి నిద్రపోడు తెలుసా !'' సారథి తల ఎగరవేశాడు.

కిరీటి నవ్వాడు.

''ఈ రోజే అంతా తేలిపోతుందనుకున్నాను కానీ ఇలా అడ్డం తిరిగేసరికి కొంత నిరుత్సాహం కలిగిందిరా. అంతే. కిరిటీ ! నిన్నూ, మీనాక్షిన్ కలపాలి ! అదే నా జీవితాశయం ''

సారథి అభిమానికి కిరీటి మనస్సు స్పందించింది

''సారథీ ! నీలాటి స్నేహితుడు దొరకడం నా అదృష్టంరా ! ''

సారథి నవ్వాడు

''పొగడకురా ! పొగిడితే ఉబ్బిపోయి ఇక కదల్లేను ఆ తర్వాత నువ్వే నష్టపోతావ్ ! తెలుసా.''

కిరీటి బిగ్గరగా నవ్వాడు !

* * *

''సక్సెస్ గ్రాండ్ సక్సెస్'' సారథి అరుచుకుంటూ లోపలికి వచ్చాడు !

డ్రాఫ్ట్ రాస్తున్న కిరీటి తలెత్తి చూశాడు! సారథి ముఖం ఆనందంతో వెలిగిపోతోంది !

కిరీటిలో ఆరాటం పెరిగింది.

''ఏం జరిగింది ? ''

''చెప్తా !''

సారథి కిరీటి ఎదురుగా కూర్చున్నాడు.

''మీనాక్షి ఇల్లు కనుక్కున్నాను !''

''నిజంగానా ! ఎక్కడ ? '' కిరీటి సంభ్రమంగా అడిగాడు.

''సత్యనారాయణపురంలో''

''ఎలా తెలుసుకోగలిగావు ? ''

జరిగిన కథ — 3 : హైదరాబాద్ ఉస్మానియా హాస్పిటల్లో చనిపోయిన మీనాక్షి బ్రతికొచ్చిందని సారథి ద్వారా తెలుసుకున్న కిరీటి మనసులో అలజడి రేగింది. పాత జ్ఞాపకాలు ముట్టుముట్టాయి — కిరీటికి మీనాక్షి బ్యాంకులో పరిచయమవుతుంది. కిరీటి ఆహ్వానంపై అతని ఇంటికి వస్తుంది మీనాక్షి. అతనివద్ద వయొలిన్ నేర్చుకోను శిష్యురాలిగా చేరుతుంది. మీనాక్షి ఆరోగ్యం మంచిది కాదని తెలుసుకొని బాధపడతాడు కిరీటి. ఆమె తనని ప్రేమిస్తోందని తలుస్తాడు. మీనాక్షిని సారథికి పరిచయం చేస్తాడు. గత స్మృతులలో నుండి బయటపడతాడు కిరీటి — మీనాక్షిని తనొక కళ్లజోడు షాపులో చూచినట్లు చెప్తాడు సారథి. కిరీటి ఒకసారి హైదరాబాదు వెళ్లిరాను నిశ్చయించుకుంటాడు. హైదరాబాదు వెళ్లిన కిరీటి నిరాశతో తిరిగి వస్తాడు. సారథి మీనాక్షి గురించి అడుగగా గతాన్ని తలపోస్తాడు — కిరీటి మీనాక్షి ఉత్తరం చదివి ఉస్మానియా హాస్పిటల్‌కు వెళుతాడు. అక్కడ ఆమె చనిపోయిందని తెలుసుకొని బాధకు తట్టుకోలేకపోతాడు.

"అబ్బ ! అదంతా పెద్ద కథరా !"

"వివరంగా చెప్పరా !" కిరీటి అడిగాడు.

"కాలేజీకెళ్లి కుర్రాడిని కలుసుకున్నాను. అతడు మీనాక్షి పెద్దనాన్న కొడుకుట."

"అలాగా !"

"మీనాక్షి తండ్రి పేరు అడిగాను. 'కామేశ్వరరావు' అన్నాడు.

ఆయన కొంతకాలం హైద్రాబాద్‌లో పనిచేసి ఆ తర్వాత మద్రాసులో వున్నాడుట. విజయవాడలో స్వంత బిజినెస్ పెట్టాలని వచ్చాట్ట !"

"మీనాక్షి తండ్రికి బిజినెస్ వుందిరా హైద్రాబాదులో !"

"అతనేదో చెప్పాడులే ! నేనంత వివరంగా అడగలేదురా !"

"పోనీలేగానీ — మీనాక్షి గురించి ఏం చెప్పాడు ?"

"నేను ఏమీ అడగలేదు."

"ఏం ?" నిరాశగా అన్నాడు.

"మీనాక్షిని కలిసినపుడు నువ్వు ఆమె నోటివెంట ఆ వివరాలు వింటే బాగుంటుంది !" అన్నాడు సారథి.

"సరేలే"

"మీనాక్షి ఇంటి అడ్రసు తీసుకొచ్చాను."

"అయితే రేపు వెడదాం," వుత్సాహంగా అన్నాడు కిరీటి.

"కానీ ఒక చిక్కొచ్చిందిరా !"

"మళ్లీ ఏమైందిరా !"

"వాళ్లు మద్రాసు వెళ్లారుట ! వచ్చే సోమవారం వస్తారుట !"

ఆ మాటతో హతాశుడయ్యాడు కిరీటి. అడుగడుగునా ఈ అడ్డంకు లేమిటో ? మీనాక్షి ఇంత దగ్గరగా వున్నా తను చూడలేకుండా వున్నాడు. తనసలామెని కలుసుకోగలడా ?

కిరీటి ముఖంలోని భావాల్ని గమనిస్తున్న సారథి —

"కిరీటీ ! ఇంతకాలం ఎలాగో గడిచింది కదా ! ఒక్కవారం ఓపికపట్టు. ఇక ఆ తర్వాత అంతా ఆనందమేగ !" అంటూ ఓదార్చాడు.

కిరీటి నిర్లిప్తంగా నవ్వాడు.

"అంతకంటే చేసేదేముందిరా !" అన్నాడు కిరీటి.

"కిరీటీ ! నవరంగ్‌లో మంచి ఇంగ్లీషు పిక్చరొచ్చింది పోదాం రా !" కిరీటి బాధని మరిపించాలని అడిగాడు.

"ఇప్పుడు సినిమా ఏమిట్రా !"

"ఇప్పుడే చూడాలిగానీ ! పద !" కిరీటిని బలవంతంగా లేవదీసి తీసుకెళ్లాడు సారథి.

* * *

సోమవారం సాయంత్రం అయిదుగంటలకు బయలుదేరారు కిరీటి, సారథి.

కిరీటి మనస్సు ఏదో తెలియని ఆనందంతో



నిండిపోయింది. ఎన్నో రోజుల తర్వాత మీనాక్షిని చూడబోతున్నాడు. తనని చూడగానే మీనాక్షి ఏమంటుంది. ఆత్రంగా తన దగ్గరకు పరిగెట్టుకు వస్తుందా! తను సిగ్గుతో అలాగే నిలబడి పోతుందా! తనసలు మీనాక్షిని ఏమని పలకరించాలి. ఆనందంతో తనకునోరు పెగలదేమో. ఎలాగో తనే ముందు పలకరించాలి. మీనాక్షి వివరాలు అడగాలి. గతాన్ని గుర్తుకు తెచ్చి ఆనాటి తన ఆశలు—కోరికలు చెప్పాలి. మళ్లా ఈ మనస్సుని శ్రుతిచేసి మధుర గీతాలు విన్పించాలి ...

''కిరీటీ, దిగరా !''

ఆటో పచ్చమేడ ముందు ఆగింది.

ఇద్దరూ ఆటో దిగి— డబ్బులిచ్చారు. గేటు తీసుకుని లోపలకు వచ్చారు. మేడమెట్లు ఎక్కుతోంటే కిరీటికి కాళ్లు వణికాయి. నరాలు జివ్వుమన్నాయి. మనస్సు ఉద్వేగంతో నిండి పోయింది.

సారథి దగ్గరగా వేసి వున్న తలుపుల్ని తట్టాడు. తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా యాభై ఏళ్లవ్యక్తి నిలబడి వున్నాడు.

''ఎవరు కావాలండీ !'' ఆయన అడిగాడు.

''రావుగారు వున్నారా ?'' అని ప్రశ్నించాడు సారథి.

''ఆ. నేనే ! లోపలకు రండి.''

ఇద్దరూ లోపలికి వెళ్లి సోఫాలో కూర్చున్నారు. కిరిటి ఆయన వేపే చూస్తున్నాడు. ఆనాడు హాస్పిటల్లో చూసిన వ్యక్తుల్లో—ఈయన లేనట్టున్నాడే ?

''ఏం పనిమీద వచ్చారు?'' ఆయనడిగాడు.

''నా పేరు కిరీటి.''

ఆయన ముఖంలో ఏ భావమూ కన్పడ లేదు. కిరీటికిక సహనం నశించింది.

''మీనాక్షి గారున్నారా ?'' అనడిగాడు సూటిగా.

''మీనాక్షి! '' ఆశ్చర్యంగా చూసి ''ఆ! ఆ! వుంది !'' అన్నాడాయన తడబడుతూ.

కల నిజమైతే!

కిరీటి వుప్పొంగిపోయాడు. అయితే ... మీనాక్షి జీవించే వుందన్నమాట.

''ఒక్కసారి పిలవండి ! '' అన్నాడు.

''అమ్మా ! భారతీ ! ''అని పిలిచాడాయన !

కిరీటి, సారథీ ముఖముఖాలు చూసు కున్నారు.

లోపలి నుండి ఎటువంటి జవాబు రాలేదు. ఇంతలో పదేళ్ల కుర్రాడు లోపలి నుండి వచ్చి —

''నాన్నా ! నువ్వు భారతీ అని పిలిస్తే అక్క పలకదట ! '' అన్నాడు.

ఆయన బిగ్గరగా నవ్వి—

''ఓ ! అదా సంగతి నేను మర్చేపోయాను'' అంటూ ''మీనాక్షీ'' అని పిల్చాడు !

ఆ పిలుపు కిరీటిలో ఆశని రేపింది. ఆరాటంగా గుమ్మం వేపు చూశాడు.

కర్టెన్ వెనక గాజులు గలగలలాడాయి.

''రామ్మా ! మీనా !'' అని పిలిచాడాయన.

కిరీటి కళ్లు నిర్నిమేషాలయ్యాయి ! ఊపిరి బిగపట్టి చూస్తున్నాడు.

కర్టెన్ చాటు నుండి ఆ అమ్మాయి గదిలోకి వచ్చింది. ఆమెని చూసిన కిరీటి వులిక్కిపడ్డాడు.

ఇదేమిటి ? ఈ అమ్మాయా మీనాక్షి ! నల్లగా; సన్నగా వున్న ఈ అమ్మాయి మీనాక్షి ఎలా అవుతుంది ! కిరీటి ఆమెని చూసి నిలువునా నీరయిపోయాడు ! నవనాడులూ క్రుంగి పోయాయి.

''ఒరేయ్ ! అదుగో మీనాక్షి ! చూడు !'' సారథి కిరీటి చెవిలో గుసగుసగా అన్నాడు.

కిరీటి సారథివేపు చూశాడు. సారథి ఆమెనే చూస్తున్నాడు తన్మయత్వంగా.

''కిరీటీ ! నీ మీనాక్షిరా !'' అంటున్నాడు.

''వీడికి మతిగానీ చెడ లేదుగదా'' అనుకున్నాడు కిరీటి. లేకపోతే కళ్లకేవన్నా జబ్బొచ్చి వుండాలి, అనికూడా అన్పించింది.

''రామ్మా మీనా అలా కూర్చో !'' మీనాక్షి తలొంచుకుని తండ్రి ప్రక్కన కూర్చుంది.

''మీనాక్షిగారూ ! మా కిరీటిని గుర్తుపట్ట లేదా ?'' సారథి అడిగాడు.

ఆ ప్రశ్నతో అక్కడ వున్న వాళ్లందరూ వులిక్కిపడ్డారు

కిరీటి చటుక్కున లేచి నిలబడ్డాడు !

''సారథీ ! ఈ అమ్మాయి మీనాక్షేమిటి ! నీకేవన్నా పిచ్చెక్కిందా ?'' అన్నాడు.

''అదేమిట్రా. . నువ్వు మీనాక్షినే మర్చి పోయావా ?'' సారథి ఎదురు ప్రశ్న వేశాడు.

కిరీటి సహనం కోల్పోయాడు !

''సారథీ... ఇంకొక్క మాట మాట్లాడా వంటే ప్రాణం తీస్తా్రా రాస్కెల్ !''

''కిరీటీ నువ్వు నన్ను తిట్టినా బాధలేదు. ఈ అమ్మాయి మీనాక్షీరా ! సరిగ్గా చూడు ! ఆ కళ్లు మీనాక్షివి కావా ! అంత అందమైన కళ్లు మీనాక్షికి తప్ప ఎవరికున్నాయి ?'' అంటూ కిరీటి చేతిని పట్టుకున్నాడు.

''నో ! కాదు . . నే పోతున్నా !''

కానీ సారథి అతడి చేతిని వదలలేదు.

అంతవరకూ వాళ్లిద్దరి పోట్లాట గమనిస్తున్న రావుగారికి పరిస్థితి కొద్దిగా అర్థమైంది.

''చూడు మిష్టర్ ! మీరు కొంచెంసేపు కూర్చుంటే మీకొక విషయం చెప్తాను,'' అన్నాడాయన.

కిరీటి కూర్చున్నాడు

''ఏమిటో త్వరగా చెప్పండి !'' అక్కడిక కూర్చోడం చాలా దుర్భరంగా వుందతనికి.

''స్థిమితంగా కూర్చోండి !'' అని — ''అమ్మా ! మీనా, నువ్వు లోపలికి వెళ్లి రెండు కప్పుల కాఫీ తీసుకురా !'' అన్నాడు కూతురితో.


ఆ అమ్మాయి అయిదు నిముషాల్లో వచ్చింది. ఈలోపు రావుగారు ఇద్దరి వివరాలు సేకరించాడు.

కాఫీ త్రాగాక —

''చూడవోయ్ ! కిరీటీ ! ఒక విధంగా నీ మీనాక్షి బ్రతికి వున్నట్లే ! ఎలాగంటావా ? మా అమ్మాయి భారతి ఇప్పుడీ, ప్రపంచాన్ని చూస్తోంది మీనాక్షి కళ్లతోనే !''

సారథి — కిరీటి ఆశ్చర్యపోయారు.

''మీనాక్షి తండ్రి—నేను బాల్యస్నేహితులం. వాళ్లమ్మాయి చనిపోయే ముందు తన కళ్లను మా అమ్మాయికి దానం చెయ్యమని కోరిందిట. మా అమ్మాయి భారతికి చిన్నప్పుడు యాక్సిడెంట్లో కళ్లు పోయాయి. మీనాక్షి చనిపోయాక ఆ కళ్లను తీసి మా అమ్మాయికి అమర్చారు. వయసులో చిన్నదైనా మీనాక్షి మనస్సు చాలా గొప్పదోయ్. మీనాక్షి దయవల్లే మా భారతి జీవితంలోకి వెలుగొచ్చింది. ఆ అమ్మాయి మీది అభిమానంతో మా భారతి పేరు కూడా



మార్చుకుని మీనాక్షి అని పెట్టుకుంది. అదండీ జరిగింది !'' అంటూ ముగించాడాయన.

సారధీ, కిరీటి విస్తుపోయారు ! ఎంతో సేపటి వరకూ తేరుకోలేకపోయారు. కొంత సేపయ్యాక సారధి కిరీటి భుజంపై చేయ్యి వేసి—

''కిరీటీ ! నువ్వు మీనాక్షిని నాకు పరిచయం చేసినప్పుడు ఆ అమ్మాయి కళ్ళు నన్ను విపరీతంగా ఆకర్షించాయి. విశాలమైన ఆ నేత్రాల్లో కాంతి— ఎంతో అందం కన్పించాయి నాకు. సృష్టిలోని సౌందర్యమంతా ఆ కళ్ళల్లోనే వున్నట్లన్పించింది. ఆ కళ్ళే నా మనసులో నిలిచిపోయాయి. అవే నాకు గుర్తుకు వస్తుండేవి ! ఎన్ని వేల కళ్ళల్లోనైనా వాటిని గుర్తుపట్టగలను. మొదట వీరి అమ్మాయిని చూడగానే నాకు ఆ కళ్ళే కనబడ్డాయి. అవి మీనాక్షి కళ్ళు ! అందుకే మీనాక్షి జీవించి వుందని నీతో చెప్పారా!'' అన్నాడు సారధి.

కిరీటి కేమనాలో తోచలేదు తను మీనాక్షిని మర్చిపోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో సారధి మీనాక్షి జీవించి వుందని చెప్పి మళ్ళా తనలో ఆశని రేపాడు. ఆ ఆనందంలో—భవిష్యత్తు పైని ఆశలతో— ఇన్నాళ్ళా జీవించాడు. ఇప్పుడు మళ్ళా పెద్ద ఎదురుదెబ్బ తను దీనికి తట్టుకోలేకుండా వున్నాడు. తన గుండె బ్రద్దలై పోతోంది ! ఇంకెలా బ్రతకాలి తను. నిప్పుల కొలమిలో కూర్చున్నట్లుంది !

చటుక్కున లేచి బయటికి వెళ్ళిపోయాడు కిరీటి. వెడుతున్న కిరీటిని చూసి చిన్నగా నిట్టూర్చాడు సారధి.

* * *

మర్నాడు సారధి ఇంటికొచ్చేసరికి రాత్రి ఎనిమిదయింది. కిరీటి ఆరోజు శెలవుపెట్టాడు. ప్రొద్దుటి నుండీ తిండీ తిప్పలు మానేసి మంచం మీద పడుకునే వున్నాడు.

''కిరీటీ ! అలా వున్నావేరా ?'' సారధి అతని ప్రక్కన కూర్చుంటూ అడిగాడు.

''ఏం లేదురా !'' అన్నాడు కిరీటి శూన్యంలోకి చూస్తూ.

కిరీటీ ! ఇటువంటి సమయంలోనే ధైర్యం తెచ్చుకోవాలి ! బాధపడకురా !'' అన్నాడు సారధి.

కిరీటి మాట్లాడలేదు.

కొద్దిక్షణాలు గడిచాక సారధి అన్నాడు.

''కిరీటీ ! నీకో విషయం చెప్పాలనుకుంటున్నారా ?''

''ఏమిటది ?''

''నేను, మీనాక్షిని, ఐమీన్—అదే...భారతిని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను !'' అన్నాడు సారధి మెల్లగా.

కిరీటి చివ్వున లేచి కూర్చున్నాడు!

''ఏవిటీ ! నువ్వు . ఆ నల్లపిల్లని చేసుకుంటావా ?'' ఆశ్చర్యంగా అడిగాడు.

సారధి నవ్వాడు.


''కిరీటి ! నీకో విషయం చెప్పనా? నువ్వు మీనాక్షి అందమైన రూపాన్ని ప్రేమించావు. కానీ నేను మీనాక్షి కళ్లను ఆరాధించాను. ఆరునెలల క్రితం నువ్వు అర్ధరాత్రి నా దగ్గరకొచ్చి మీనాక్షి చనిపోయిందని చెప్పగానే నేను షాక్ తిన్నట్లయ్యాను ! ఆ అందమైన కళ్లను నేనిక చూడలేనా, అనుకుంటూ మనసులో ఎంతో బాధపడ్డాను. లోలోపల ఎంత కుమిలిపోయానో ఆ దేవుడికే తెలియాలి. ప్రతిక్షణం మీనాక్షి కళ్ళే మనసులో మెదుల్తుండేవి. పైకి నవ్వుతున్నా నా మనసులో అగ్నిజ్వాలలు రేగుతుండేవి. మళ్ళా ఆ కళ్ళు — నా కళ్లబడే వరకూ నాకు మనశ్శాంతి లభించలేదురా !''

సారధి క్షణం ఆగాడు.

కిరీటి కొత్త విషయాలు వింటున్నట్లు ఆశ్చర్యంగా వినసాగాడు.

''కిరీటీ ! నాకు భారతి అందంతో పని లేదురా ! ఆ ముఖంలో వున్న మీనాక్షి కళ్ళు చాలురా ! ఆ కళ్లల్లోని అందాన్ని తనివితీరా చూస్తూ వుండిపోతే నా జన్మ సార్థకమౌతుంది. కిరీటీ నాకా అదృష్టం చాలురా !'' తన్మయత్వంగా చెప్తున్నాడు సారధి ! కిరీటి సారధివేపు తెల్లబోయిచూస్తూ వుండిపోయాడు.

[అయిపోయింది]







ఆఫీసులో కూర్చుని పనిచూసుకుంటున్నానన్న మాటేకాని నా చెవుల్లో ఇంకా ఆ నీరాంగాలే గింగురుమంటున్నై. ఆ తప్పెట మోతలకి నా గుండెలు ఇంకా అలిసిపోతున్నై. ఓహో ఏం బాకాలు, ఏం కాహళాల శబ్దం! బాకాలూదే వాళ్ల బుగ్గలు చిరుగుతయ్యేమో అనిపించేది. శంఖారావాలతో చెవులు పనిచెయ్యటం లేదు· కంచు తప్పెట తాళాలు కొట్టేవాళ్ల చేతుల్లో వున్నది రక్తమాంసాలా? ఇనుమా? ఏమో! మార్దంగికులు వాయించినవి తోలుతో చేసిన మద్దెళ్లేనా? ఏమిడవ్వాలు. ఎన్ని ఎండలుండి వుంటై? అవజగాళ్ళు ఏ అడవుల్లోంచి వొచ్చి వుంటారో? ఈ కరడలు వాయించటం వీళ్లకి ఎవరు నేర్పివుంటారు? భూతప్రేత పిశాచాలా లేక బ్రహ్మరాక్షసులా? మానసికంగా అయినా, ఈ భయానక అద్భుతరసం భరించలేక పోతున్నాను. అదే మబ్బు కమ్ముతున్నది. ముంచేస్తున్నది. చుట్టేస్తున్నది. ఏమిటో అంతా అయోమయంగా వుంది. ఈ వాద్య గాళ్లంతా బక్కచిక్కి పూటకూడా కడుపునిండని భుక్తితో జీవయాత్ర సాగిస్తున్నవాళ్లే. మరి ఆ శక్తి ఎక్కడిదో? ఏమిటో! వాళ్ళు తాగిన మాట నిజమే. కాని ఓ నాలుగుముంతల గుడుం బాకు ఎంత శక్తి! ఆశ్చర్యం. దాన్నే కార్లో పెట్రోలు బదులుపోస్తే ఇంతశక్తి వొస్తుందేమో!

అబ్బ ఆ దృశ్యాలు తల్చుకుంటే వొళ్లు జలదరిస్తున్నది. అసలదంతా కలా నిజమా? తెలియటంలేదు. రాణా వారమైనా ఇంకా రాలేదు అడుగుదామంటె. నా కళ్ల ఎదుట ఆ గడిచిన రోజులు, జరిగిన సంఘటనలు కదుల్తున్నై. స్మృతి పథంలో మళ్ళీ సుళ్ళు తిరుగుతున్నై. ఆ రోజున...

"సాబ్. మిమ్మల్ని బాస్ రమ్మంటున్నారు"

"లోపల ఎవరున్నారు?"

"రాణాసాబ్, బాస్ అంతే."

"పద వస్తున్నా".

"మే ఐ కమిన్ సార్?"

"కమిన్ ప్లీజ్".

"గుడ్ మార్నింగ్ సార్".

"వెరీ గుడ్ మార్నింగ్ యంగ్‌మాన్. కూర్చో సారథీ నీకు, రాణాకి ఒక స్పెషల్ పని తగిలింది."

రాణాని గురించి ఇక్కడ కొంచెం చెప్పాలి. రాణా నేను చిన్ననాటి స్నేహితులం. ఒకే వూరు. ఒకే స్కూలు. ఇరుగుపొరుగు. రాణా నాకంటే రెండేళ్ళు పెద్ద. ధైర్యస్తుడు. సాహసి. దుడుకు పిండం. దీంతో నాకో పెద్ద హీరో ఐనాడు. నేను లక్ష్మణస్వామినై అతన్ని అనుసరించే వాణ్ణి. వాడు పోలీస్ శాఖలో చేరడం నాకూ అందులోనే చేరాలనే ఆసక్తి కలిగించింది. చివరికంతే చేశాను కూడా. ఇద్దరం ఒకటిగా పనిచేసేవాళ్ళం. ఒకరి కొకళ్ళం అండదండగా నిలిచాం. మా టీమ్ వర్క్‌కి మంచిపేరొచ్చింది. ఇద్దరికి పని పడ్డదంటే మా ఇద్దరినే ఆ పనికి పంపేవాళ్ళు. వాడి దుడుకుతనానికి నా సౌమ్యత వేడినీళ్లకి చన్నీళ్లుగా పనిచేసేది. నాకు మాట్లాడటం రాదు. రాణాయే మా టీమ్ వక్త.

"చెప్పండి సార్".

"మీ రిద్దరూ చిన్నవాళ్లు. ఇట్లాంటి పనిలో అనుభవం లేనివాళ్లు. ఏం చేస్తారో అని అనుమానంగా వుంది."

"మరేం ఫరవాలేదు సార్. చెప్పండి. మేమిద్దరం అగ్ని–వాన అని తెలుసుకదా సార్."

"తెలుసయ్యా. కాని దీంట్లో వేరే శక్తులు కొన్ని కలిసి విజృంభిస్తయ్ రాణా. మీవల్ల అవుతుందో లేదో."


"మా వెంట సిబ్బందిని పంపండి. వీళ్ల మనకలవాటు పడ్డవాళ్లే కదా. పని చురుగ్గా చేస్తాం" రాణా మళ్లీ అన్నాడు.

"అదే వీలు కాదు. మీ ఇద్దరితో ఇంకో వెరి ఇద్దరిని పంపగలనే కాని అంతకన్న పంపలేను. రూల్సు లేవు స్థానిక సిబ్బందినే వుపయోగించుకోవాలి."

"వాళ్లకి సహకరించమని ఉత్తరువులు పంపండి" అన్నాను నేను.

నరమేధం......అరుణ







''అర్థరివ్వగానే సరిపోదు సారధీ. ఇది వాళ్ల స్థానిక సమస్య. వాళ్ల నమ్మకాలు, స్థానిక రాజకీయాలు, వాళ్ల లీడర్ల వవర్లు ఇందులో ఎక్కువ.''

''పోనివ్వండి సార్ పనేమిటో చెప్పండి'' రాణా అందుకున్నాడు.

''అదే చెప్తా విను రాణా. తొందరపడకు'' అంటుండగానే మా డిప్యూటీ బాస్ లోపలికొచ్చాడు విష్ చేస్తూ.

''రా మహేంద్రా కూర్చో...''

''మీరేదో తీవ్రంగా ఆలోచిస్తున్నారు. మళ్లొస్తసార్.''

''ఫరవాలేదయ్యా కూర్చో, ఏమీ లేదు. ఈ ఏటి ములుగుజాతరకి వీళ్లని పంపాలను కుంటున్నా.''

''అట్లనా, మంచిదే కాని పోరళ్లు.''

''అదే నా ఆలోచన.''

''నన్ను పంపరాదా సార్. ఎప్పుడు నేనేగా పోత ?''

''ఔను సార్ మహేంద్రని పంపండి. పాపం మనసు పడుతున్నాడు.''

''నువ్వూరుకో రాణా. నీకింకా పెద్దపనివ్వా లనుకున్నా మహేంద్రా,''

''సార్ దయ. వస్తా'' అని బైటికి వెళ్లాడు, రాణాని కోరచూపు చూస్తూ.

''ఏమిటిసార్ అంత జోకొడుతున్నారు మహేంద్రని ?'' అన్నాడు రాణా.

''రాణా, నీకు తొందరెక్కువయ్యా. నీకు మహేంద్రకసలు పడదు. ఇంకా ఎందుకు రెచ్చ కొడతావ్ ? నా తరవాత వాడు. రేపు నీవతని కిందే పని చెయ్యాలి మర్చిపోకు.''

''ఆ క్రూక్ కింద పనా ? మొన్న నాకు ప్రమోషనొచ్చి పిస్టల్ తీసుకున్నందుకు ఎంత ఏడ్చాడు ? నేచావనైనా చస్తాగాని వాడి కింద పని చెయ్యను సార్.''

''అదే జరుగుతుందేమో చూడు'' అంటూ పని వివరాలు చెప్పాడు. అత్యవసర పరిస్థితుల్లో తను ఆదుకుంటానన్నాడు.

ఆ సాయంత్రమే బయల్దేరాం, రాణా నేను చెరి ఇద్దరు కానిస్టేబుల్స్‌తో. మేం పోవలిసిన వూరు కాజీపేటకి డెభ్భై మైళ్ళు. జాతరకి ఇంకా మూడు రోజుల వ్యవధి వుంది. ఆ రాత్రికే కాజీపేట హెడ్డాఫీసుకి చేరుకున్నాం. మా కాయితాలు చూపించాం. కాయితాలు చూసిన బాస్ ప్రభాకరం ముఖం ఎందుకో నల్లపడ్డది.

''మహేంద్రసాబ్ రాలేదా ఈసారి మీరొచ్చారు ? ఆయన కాంప్‌లో వున్నాడా ?''

''లేదండి. వేరేపనిమీద వుండిపోయినాడు మమ్మల్ని పంపారు'' అన్నాడు రాణా.

''చిన్నపిల్లలు మీకేం చాతనవుతుందీ బలగాన్నాపటం ?''

ఆయన యాభై ఏళ్ళు పైబడ్డ అనుభవజ్ఞుడు. మాకు ముప్పైకూడా నిండలేదు. ఐనా అంత చేతకాని వాళ్లమా మేము? ఏంచూసి అన్నాడనుకోవాలి ?''

''అన్నీ ఆలోచించే పంపారండి'' నేనన్నాను.

''నిజమే. కాని ముప్పైవేలమంది పైగా గుంపు చేరతారు. ఎన్నిరకాల ముఠాలో

నరమేధం

వుంటారు. మీరిద్దరు వాళ్లిద్దరిద్దరితో దీన్ని అదుపుచేయగలరా?''

''మనుషులను తెచ్చుకోవటానికి వీల్లేక పోయింది. అందుకే స్థానిక సిబ్బందిని అడగటం'' రాణా గట్టిగానే అన్నాడు వాదనకి దిగుతూ.

''మీకు అర్థంకావడల్లేదు. స్థానిక సిబ్బంది ఇటువంటివాటిల్లో జోక్యం చేసుకోదు. చేసుకున్నా అంటీముట్టనట్టే. పేరుకుమాత్రమే.''

''ప్రతి సంవత్సరం ఇంతేనా ? మరి ఇన్నేళ్లు ఎట్లా గడిచింది ?''

''అందుకే మీరు చిన్నవాళ్లంటున్నాం ఇక్కడి పరిస్థితి ఇంతే. కాని మీవాళ్లు ఏంచేసే వాళ్లంటే...''

''చెప్పండి. వెనకాడుతున్నారేం ?'' అన్నాడు రాణా.

''అదే మీ మహేంద్రలాంటి వాళ్లొస్తే, అక్కడి మోతుబర్లదగ్గర, వ్యాపారస్తుల దగ్గర పోగుచేసి కులపెద్దలకి, వూరిలో ముఠాదార్లకి, స్థానిక సిబ్బందికి ముట్టచెప్పి ఏ అలజడికాకుండా సర్దుబాటు చేస్తారు.''

''అప్పుడు స్థానిక సిబ్బంది రంగంలోకి దూకుతుందా ?''

''లక్షణంగా, తలా కొంచెం తడిచేస్తే సరి.''

''ఆహాఁ. అట్లాగా. అయితే మహేంద్ర గారికి, మీకు ఏటా ఎంత ముదుతుందో ?'' –

''ఎంత లేదన్నా చెరి పాతిక, ముప్పై మిగుల్తుంది.''

''ఆయనొస్తే బాగుండేది ఐతే.''

''అందుకేగా రాగానే అడిగింది. మీకనుభవం లేదు. ఇంత సమర్థించుకు రాగలరో లేదో అని.''

''మీరు పెద్దలున్నారుగా మాకు సాయం చెయ్యటానికి.''

''ఉన్నాకాని తెరవెనకనే వుంటా. ముందు కాదు. నేను స్థానిక సిబ్బంది నిచ్చినా వాళ్లకి మామూళ్ళు ముట్టందే లాభంలేదు.''

''ఇది మరీ అన్యాయం. మనం జీతాలు తీసుకోవటంలేదూ ?''

''జీతాలు వేరే, ఇది వేరే, దేనికదే.''

''మీరుకూడా అట్లా అంటే ఎట్లాగా ?''

''నేననేదేమిటి ? అందరూ ఒకటే ! అందుకే మీరు చిన్నవాళ్ళు, కొత్తవాళ్ళు అనేది.''

''అంతేనంటారు. ఒక లకారమైనా కళ్ల చూడందే ఈ జాతర సవ్యంగా ముగవదంటారు!''

''ఆహాఁ అంతేమరి.''

''సరే చూస్తాం మా శాయశక్తులా.''

''మీకు అలవికాదనుకుంటా ?''

''అప్పుడు మీ దగ్గరికే వస్తా !''

''సమయం మించిపోయిన తరవాత నేను చెయ్యకలిగేది మాత్రమేముంటుంది ?''

"మనిషిగా చెయ్యాలనుకునేది ఏమీ లేక పోయినా, ఆఫీసర్‌గా చెయ్యవలసింది కొంత వుంటుందిగా "

"అది చాలా స్వల్పం పని గడవదు పరిస్థితి విషమించకముందే చూడండి లేకపోతె అపాయం తప్పదు "

"మీరిక్కడ ఎన్నేళ్ళుగా వుంటున్నారు ?"

"దాదాపు ఎనిమిది సంవత్సరాలయింది "

"మరి మీ పలుకుబడితో పని జరగదా ?"

"ఆ పలుకుబడి విలువే నేనిందాకచెప్పింది "

"నిజమే మరి మాకే లేంది మీకెక్కణ్ణించి తెస్తాం ?"

"దేనికైనా మొదలంటూ వుంటుందికదా ఇప్పుడు మొదలుపెట్టండి కడుపులో చల్ల కదలకుండా క్షేమంగా వచ్చి లాభాన వెళ్తారు "

"అట్లా అయితే నేనసలు వెళ్ళనే వెళ్ళను అయినా మీరు బాగా ఆలోచించే చెప్తున్నారా ?"

"ఆఁ నే బాగానే ఆలోచించా మీరే ఆలోచించాలి ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు, మీరు తిరిగి వెళ్ళి సుపేంద్రాని పంపించండి "

"సరే నేనూ ఆలోచిస్తా గూడానికి పోవటానికి మాకు జీపుని, మనుషులని ఇప్పండి "

"సరే ఇస్తాను కాని మూడొంతుల మంది అక్కడే వున్నారు మొత్తం నూటయాభై మంది వుంటారు సమయానికింకో వందమందిని పంపుతాను మల్లయ్యా" అంటూ పిలిచాడు

"అయ్యా!" అంటూ ఒకతను లోపల కొచ్చాడు

"యాదగిరిని పిలు "

"లేదు దొరా ములుగెళ్ళిండు "

"చంద్రయ్య ?"

"ఆయనంతె దొరా "

"అయితే జంగయ్యన్ని పిలువు "

"మంచిది దొరా "

జంగయ్య సలాం అందుకుంటూనే ప్రబాకరం "చూడు జంగయ్య! వీళ్ళు పట్నం నించి వచ్చారు జతర పనిమీద వీళ్ళని ములుగు తీసికెళ్ళు అన్నీ చూపించి వివరంగా చెప్పు "

మేం ప్రభాకర్‌కి థాంక్స్ చెప్పి బైటి కొచ్చాం రాణా ముఖం చూస్తేనే తెలుస్తున్నది వాడి ఆలోచనలెట్లా వున్నది! — ఇద్దరిలో కోపం, విసుగు, అసహ్యం, అవమానం అన్నీ సుళ్ళు తిరుగుతున్నై ఒకటే ఆలోచనలు బుర్రనిండా ఒకటే ప్రశ్న ఏంచెయ్యాలి ? ఏంచెయ్యాలి ? ఏంచెయ్యాలి ?

జీపులో బయల్దేరాం రాణా, నేను, డ్రైవరు, ముందు కూర్చున్నాం జంగయ్య, మా వాళ్ళు వెనక వున్నారు ఎవరూ మాటల కుపక్రమించటంలేదు ఎవరి ఆలోచనలు వాళ్ళవి

గుట్టలు, పొలాలు, చెరువులు, కాలవలు, రైలుగేట్లు, పశువుల మందలు వస్తున్నై పోతున్నై ఇన్నిజీవులున్నా జీపులో మాటల్లేవు అంతా నిశ్శబ్దం దీన్ని భంగపరుస్తూ "ఫార్ ఉష్ ష్ ష్ అంటూ వినపడ్డది ఏమిటో అనుకునే లోపలే జీపు ఆగింది

ముందరి ఎడంటైర్ పగిలిపోయింది

"డ్రైవర్ ఏమయింది ? " అన్నాను

"టైర్ బర్స్టు అయింది సాబ్ "

"స్పేర్ వీలుందా ? "

'వుందిసాబ్ అరగంటలో వేసేస్తా "

అందరం దిగాం మా వాళ్ళని సాయం వుంచి, జంగయ్యని తీసుకుని పొలంగట్టు మీద కూర్చున్నాం

జంగయ్య మొదలుపెట్టాడు "దొరలూ మీరిద్దరూ చిన్నవాళ్ళు ఈ జాతర కెందు కొచ్చారయ్యా" అంటూ

"ఏం నీకూ డా డబ్బు రాదని దిగులా ?"

'శివ శివ ఎంతమాటయ్యా, నాకు యాభై దాటినై అయ్యా ఈ ప్రభాకరంతోనే నేనూ చేరాను— ఆయన పది చదివితే నే ఇంటర్ చదివా కాని చూస్తున్నారుగా ఆయన ఆ సింహాసనమెక్కాడు నేను ఈ క్రిందనే మిగిలి పోయాను "

"ఎందుకు జంగయ్యా!"

"ఎందుకంటే ఏంచెప్పను బాబూ మీ మాటలన్నీ ఇందాక గుమ్మంలోంచి విన్నాను మీ మాటలు నా ఆలోచనకి అద్దాలు బాబూ నేను, తినకుండా, ఇంకొకరిని తిననియ్యక, అబద్ధాలాడకుండా, దొంగ కేసులు మోపక, దౌర్జన్యంగా ప్రవర్తించలేక, న్యాయంగా పోయే నాకు ఇంతకన్నా ఏమిటొస్తుంది ? అందరూ నన్ను పుల్లలో పురుగుని తోసేసినట్టు పక్కకి నెడతారు నెట్టేశారు నెట్టేస్తున్నారు "


"మరి ఇన్నాళ్ళు ఇక్కడే ఎందుకున్నావ్ ?"

"ఏంచెయ్యను ? నేనేమి చెయ్యలేనివాడనని తెలుసుకోవటానికి కొంతకాలం పట్టింది నన్ను భరించలేనివాళ్ళు నన్ను అసమర్థుడినని ప్రచారం చేశారు అదే రికార్డుల్లోకి ఎక్కించారు బైట అవకాశాలు దొరకలేదు ప్రభాకరంతో మీ మాటలు విన్నాక ఇంకా నీతి చావలేదనిపించింది మీరైనా మేల్కొండి బాబూ, బైటైన పడండి లేదా తలైనా ఎంచండి వృద్ధిలోకి రావాల్సిన వాళ్ళు "

జంగయ్య కంఠం వొణికింది కళ్ళు తడితో మెరిసినై, మనసులోని ఆవేదన నిట్టూర్పొదిలింది ముఖం జేవురించింది ఒక ఆక్రందన అది కాని చేత కాని వాడిది

రాణా జంగయ్య భుజం మీద చెయ్యేసి "చూడు జంగయ్యా న్యాయంగా పొయ్యేవాడికి కెప్పుడూ అడ్డంకులే, కష్టాలే, బాధలే, తప్పవు మనలాంటి వాళ్ళు కొంతమంది అసమర్థులన బడే వాళ్ళు పుట్టక మానరు బతికి తీరాల సముద్రంలో చినుకు పడి ప్రయోజనం లేదని తెలిసి వాన కురవకుండా వుంటుందా? పొలం

ఇటీవల ఆంధ్రప్రదేశ్ సినీఆర్టిస్ట్స్ అసోసియేషన్ (హైదరాబాదు) వారు చలనచిత్ర దర్శకుడు శ్రీ బి భాస్కరరావుతో ఇష్టాగోష్ఠి జరిపిన సందర్భంగా స్వాగతం చెబుతున్న సంస్థ కార్యదర్శి శ్రీ పి. శివకుమార్, నూతన కార్యవర్గ సభ్యులని చిత్రంలో చూడవచ్చు



మీదే మేఘం వర్షిస్తుందా చెప్పు? అంతే మనం కూడా''మనది ఉడుతాభక్తి ఐతేకాని,సముద్రంలో నీటి బొట్టు. కాని తప్పదు. మనం మారలేం గదా. నువ్వు మాకు తోడుగా వుండు అంతే చాలు''.

'అంతకన్నా నా బాబయ్యా''

మళ్లీ జీపెక్కాం. ఆగకుండా అడంగు చేరాం. వూళ్లో పెద్దలని, సర్పంచి, పటేల్‌ని, పంచాయితీ మెంబర్ల నందర్ని కలుసుకున్నాం. అందరూ బేరానికి దిగినవాళ్లే. అదేమిటంటే మీ వూళ్లో మీ మాట చెల్లుద్ది ఇక్కడేంటయ్య అన్నట్టు చూశారు. మోతుబర్లని కలిస్తే ''మాకు రక్షణ కల్పించటానికి పైసలిస్తంగాని మేమేం చెయ్యలేం'' అన్నారు. ఏం చెయ్యాలో తోచలేదు.

ఇంక జాతర సంగతి ఆరాతీస్తే తేలింది– మూడు నాలుగు ముఠాలున్నై అని. ఎవరిది పై చెయ్యైతే వాళ్లది గొప్పఅని. ఆ ప్రయత్నంలో సామ, దాన, భేద, దండోపాయాలన్నిటికీ తా వుంది. తలలు లేస్తై. కొంపలంటుకుంటై. పొలాలు నేలకలుస్తై కుప్పలు బూడిదైతై. అందులోనూ గాలి వాన కారణంగా కిందటి సంవత్సరం జాతర చెయ్యలేదు. ఈసార్ధి ఆ కారణంగా రెట్టింపు సన్నాహం జరుగుతున్నది

అమ్మ వారిఘటం ఏం బజార్నించి నడవాలి. ఎవరు ముందు వారు పొయ్యాలి దగ్గర్నించి ఎవరి పోట ముందు నరకటం వరకూ పోటీయే. ఎవరి జట్టులో వారు కర్రసాము బాగా చేస్తారు? బళ్ల పందెంలో ఎవరెడ్లది గెలుపు? ఎవరి జట్టు కబాడి బాగా ఆడుతుంది? భజనలో ఎవరిబృందం ఎవర్ని ఓడిస్తుంది? నాటకాలు రక్తికడుతుంటే రాళ్లు కొట్టేందుకు ఏర్పాట్లు, కోడి పందాల్లో ఏ కోడికి మందు పెట్టారు ? దేని ముక్కుకి, దేని కాళ్లకి విషం పూశారు ? వెంకటేశు గెలుస్తాడా? ఓడితే రత్తయ్య బతకనిస్తాడా ? వీటి మీదే శ్రద్ధ

నరమేధం

వీళ్ల మాటలు వింటుంటే వొళ్లు కంపరం పుడుతున్నది. ఇంత స్పర్థ ఎందుకు ? ఇన్ని కుట్రలెందుకు ? ఎవరి మేక ముందు తెగితే వారిగేదేమిటి? కర్ర తిప్పటం చూసి ఆనందిస్తే చాలదా ? భజన వింటే చాలదా ? నాటకం చూసి సంతోషించరాదూ? ఎందుకొచ్చిన ఈర్ష్య అసూయాలో అర్థం కావటం లేదు.

మర్నాటికి రద్దీ ఎక్కువయింది పది ఎకరాల జాగా నిండిపోతున్నది. గారడీ వాళ్లు, దొమ్మరాటలవాళ్లు, లాటరీ వాళ్లు, గ్రామ్‌ఫోన్ రికార్డు వాళ్లు, ఇత్తడి, సత్తుగాజు సామాన్ల వాళ్లు, బట్టల వాళ్లు, తిండి పదార్థాలవాళ్లు, నాటకాల వాళ్లు ఆడేవాళ్లు, పాడేవాళ్లు, భజన బృందాలు, వాద్యగాళ్లు, కర్రలు త్రిప్పేవాళ్లు, కత్తిసామువాళ్లు, చెంచులు,గోండులు,లంబాడీలు అందరూ దిగుతున్నారు. పెద్ద చిన్నా గుడారాలు లేస్తున్నై. ఆకుగూళ్లు నిలబెడుతున్నారు. పందిళ్లు, పాకలు, కాఫీ దుకాణాలు, టీ కొట్లు, ఫలహార అంగళ్లు ఒకటన్న మాటేమిటి. కల్లు గుడుంబా సీసాలు దొర్లుతున్నై. చూస్తూ వుండగానే పది ఎకరాల నేల నిండిపోయింది.


ఇంతలో దోపిడి దొంగల ముఠా ఒకటి, నక్సలైట్ల గుంపొకటి వచ్చి చేరిందన్న వార్త వ్యాపించి కొత్త అలజడిని రేపింది. ఇదే అదనుగా తీసుకుని స్థానిక సిబ్బంది వెనకడుగు వేస్తున్నది. ఏ క్షణాన్నైనా వాళ్లు డబ్బుకి లొంగిపోవటానికి సిద్ధంగా వున్నారు. న్యాయానికి కట్టుబడి మాకు అండగా నిలిచిన కొద్ది మందితో ఈ జన సమూహాన్ని అదుపులో వుంచడం అసాధ్య మనిపించింది. మాకింకా కొత్త సిబ్బంది కావాలి, వేరే ఆయుధాలు కావాలి, సవర్లు కావాలి.


ఈ దుష్ప్రచారానికి తోడు ఆ రోజు రాత్రి పూజారి ఇంట్లో సేవలందుకుంటున్న అమ్మవారి ఘటం మాయమయిందన్న వార్త దావానలంగా వ్యాపించింది. గూడెం రణరంగ మయింది. తెల్లగా తళతళలాడే కత్తులు ఎర్ర బారినై. కర్రలు గాలిలోకి తేలి బరువుగా కిందకి వాలినై. నెత్తురు చిమ్మినై. ఏం చెయ్యాలో అంతుపట్టలేదు. పిచ్చెక్కినట్టయింది నాకు. రాణా దీర్ఘాలోచనలో పడ్డాడు. దిక్కు తోచలేదు. గత్యంతరంలేక రాణా, నేను ప్రభాకరం దగ్గరికి వెళ్లాం. మొదట సుముఖంగా మాట్లాడాడు. కాని మా వుత్త చేతులుచూసి మొండి చేతులు చూపించాడు. చేతులు ముడుచుక్కూర్చున్నాడు. ఇంకా అక్కడే కూర్చుంటే తిట్టేట్టున్నాడు. మరి తిట్టడా. ఈసారి దొరికే ముప్పై, నలభై వేలతో కూతురి పెళ్లి చేద్దామనుకున్నాడు.

ఆఖరు ప్రయత్నంగా రాణా హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్లాడు, బాస్‌ని మరికొంత సహాయం అడగ టానికి.

రాణా అవమానంతో మండిపడుతూ తిరిగి వచ్చాడు. ముఖం జేవురించి వుంది. పలకరించే ధైర్యం నాక్కూడా లేకపోయింది. నన్ను తన వెంట రావద్దని ఒక్కడే ఎక్కడెక్కడో తిరిగి జాతర రోజున రెండు గంటలకి వచ్చాడు. నన్ను దగ్గరికి రానివ్వలేదు. మాట్లాడనివ్వలేదు. నెట్టుకుంటూ వెళ్లిపోయినాడు.

జాతర మొదలయింది. పూజారి భద్రయ్య ఘటాన్ని నెత్తిన పెట్టుకుని బజార్లో నార్లు పోయించుకుంటూ, ధూపాలు వేయించుకుంటూ నడుస్తున్నాడు. చీకటిని నమిలిమింగేటట్టు కాగడాల వెలుగు. సాంబ్రాణి వాసన ముక్కు పుటాలలో దూరుతున్నది. వారు పోసే నీళ్లతో నేలంతా బురద, బురద. ఎక్కడ చూడు పూల జల్లు. పసుపు కుంకాలు తెరలు తెరలుగా గాలిలో లేస్తున్నై, హోలీ పండగని మరిపించినై. గణాచార్ల వీరాంగాలు తారస్థాయికి చేరు కుంటున్నై, వీటికి సైదోడుగా పూనిన భక్తులు ఉగ్రాలు పెరిగి ఊగిపోతున్నారు. వారికి భక్తుల సైత్యోపచారాలు దీపవు





గరగలు నక్షత్రాల్లా మెరుస్తున్నై. వేప కొమ్మల వీవనలు కొల్లలుగా ఆడుతున్నై. ఇంక చుట్టూ డప్పులు, మద్దెళ్ళు, రండోళ్ళు, భేరీలు పగిలిపోతున్నై. బాకాలూదే వాళ్ళు, శంఖాలొత్తే వాళ్ళు తమ ప్రాణాలను పణంగా పూరిస్తున్నారు. తప్పెట్లు పగిలేటట్టున్నై. కొమ్ములు, బూరాలు, కాహళాల జోరు పెరిగిపోతున్నది.


భక్తుల వెర్రి కేకలు, పొర్లు దండాలు, శివమెత్తి ఆడేవాళ్ళు, ఒకళ్లేమిటి, అందరికి మతిస్థిరం తప్పుతున్నట్లు వూగిపోతున్నారు. కత్తి సాములు, కర్రసాములు సాగుతున్నై, కాగడాలు పట్టుకుని చిందులేస్తున్నారు ఏ లంకా దహనానికో పోతున్నట్టు. నాటకాలు, పాటలు, దొమ్మరాటలు, తోలుబొమ్మలాటలు యధావిధిగా జరుగుతున్నై. ఇవన్నీ చాలనట్లు ఏవో మంత్రాలు చదువుతూ క్రూరంగా చూస్తు, బల్లాలు త్రిశూలాలు తిప్పుతున్న సన్యాసులు క్షుద్రదేవతోపాసకులు మధ్య మధ్య జై మాతా జై జననీ అంటూ అరుస్తున్నారు. అన్నిటిని మించి ఇరవై, ఇరవై ఐదు జతల మేకలు, గొర్రెలు చిన్నచిన్న బళ్ళల్లో అమ్మవారి పటాలని పెట్టుకుని వూరేగుతున్నై. పూలదండలతో, గజ్జల పట్టీలతో వాటిని అలంకరించారు. కల్లుతో ముఖంకడిగి పసుపు కుంకుమలు పూశారు అవి హృదయ విదారకంగా అరుస్తున్నై, తమ ప్రాణాలతోనేకాక గానంతో కూడా దేవతలని తృప్తి పరచాలన్నట్టు ఆ బలి పశువులు.

బాణసంచాలతో పోటీ పడుతున్నారు, వొళ్ళు కాల్చుకుంటూ. ఒక్క జాతర చూస్తే చాలు. పదిజన్మలకు సరిపడ అనుభవం గడించవచ్చు. గుండె దిటవులేని వాళ్ళు పిచ్చాసుపత్రికి వెళ్ళవచ్చు. వీళ్లతోపాటు మేమూ తాగితే బాగుండనిపించింది ఆ క్షణాన. మాయక్రమ్మినట్టు సాగిపోయే ఈ మానవ సముద్రాన్ని అదుపులో వుంచటం ఎట్లా ? ఆ రాత్రి గడిస్తే చాలు అని చేష్టలు దక్కివున్నాం.

వింతగా అంతా సవ్యంగా గడిచిపోయింది. కాని రాణా మనలోకంలో వున్నట్టుగా లేడు. మగతలో తిరుగుతున్నట్టు తిరుగుతున్నాడు. తిండి తిప్పలూ మానేశాడు.

మరునాటి మధ్యాహ్నానికి అందరూ తిరుగుముఖం పట్టారు. కిందటి సాయంత్రం వరకు తేనెటీగల తుట్టెలాగావున్న మైదానం క్రమంగా ఖాళీఔతున్నది. మేము సాయంత్రానికి వెళ్ళటానికి నిశ్చయించుకున్నాం. రిపోర్ట్ రాసి రాణాకి చూపించాను. చదవకుండానే సంతకం చేశాడు. అదేమిట్రా అని అనేలోపలే పోనిమ్మన్నట్టు చెయ్యి ఆడించాడు.

అడంగుకి బయల్దేరేముంది భోజనాలకి కూర్చున్నాం. నేను బతిమాలి రాణాను పిల్చుకొచ్చాను. ఇదే నా ఆఖరి భోజనం అంటూ వచ్చి కూర్చున్నాడు. ఆఖరి క్షణాన రాణా నన్ను



రెండు బుజాల మీద చేతులేసి గట్టిగా వాటేసుకున్నాడు. కళ్లల్లో నీటిపొర కనపడ్డది. నేను చకితుడినైనాను. ఏమిటి రాణా అంటూ వుండగానే "చూడు సారథీ, నేనీ జాతర చూసినాక ఈ బలులన్నిటికీ మూలపుటమ్మ కలకత్తా కాళిని చూద్దామనుకుంటున్నాను. ఇటునించే వెళ్తున్నాను. రిపోర్ట్ నీవే ఇచ్చెయ్యి" అన్నాడు.

"అదేమిటి రాణా. ఇంత సలక్షణంగా జాతర జరిపించిన నీవు బాస్‌కి కనపడితే ఎంతో మెచ్చుకుంటాడు కదా ? ఎంత అభివందిస్తాడో!"

రాణా ముఖం నెత్తురు కమ్మింది. కళ్ల మండిపోతున్నై. వెంటనే సర్దుకుని "కాదులేరా ఇటే వెళ్తాను. జాతర పూర్తి కావటానికి అమ్మవారికి నరబలి కూడా వుంటే బాగుంటుంది. ఆ సంగతి చూడాలి."

"మరి పిస్టల్ ఇస్తావా … లేనప్పుడది నీ దగ్గర వుండకూడదు కదా హెడ్డాఫీసులో అప్పగిస్తాను."

"కాదులేరా. నేను తీసుకున్నాగా. నేనే పని

నరమేధం

ముగిసినాక అప్పగిస్తా రాణాని మర్చిపోకు'' అంటూ వడివడిగా వెళ్లిపోయినాడు.

నా మనసంతా వికలమయింది. హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ బాస్ కిచ్చాను. బాస్ మెచ్చుకొని, రాణా రానందుకు బాధపడ్డాడు. డ్యూటీలో లేనప్పుడు పిస్టల్ తీసికెళ్లినందుకు రాణామీద కొంచెం కోపం కూడా వచ్చింది

వారమయింది. రాణా రాలేదు కాని నాకో రిజిస్టర్డ్ పార్సిల్ అందింది. అందులో రాణా పిస్టల్, అతని డైరీ, నాకో వుత్తరం వున్నై ఉత్తరం విప్పాను.

సారథీ !

ఇది నీకు చేరే వేళ్టికి నేనుండనురా. పిస్టల్‌తో ఇక పనిలేదురా అమ్మవారి జాతరలోని ఆఖరి ఘట్టం నరబలి నాతో పూర్తవుతుంది. ఈ నరమేధం స్వయంగా ఇచ్చుకోవాలనుకున్నా. మానవుడిలో వున్న పైశాచిక ప్రవృత్తికి నన్ను నేను ఆహుతి చేసుకుంటున్నానురా. జాతర సవ్యంగా గడిచిపోవటానికి నా మనస్సాక్షిని చంపుకున్నాను. ఆత్మ వంచనకు మించిన నరకం మరొకటి లేదురా సారథీ. నన్ను నేనే చంపుకున్నట్లే కదా. జీవచ్ఛవాన్నైనాను ఇంక నా బతుకు వ్యర్థం. నా ఆశయాలకు విరుద్ధంగా ప్రవర్తించవలసి వచ్చింది. అందుకే ఈ నరమేధం. దిగులు పడకు. నా జీవితం వ్యర్థం కాకుండా సార్థకం కాబోతున్నందుకు సంతోషించు ......''

నాకు దుఃఖం ఆగడం లేదు. గట్టిగా యేడవటానికి నా మగపుటక అడ్డం వొచ్చింది. అవన్నీ తీసుకుని బాస్ గదిలోకి పరిగెత్తాను. వాటిని ఆయన టేబుల్‌మీద పెట్టి కుర్చీలో కూలబడ్డాను — ముఖం చేతుల్తో కప్పుకుని, ఏడుపుని గొంతులోనే అణచివేస్తూ.

''ఏమయింది సారథీ,ఏమైంది మై సన్'' అంటూ అడుగుతున్న బాస్‌కి అవి చూపించాను.

ఉత్తరం చదివి బాస్ నిర్వీణ్ణుడైనాడు. ఆయన కళ్లలో నీళ్లు చూశాను. అప్పటిదాకా రాణా అంటె బాస్‌కి ఇష్టమని తెలుసు కాని మరీ ఇంత అని తెలియదు. నేనింక నిలదొక్కుకోలేక బల్లమీద వాలి ఏడ్చేశాను. బాస్ తన వ్యధని మనసులోనే నిగ్రహించుకుని నా తల మీద చెయ్యేసి సేద తీర్చాడు. వేడి కాఫీ తెప్పించి తను తాగుతూ నాచేత తాగించాడు.

బాస్ వుత్తరం తీసుకుని చదవటం ప్రారంభించాడు

''విపరీతమైన ఆందోళనతో నిస్సహాయతతో హెడ్‌క్వార్టర్స్‌కి వచ్చాను. కాని దురదృష్టం నన్ను వదల్లేదు. బాస్ కూతురికి యాక్సిడెంటై బాస్ ఇంటికి వెళ్లాడు. మహేంద్ర ఆ కుర్చీలో వున్నాడు, ప్రాణాలన్నీ చంపుకుని అక్కడి పరిస్థితి ఎంత భయానకంగా వుందో చెప్పి ఇంకా సిబ్బందిని, మరికొన్ని పిస్టల్స్‌ని, టియర్‌గాస్ గుళ్లని ఇవ్వమని అడిగాను. మహేంద్ర తనకు నామీద వున్న కసినంతా వెళ్లకక్కాడు. నన్ను పిస్టల్ వుపయోగించలేని పిరికిపందనన్నాడు, అసమర్థుడ..''బాస్ ఇంక చదవలేక చేతుల్లో తల పెట్టుకుని '' ఓరి ద్రోహీ '' అంటూ కళ్లు మూసుకున్నాడు.

నేను మెల్లగా ''చదవండిసార్ అన్నాను.''

''అసమర్థుడవన్నాడు. పిస్టల్ తన కాళ్ల దగ్గర పడేసి గాజులు తొడుక్కోమన్నాడు నా కద్దు వస్తావా, ఇంతతో నీ పని సరి. ఓడిపోయిన చవట వెధవ్వన్నాడు ఇంక భరించ లేకపోయినానురా. ఇంక ప్రభాకర్ సంగతి తెలిసిందేకదా వెంటనే వచ్చి మీకు ముఖం చూపలేక, సిగ్గుతో కుంచించుకుపోతూ ఆసాముల దగ్గర వసూలు చేశాను. ఎవరి మామూళ్లు వాళ్లకిచ్చేశానురా, ప్రభాకరంతో సహా. తరవాత తెలిసింది వాళ్లే ఒక ముఠాని బందిపోట్ల కింద, ఇంకో ముఠాని నక్సలైట్లుగా తెచ్చి ప్రచారం చేశారని ! ఘటాన్ని దాచి అల్లరి చేయించింది కూడా వాళ్లేరా. డబ్బుతో అందరి నోళ్లూ కట్టేశాను. మూసేశాను.

జాతర శాంతంగా గడిచిపోయింది కదూ ? గ్రాండ్ సక్సెస్ అని బాస్ కూడా కంగ్రాట్యులేట్ చేసి వుంటాడు. ఔనా ? కాని పిస్టల్ మీద చెయ్యి వేసినప్పుడల్లా చెయ్యి బొబ్బలెక్కినట్టు అయ్యేది మహేంద్ర మాటలు నన్ను కాల్చేస్తున్నై నా పంచ ప్రాణాలు, నా ఆత్మ గౌరవం, ఒక్కమాటలో చెప్పాలంటే నన్ను నేను చంపుకుని డబ్బు వసూలు చేశానురా సారథీ.

ఆ పిస్టల్‌కి అగౌరవం జరగకూడదు. దానికి శాంతి నా ప్రాణమేరా. కలకత్తా వెళ్లాను. కాళీదేవిని చూశాను. తాగిన నెత్తురు చాలనట్టు నాలిక జాపింది ఊఁ నాదీ తాగమన్నాను. అంతే

హౌరా బ్రిడ్జి మీద నుంచుని పిస్టల్‌తో కాల్చుకుంటాను. పిస్టల్, డైరీ, వుత్తరం నీకు పంపమని రాసిపెట్టాను ఒక పోలీస్ ఇటు వస్తుండగా ఆ పని చేస్తాను.

నువ్వు వేరెదైనా వుద్యోగంలో చేరు, జంగయ్య మాటలు అక్షరాలా నిజంరా సారథీ. ఈ నా నరమేధంతో కనీసం నీ బోటి కొందరైనా బాగుపడాలని నా కోరిక నా ఆవేదనరా. ఇంక వుంటారా సారథీ.

నీ రాణా

నా కళ్లు నీళ్లు కారిపోతున్నై. బాస్ చదవడం ఎప్పుడాపాడో గమనించలేదు. బుజం మీద చెయ్యేసి ''సారథీ! ప్లీజ్ కంపోజ్ యువర్ సెల్ఫ్, శలవు పెట్టి కొన్నాళ్లు తిరిగి రా'' అంటూ బాస్ గబగబా బైటికి నడిచాడు.

కాని ఎన్ని శలవలైతే మాత్రం నేనీ ''నరమేధం'' మరుస్తాను. ★

'ఉత్తరాలు' శీర్షికకి రాసేవారు

తమపేరు, పూర్తి చిరునామా తెలుగు లిపిలో రాయాలని మనవి చేస్తున్నాము.

—సంపాదకుడు.

డాక్టరు సలహాలు
డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

టి. వి. ఎస్. — ఆత్మకూరు

మా అన్నయ్యకు రెండు సంవత్సరముల వయస్సు నుండి బొడ్డు లావుగా వుంటోంది. ఒకరోజు బొడ్డు దగ్గర నెప్పివస్తే డాక్టరు దగ్గర చూపించాము డాక్టరు ఆపరేషన్ చెయ్యాలన్నారు. ఆపరేషన్ వలన ఏమైనా ప్రమాదము వున్నదా ?

★ అంబెలికల్ హెర్నియా అనేది ఎక్కువగా పుట్టుకతోనే ఏర్పడుతుంది మామూలుగా రంధ్రం చిటికెన వేలుకన్నా చిన్నదిగా ఉంటే ఆపరేషన్ అవసరం లేదు పెద్ద రంధ్రం ఉండి, వాపు ఎక్కువగా ఉన్నప్పుడు ఆపరేషన్ చేయవలసి ఉంటుంది ఆపరేషన్ వల్ల ప్రమాదమేదీ లేదు

ఆర్. సిహెచ్. ఎస్ — సాయితారుపేట

నా భార్య వయస్సు 40 సంవత్సరములు. ఆరుగురు సంతానం. రెండు అబార్షన్‌లు అయినవి 1677 లో ట్యూబెక్టమీ అయింది సెర్వైకల్ బయాప్సీలో స్క్వేమస్ సెల్ కార్సినోమా అని రిపోర్టు వచ్చింది. ఆమెకు కె. జి. హెచ్. లో టెలికోబాల్ట్ ట్రీట్‌మెంట్ చేశారు. రెండవ స్టేజీలో ప్రవేశించిందని వైద్యుల అభిప్రాయము. ఇక ముందు చేయవలసిన చికిత్సకు మద్రాసు వెళదామని ఉంది. ఎంత ఖర్చయినా రోగాన్ని నయం చేయించగల అవకాశం ఉందా ?

★ కేన్సర్‌కి, 'రేడియో తేరపీ, ఆపరేషన్ చేసి' ఆ భాగాన్ని తీసివేయటం, రేడియో ఆక్టివ్ అయిసోటోప్‌లు వాడటం ప్రస్తుతం ఉన్న చికిత్సా విధానాలు. ఆపరేషన్ చేయటం అనేది రోగస్థితిని బట్టి, రోగి పరిస్థితిని బట్టి తీర్మానింపబడుతుంది. ఎంత ఖర్చు పెట్టగల స్తోమతు ఉన్నా పై రెండింటిమీద చికిత్స ఆధారపడి ఉంటుంది. మద్రాసులో [అడయార్] కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌తో చూపించటం మంచిదే. కాని అక్కడికి వెళ్ళేటప్పుడు ఇంతవరకు చేసిన చికిత్స రికార్డులు తీసుకువెళ్ళండి.

బి. ఎమ్. — చిత్తూరు

నాకు కుడిచెవి బాగా వినిపించట్లేదు శబ్దం విన్పిస్తున్నా మాటలు అర్థం కావు నాకు చెవుడు వచ్చినప్పటినుండే దృష్టి గూడా తగ్గిపోయింది. కంటి డాక్టరు చేసిన వైద్యముగూడా పని చెయ్యలేదు.

★ మీరు ఇ. ఎన్. టి. వైద్యులకి, న్యూరో సర్జన్లకి చూపించుకోవలసి ఉంటుంది. మెదడులోని నరాల వాపువల్ల, మెదడు పైపొర వాచి తర్వాత తగ్గిపోవటం వల్ల ఇలా ఏర్పడే అవకాశం ఉంటుంది.

పి. హెచ్. ఎస్. — ప్రొద్దుటూరు

నా వయస్సు 29 సంవత్సరములు. 6 సంవత్సరములుగా నేను డ్యుయోడనల్ అల్సర్‌తో బాధ పడుతున్నాను. రెండు సంవత్సరముల నుండి తలనెప్పి కూడా ప్రారంభమయినది. కళ్ళజోడు గూడా వాడుతున్నాను. అయినా లాభం కనిపించలేదు నెప్పి ముఖ్యంగా కణతలు, గొంతులోనూ, ముక్కుపైన వుంటుంది. ఈ తలనెప్పి రావటానికి, డ్యుయోడనల్ అల్సర్‌కి ఏమైనా సంబంధము వున్నదా ?

★ డుయోడినల్ అల్సర్‌కీ తల నెప్పికీ సంబంధం లేదు. మీకు ఉన్న తలనెప్పి మైగ్రైన్ అయి ఉంటుంది. న్యూరాలజిస్టుల సలహాపై మందులు వాడటం మంచిది. వారు ఇ. ఇ. జి. మొదలయిన వాటి సహాయం వల్ల రోగ నిర్ధారణ చేస్తారు. ★

నా విదేశయాత్ర

బర్క్లే. కాలిఫోర్నియా, అక్టోబరు 7 : — ప్రస్తుతము నేను కాలిఫోర్నియా విశ్వవిద్యాలయములో చేరితిని. ఇచట దాదాపుగ 6( )(మంది విద్యాభ్యాసము చేయుచున్నారు. వీరిలో సగము మంది స్త్రీలు. కొన్ని కొన్ని పాఠములకు అయిదారువందలమంది సహితము కలరు ఇట్టి చోట స్త్రీలొక ప్రక్కను, పురుషులొక ప్రక్కను కూరుచుండెదరు. వారు తెలివి కలవారా వీరు తెలివి కలవారా యను ప్రశ్నకు నేనిపుడు సమాధానము వ్రాయజాలను. వేషమునందు మాత్రము స్త్రీలే మించియున్నారు. ఎప్పుడు చూచినను, సంవత్సరము పొడుగున పురుషులొక్క విధమగు నల్లని దుస్తులనే ధరింతురు. ఇక స్త్రీలన్నచో వారి యలంకారములకు మితిలేదు. ఎరుపు, తెలుపు, పసపు, నలుపు, గులాబీ, ఎన్నియో రంగు రంగుల దుస్తులొకసారి కంటికి గోచరమగును. ఇన్ని వేలమంది స్త్రీలున్నను, అర్థరాత్రమునందు సహితము వారొంటరిగ విశ్వవిద్యాలయము యొక్క ఆవరణమునను బోవుచున్నను, వారి గౌరవమునకే విధమగు లోపమును సంభవింపదు. ఎప్పుడైనను, కొంచెము వేళాకోళము మొదలైనవి జరిగినను వీనినంత తప్పుగ నెంచవలసిన పనిలేదు. అయిదారువందల మంది యొక గదిలోనికి బోవునపుడును, బయటకు వచ్చునపుడును కొంచెము వారు వీరు త్రోసికొన్నను ఎవరిదారిని వారే పోవుదురు. ఈ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయము బర్క్లే అను పట్టణమునందున్నది. ఇది మంచి యారోగ్యకరమగు ప్రదేశమని వాడుక. విశ్వవిద్యాలయ మందిరములు కొన్ని కొండల నానుకొనియున్నవి కొండలు పచ్చని చెట్లచే గప్పబడి, కొద్దిపాటి మంచు పడుచు కన్నుల పండువుగా నుండును. సముద్రముకూడ పట్టణము దాపుననేయున్నది. ఇచ్చట తూర్పు తీరమునందలి న్యూయార్కు, చికాగో, బోస్టన్ మున్నగు పట్టణములలోవలె వేసవికాలమున మిక్కుటమగు ఎండలు, వర్ష కాలమున అధికమగు వానలు, చలికాలమున విపరీతమగు చలిలేవు. మొత్తమున మనదేశములో కంటె చలి అధికమనియే చెప్పవచ్చును. దాదాపుగ ఉదకమండలము రీతిగా నుండునని చెప్పిన మన వారికి బోధపడగలదు. మంచుకూడ నిచ్చట అంతగా లేదు. ఉన్ననాడు విశ్వవిద్యాలయము నందలి పెద్ద గోపురము, పెద్ద పెద్ద చెట్లు, మందిరములు అన్నియు మూసుకొని పోవును. మొదటి రోజున నా కంతయు నూతనముగనే యుండెను. ఏ పాఠమున కేమందిరమునకు బోవలయునో, ఏ మందిర మెక్కడ కలదో తెలియనే తెలియకుండెను. అందువలన విద్యార్థుల నడుగనలసి వచ్చెను. ఒకరితో నొకరు అంతగా మాటలాడకపోయినను, పనివచ్చి పలుకరించి నపుడు మాత్రము అమెరికా విద్యార్థులు సవినయముగ ప్రవర్తించెదరు. కాలిఫోర్నియా రాష్ట్రములో ఆసియాఖండ వాస్తవ్యులన్న అంత యిష్టములేదని వాడుక. ఈ నలుపు తెలుపు వర్ణముల భేదములు విశ్వవిద్యాలయములో రవంతయు కనపడదు. ఏ దేశమువాడైనను, ఏ రంగువాడైనను తోడి విద్యార్థులందఱు పరస్పర గౌరవ భావములతోడనే ప్రవర్తించెదరు.

సర్కారులవలన స్థాపింపబడిన కళాశాలలందును, విశ్వవిద్యాలయములందును, ఆయా రాష్ట్రవాసులకు జీతములు లేనేలేవు. అంతయు నుచితమే. విదేశస్థులకు మాత్రము వారి వారి యిష్టానుసారముగ జీతము లేర్పరుపబడియున్నవి. ఇక్కడ సాధారణముగ ప్రతి విద్యాలయమును విద్యను గఱపుటయే కాదు, బిరుదులిచ్చుటకును అధికారము కలిగియున్నది. పాఠములన్నియు ఆంగ్ల భాషయందే జరుగును. ఆయా విషయమునకు సంబంధించిన పండితులాయా నిర్ణయ సమయములందు వచ్చి యుపన్యాసము లిచ్చుచుందురు. విద్యార్థులందలి ముఖ్యవిషయములను వ్రాసికొనవలయును. విషయమునకు సంబంధించిన పుస్తకములు కూడ ముందుగనే చెప్పుదురు. కొన్ని పాఠముల పరీక్ష వారమున కొకసారియు మఱికొన్ని నెలకొకసారియు జరుగును.




పెద్ద పరీక్ష సెషన్ చివరి భాగమున వచ్చును. పగలు 8 గంటలు మొదలు రాత్రి 10 గంటల వఱకు పాఠములు జరుగుచునే యుండును. ఎవరికెపుడు వీలుగా నుండునో అప్పుడు విద్యార్థులు పోవుచుందురు. మన వీలునుబట్టి పాఠములు జరుగునని తలచరాదు. ఆయా విషయముల నిర్ణయ సమయమును బట్టియే విద్యార్థులు పోవలసి యుందురు.

అమెరికా దేశపు విద్యాలయములలో ముఖ్యముగా రెండు మూడు క్రొత్త సంగతులు మనదేశీయులకు కనపడును. ఒకటి వైద్య సహాయము. మఱియొకటి స్నానమునకు సదుపాయము. ఇంకొకటి పుస్తక పఠనాలయము. విద్యార్థుల నెల్లరు బహు కఠినమైన పరీక్ష చేయుదురు. ఈ పరీక్ష నాడి గుండెలు చూచుట మాత్రమే కాదు. దిగంబరులనుగా నొనర్చి కండ్లు, నోరు, సర్వావయవములు పరీక్షించెదరు. ఏ రోగము వచ్చినను వైద్యాలయములో విద్యార్థుల కుచితముగ మందులియ్యబడును. చాల రోజులకు గాని కుదరని రోగమైన యెడల విద్యార్థులు రోజున కింత చొప్పున, కొద్దిపాటి మొత్తము నియ్యవలయును. సామాన్యపు జబ్బులకు వారము రోజుల వఱకు వైద్యాలయములో హాయిగా నుండవచ్చును. స్నానముల నిమిత్తమై పెద్ద భవనము కట్టియున్నారు. అక్కడ వేడినీళ్లు, చన్నీళ్లు, తువాళ్లు, సబ్బు అన్నియు అమర్పబడియుండును పుస్తకములు, దుస్తులు పెట్టుకొనుటకు చిన్న అరలున్నవి. ప్రొద్దున 8 మొదలు, సాయంకాలము అయిదున్నరలోగా, వీలునుబట్టి యెవరి యిష్టము వచ్చినంతసేపు వారు స్నానము చేయవచ్చును. ఈతలు కొట్టుటకా మందిరము లోపలనే కోనేరులున్నవి. ఈత కూడ పాఠములలో నొకటి గొట్టములు త్రిప్పినచో, ఏ నీరు కావలసిన ఆ నీరు తుంపరులుగా వచ్చి పడుచుండును. బయటకుపోయి స్నానము చేయవలసి వచ్చినచో 10 అణాలకు తక్కువలేదు. ఇది విద్యార్థుల కెంత సదుపాయమో చెప్పజాలను. పుస్తకపఠనాలయములో ప్రొద్దున మొదలు రాత్రి 10 గంటల వఱకు పోయి చదువుకొనవచ్చును. కాని, దీనికి తీరిక మాత్రము ఉండవలయును రాత్రి భోజనములు చేసి స్త్రీలు పురుషులు అందఱుకలిపి 10 గంటలవఱకచ్చట చదువుకొనుచునే యుందురు. బల్లలు, కుర్చీలు, విద్యుద్దీపములు, అన్నియు నచ్చట అమర్చబడియున్నవి. చలిలేకుండా ఆవిరిగొట్టములు పెట్టినారు. విద్యార్థులకు పాఠముగా నిర్ణయింపబడు వెలగల పుస్తకములు, ఒకటి రెండు, కాదు. విద్యార్థుల సంఖ్యనుబట్టి తెప్పించి యుంచెదరు.

విశ్వవిద్యాలయ ప్రారంభ దినమున ప్రెసిడెంటుగారి హితోపదేశము వినుటకు అయిదారువేల విద్యార్థులు గ్రీకు నాటకశాలలో సమావేశమైరి. స్త్రీలు వారికి సహజమగు రంగు

రంగుల దుస్తులతో సభనలంకరించిరి. పురుషులు వారికి సహజమగు నల్లటి దుస్తులను వేసికొని యుండిరి. ఈ ఆరువేలు చప్పట్లు కొట్టినపుడు ఆకాశం చిల్లిపడునట్లుండెను. మొదటి రోజున, ఈ సంవత్సరమే విశ్వవిద్యాలయములో ప్రవేశించిన విద్యార్థులు, కోట్లు తలక్రిందులుగా తొడిగి, అనగా గుండీల భాగము వెనుకకు వెనుక భాగము ముందునకునుబెట్టి, పాటలు పాడుచు, చప్పట్లు కొట్టుచు తిరిగిరి. ఇట్లే ప్రతీ సంవత్సరము జరుగును. ఆ రోజుననే రివాజు ప్రకారము, ఒక విద్యార్థిని పట్టి గుడ్డలు, పుస్తకములతో సహా ఒక మురికి గుంటలో లేవకుండ త్రొక్కిరి. అంత త్రొక్కనను పాప మా విద్యార్థి యేమియు పలుకలేదు. ఆ బాధ నంతయు నతడు ఓపికతో భరించెను. సాధారణముగ ప్రతి సంవత్సరము మొదటి సంవత్సరపు విద్యార్థులకును, రెండవ తరగతి వారికిని జగడము జరుగుచునేయుండును. ఒకరినొకరు తన్నుకొన్నను, మన దేశములోవలె నుపాధ్యాయులతో చెప్పకొనుట, అంతట వారు పెద్ద విచారణ చేసి విద్యార్థులకు జరిమానాలు విధించుట, లేక వారిని పాఠశాలనుండి తొలిగించుట మొదలైన పనులేమియు నిక్కడ జరుగవు. చేతనైన ఒకతన్ను తిరిగి తన్నుదురు. లేదా మాటలాడకుందురు. మొత్తమున నిక్కడి విద్యార్థుల కెక్కువ ఓపిక్కలదని చెప్పవచ్చును. ఉపాధ్యాయులు కూడ, అనగా పెద్ద పెద్ద పండితులు సుమా, విద్యార్థుల మనస్సునుబట్టియే ప్రవర్తించెదరు. ప్రొఫెసరు బారోసు పొలిటికల్ ఎకానమీయశాఖకు అధిపతులు. ఈయన మాకు ఐరోపా రాష్ట్ర తంత్రమును బోధించుచున్నారు. ఒక నాడీయన యేదియో పనిచేత రాలేక ఒక ట్యూటరును పంపిరి. అంతట విద్యార్థులు చేసిన యల్లరికి మితిలేదు. చప్పట్లు కొట్టిరి. బుస్సులు కొట్టిరి. అల్లరిమాట లాడిరి. అంత అల్లరి చేయుచున్నను, ఆతడొకమాట పలుకక వీరితోబాటు తానును నవ్వుచు నిలువబడి, గోల అణగిన తరువాత పాఠము సాగించెను. ఆయన కొంచెము కోపగించి యుండినయెడల విద్యార్థులందఱు లేచిపోయి యుందురు. ఇక్కడ ఉపాధ్యాయులన్న మన దేశములోవలె మొగము తప్పించి తిరుగ నక్కరలేదు. ఉభయ పక్షముల వారికిని పరస్పర వాత్సల్య మధికము. ప్రొఫెసరు ప్లెన్ పబ్లికు ఫైనాన్సులో పేరుచెందినవాడు. వయస్సునందును పెద్దయే. ఈయన యెదుట క్లాసులో విద్యార్థులు కాళ్లుచాచి, కుర్చీలపైన నిగిడ్చి కూరుచుండుట వాడుక. ఇట్లు మన దేశమునందు చేసినయెడల అది పెద్ద తప్పిదము. గురు ధిక్కారము.

మా విశ్వవిద్యాలయములో పాఠములు ప్రారంభమైన పది రోజుల కొక చిత్రమైన తంతు జరిగినది. మొదటి యేటి విద్యార్థు



లందఱు పట్టణములోని ప్రాత, క్రొత్త దేవదారు పెట్టెలను చెక్కలను గ్రీకు నాటక శాలలోనికి చేర్చిరి. మోటారు బండ్లు తీసికొనిపోవుట, అక్కడ చెక్కలను వేయుట, తిరిగి కళాశాలలో దింపుట, ఈ పనులన్నియు నాచారము ప్రకారము విద్యార్థులే చేయవలయును. వీని నన్నిటిని చేర్చి రాత్రి 7 మొదలు 10 గంటల వఱకు పెద్ద మంట వేసిరి. యూనివర్సిటీ బ్యాండు విద్యార్థులు సుస్వరములు వాయించుచూ నడచుచుండ వేలకొలది విద్యార్థులు రణగొణ ధ్వనులు చేయుచు సభామందిరమున సమావేశమైరి. అక్కడి నుండి విద్యార్థులు, పాటలు, పద్దెములు, మొదలగు వానిని సాగించిరి. కేకలనగా వెర్రికేకలు కాదు. ఆ సమయమున చెప్పవలసిన మాటలు కొన్ని యున్నవి. ఆ మాటలను పలువురు విద్యార్థులు డ్రిల్లులోవలె హస్తములు త్రిప్పుచు, గోల పెట్టుదురు. ఆసమయమున యూనివర్శిటీ ప్రొఫెసరు కూడ వచ్చి విద్యార్థులకు స్వాగతమొసగిరి.

ఆంధ్రపత్రిక
1916 నవంబరు 29
సంచిక నుంచి

అమెరికా దేశములో మన దేశములో లేని వస్తువు లేమి దొరుకును? కూరలున్నవా? బాడుగలు చౌకయేనా? మున్నగు ప్రశ్నలు మన వారు సాధారణముగ వేయుదురు. మన దేశములో లేని వస్తువొకటియునిచ్చటలేదు. అక్కడకును, నిక్కడకును ఒక భేదము మాత్రమున్నది. ఇక్కడ ప్రతి వస్తువుకును తగనిధర. మన దేశములో రూపాయకు దొరుకునది ఇక్కడ మూడు రూపాయలు! మన దేశములో మంగలి వానికి అణా, అర్ధణా, తుదకు కాని డబ్బు! ఇక్కడ గెడ్డము గీయుటకు 10 అణాలు, వెంట్రుకలు కత్తిరించుటకు రూపాయి, ఇక చాకలివానికి సామాన్యపు షర్టునకు అయిదణాలు, లాగునకు 10 అణాలు. ఉన్నికోటు లాగునకు మూడు రూపాయలు. షాపునకు పోయిన యెడల 0–2–6కు తక్కువ ధరగల వస్తువ యుండదు. మన దేశములోవలె తెల్లకాగితము లిచ్చటలేవు. ఇక అద్దెలుచూడుడు. ఒక చిన్న గదికి 15 రూపాయలు. మంచి గదియైనచో 25, 30 రూపాయలు! కూరలు కూడ కొంచెమ్మ్రియము. అయినను మన దేశములోవలె సర్వము దొరకును. కాకరకాయలు, బెండ కాయలు, బీర కాయలు, గుమ్మడి కాయలు, సొర కాయలు, పచ్చిమిరప కాయలు, వంకాయలు, మజ్జిగ అన్నియునున్నవి. పాలు పండ్లు మాత్రము అన్నిటి కంటెను చౌక, కాలిఫోర్నియా రాష్ట్రము ముఖ్యముగా ఫలములకు ప్రసిద్ధికెక్కియున్నది. ఇక్కడి నారింజపండ్లకు గింజలులేవు. ద్రాక్ష పండ్లకు, ఆపిలు పండ్లకు మితిలేదు. దుస్తుల ధర చెప్పజాలను. మన దేశములో సాధారణముగా 30 రూపాయలకు వచ్చు కోటు లాగు, ఇచ్చట 100 రూపాయలు పెట్టినగాని రావు.

అవటపల్లి నారాయణరావు



హైదరాబాద్ నోట్‌బుక్

ఖీలాఙ్ భాసా ఖీలాఙ్ బంసా :

ఫిబ్రవరి 15న కళాభవన్‌లో శ్రీ మండలి వెంకట కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశం ఛలోక్తులతో, హాస్యాలతో రమ్యంగా సాగింది. ఆ సమావేశానికొక విశిష్టత వుంది. విదేశాలలోని తెలుగువారితో విద్యా, సాంస్కృతిక వైవాహిక సంబంధాలు దృఢతరం చేసుకోడానికి తెలుగూస్ ఎబ్రాడ్ సర్విస్ కేంద్ర అనే నూతన సంస్థ ప్రారంభోత్సవం, మలేషియా ఆంధ్ర నాయకుడు శ్రీ మదిని సోమనాయుడు కుమారుడు శ్రీ భానుతేజ, అతని నవ వధువు సౌ. హరిప్రియులను ఆశీర్వదించడం, శ్రీ సోమనాయుడును, లండన్‌లో ఆంధ్ర సంఘం స్థాపించి పెక్కు సంవత్సరాలు సేవ చేసిన శ్రీ విశ్వనాథ శ్రీకృష్ణదేవరాయలను, న్యూయార్క్ ఆంధ్ర ప్రముఖులు శ్రీ ఎ. సత్యనారాయణను సన్మానించడం ఆ సమావేశంలో జరిగాయి. ఈ సంస్థకు అధ్యక్షులు శ్రీ మండలి. ఉపాధ్యక్షులు శ్రీకృష్ణదేవరాయలు. సమావేశ కర్త శ్రీ బి. కృష్ణంరాజు. నూతన దంపతు లిద్దరూ డాక్టర్లు, వధువు తండ్రి యోగేశ్వర రావు రాష్ట్ర ప్రభుత్వోద్యోగి; తల్లి శ్రీమతి కామేశ్వరమ్మ. వధూవరులను శ్రీయుతులు జె. బాపురెడ్డి, దేవులపల్లి రామానుజరావు, బోయి భీమన్న, పి. ఎస్. ఆర్. అప్పారావు, ప్రహ్లాదరావు, జి. వి. సుబ్రహ్మణ్యం, ఇరివెంటి కృష్ణమూర్తి, లక్ష్మణరావు, శ్రీమతులు లత, రాజకుమారి (ఎం.ఎల్.ఏ.) కస్తూరిబాయి; రత్నపాప ఆశీర్వదించారు. శ్రీమతి రాజకుమారి తన ప్రసంగంలో కట్నాలు కోరకపోతే కావలసినంతమంది వధువులను తెస్తానన్నారు. ఈ సత్కార్యానికి తెలుగుదేశం ప్రభుత్వం కూడ తోడ్పడగలదని ఆమె అంటూ, విదేశాలలో హిందూదేవాలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం ధన సహాయం చేయాలని తాను పట్టుపట్టానని, విదేశీయులు మన దేశంలో తమ మత ప్రచారానికి కోట్ల డబ్బు తెస్తుండగా మనం విదేశాలలో మన మత ప్రచారానికి ఎందుకు ధన సహాయం చేయరాదు— అని ప్రశ్నించారు. శ్రీమతి లత తమ ప్రసంగంలో కొత్త చరిత్రాంశం తెలిపారు. విజయనగర సార్వభౌముడైన కృష్ణదేవరాయలు కమ్మవారని. ఈ సంగతిని చరిత్ర విద్వాంసులు పరిశీలించాలి. శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తి తమ ప్రసంగంలో అంతర్జాతీయ వివాహాలు— ముఖ్యంగా తెలుగువారు విదేశీయులను వివాహమాడడం శ్రీ అడవి బాపిరాజు తమ ప్రతి నవలలోను ఊహించారని, ఆయన ఊహలు నేటికి నిజమవుతున్నాయని అనడం ఆయన (కృష్ణమూర్తి) ప్రత్యుత్పన్నమతిత్వాన్ని చాటింది. శ్రీ మదిని సోమనాయుడు ప్రసంగం అత్యద్భుతంగా ఉంది. ఆయన ఒక్క ఆంగ్ల పదమూ వాడకుండా ప్రసంగించి సన్మానానికి తన కుమారుని, కోడలిని ఆశీర్వదించినందుకు ధన్యవాదాలర్పించారు. మా మలేషియా భాషలో ఒక సామెత వుంది— ఖీలాఙ్ బాసా, ఖీలాఙ్ బంసా అని. అంటే భాష నశిస్తే వంశం నశిస్తుంది అని దాని అర్థం. మలేషియాకు తెలుగువారు క్రీస్తుకు ముందూ, తర్వాతనూ వచ్చి, రాజ్యాలు స్థాపించారు, వర్తక వాణిజ్యాలు చేశారు. క్రమంగా వాటిని కోల్పోయారు. బ్రిటిషు వారి కాలంలో తెలుగువారు కూలీలుగా మలేషియా చేరారు. వారికి తగిన చదువు చట్టుబండలూ లేనందున నేను 1956 లో ఆంధ్ర సంఘం స్థాపించి, కార్యదర్శిగా వుండి 27 సంవత్సరాలు సేవచేసి, తెలుగువారిలో జాగృతి కలిగించాను. అక్కడి తెలుగువారిలో చదువుకొన్న మహిళలు తక్కువగా వున్నందున తెలుగు యువకులు తమిళులను, మలేషియా వారిని పెళ్ళాడుతున్నారు. తల్లి అన్యభాషదైతే పిల్లలుకూడా ఆ భాషవారయి పోతున్నారు. దానితో తెలుగు భాష ఆ వంశంలో క్షీణించి, వంశమే మారిపోతూంది. మలేషియా సామెతకు ఉదాహరణ ప్రాయమయింది. అందువల్ల మేము ఒక వివాహ సంస్థను స్థాపించాము. చదువుకొన్న తెలుగు కన్యలను కోడళ్ళుగా చేసుకొనడానికి ప్రయత్నిస్తున్నాము. రెండు దశాబ్దాల క్రితం మలేషియాలో రెండు వందల తెలుగు పాఠశాలలుండేవి. తగిన తెలుగు పాఠ్య పుస్తకాలు లేనందున తెలుగు పాఠశాలలు మూతబడి తెలుగు విద్యార్థులు తమిళాది ఇతర భాషలు చదువుతున్నారు. కనుక ఆంధ్రప్రదేశ్ మాకు చేయవలసిన మహోపకారం తెలుగు పాఠ్య పుస్తకాలు పంపడం. సంవత్సరానికి వేయి, రెండు వేల రూపాయల పుస్తకాలు పంపితే చాలు—అని సోమనాయుడు అన్నారు. ఈ సహాయాన్ని తెలుగువారు గట్టిగా చేయాలి. శ్రీ విశ్వనాథ శ్రీకృష్ణదేవరాయలు తమ కృతజ్ఞతా సమర్పణ ప్రసంగంలో తెలుగుదేశం వారు ఏ దేశంలోవున్నా ఆ దేశం పట్ల బేసిక్ లాయల్‌టీతో ప్రవర్తించాలని శ్రీ దేవులపల్లి రామానుజరావు చేసిన సూచనను ప్రస్తావించి, తెలుగువారు ఏ దేశంలో వున్నా ఆ దేశ నియమ నిబంధనలకు కట్టుబడి వుంటారనీ, కాని తెలుగు సంస్కృతిపైన, తెలుగు భాషపైన మమకారం మాత్రం తగలబెట్టినా పోదని, దీనికి కారణం ప్రేమ అని అన్నారు. తాము ఆయా దేశాల రాజకీయాలలో తల దూర్చడం లేదని, అక్కడివారితో స్నేహ సద్భావాలతో మెలగుతున్నామని అంటూ బ్రిటిష్ వారిలాగ మనం కూడ మనవారిని ప్రేమించడం నేర్చుకోవాలంటూ ఒక ఉదంతం చెప్పారు. టర్కీలో ఒక ఆంగ్ల యువకుణ్ణి అరెస్టుచేశారు. అతన్ని విడిపించేవరకు బ్రిటిష్ పార్లమెంటు సభ్యులూ, బ్రిటిష్ ప్రధాని కూడ తహతహలాడారు. బ్రిటిష్‌వారి ప్రేమ గొప్పది—అన్నారు. శ్రీయుతులు సీతా అనసూయల మంగళార తులతో సమావేశం సమాప్తమైంది. మండలి వారి చేవాసి మంచిది. ఈ నూతన సంస్థ మూడు పూవులు ఆరకాయలుగా పెంపొంద గలదని ఆశిస్తున్నాను.

ఉపశ్రుతి :

కొత్తగా ఉద్యోగంలో చేరాను. ఎంతో అనుభవం గలవారు గదా! ఏమైనా సలహా లిస్తారా ?— అనడిగాను స్వాతంత్ర్యానంతరం ఢిల్లీకి వలసవచ్చిన ఒక మహా పత్రికారచయితను. బౌద్ధులత్రిరత్నాలలాగ ఏ ఉద్యోగికైనా మూడే సూత్రాలు. ఇచ్చింది పుచ్చుకోడం, నచ్చినట్టు పని చేయడం; వచ్చినట్టు పడి వుండడం— అని ఆయన ఉపదేశ ముద్రతో అన్నారు.

— తిరుమల రామచంద్ర ★

మచిలీపట్నంలో ఇటీవల తమ నాట్యావధాన షష్టి ప్రదర్శన పూర్తి మహోత్సవ సందర్భంగా సన్మానింపబడి "నాట్యావధాన సరస్వతి" బిరుదు నందుకున్న శ్రీ స్వర్ణరాజు హనుమంతరావు.



ఉత్తరాలు

[4వ పేజీ తరువాయి]

మనం సాధిస్తున్న అభివృద్ధి

10–2–84 సంచికలో న్యూఢిల్లీ లేఖ విమర్శాత్మకంగా ఉంది. డా|| జయ్‌దుబాషీగారు భారతదేశం పారిశ్రామికంగా వెనుకపడుటకు గల కారణాలను చక్కగా వివరించారు. 1960లో ప్రపంచంలో 10వ పారిశ్రామిక దేశమైన భారతదేశము 81కి 22వ స్థానానికి పడిపోవుటకు మన స్వార్థ రాజకీయ నాయకులే కారణం. మెదడకు పదును పట్టే ఆలోచనలను కలుగచేసే రచనలు ఇకముందు దుబాషీగారు ఇంక బాగా రాయాలని ఆశిస్తూ నా అభినందనలు తెలుపుతున్నాను.

చుండూరి వీరయ్యచౌదరి, హైదరాబాద్.

ప్రయోజనాత్మకం

గత 2 సం||రముల నుండి ఆంధ్రపత్రిక పాఠకులమైన మమ్మల్ని ఎంతో ఆసక్తితో చదివేటట్లు చేస్తున్న మీకెంతో కృతజ్ఞతలు. ప్రచురించే ప్రతి కథకి ఏదో ఒక ఉద్దేశ్యం (సమాజానికి హితం జరగాలని) కళ్ళకు కట్టినట్లుగా ఉంటున్నవి. డా|| జయ్‌దుబాషీగారి న్యూఢిల్లీ లేఖ, బులుసు వెంకట రమణయ్యగారి ధర్మపథం శీర్షికలు చాలా బాగుంటున్నాయి న్యూఢిల్లీ లేఖ ద్వారా ప్రపంచ జ్ఞానాన్ని అందిస్తున్న డా|| దుబాషీగార్కి కృతజ్ఞతలు

జి శివశంకరప్రసాద్, ఇతరులు,
రామగిరి–508002

ఖమ్మంజిల్లా కార్టూనిస్టులకు మనవి

ఖమ్మంజిల్లాలో గల కార్టూనిస్టులందరను సంఘటితపరిచి 'ఖమ్మంజిల్లా కార్టూనిస్ట్స్ అసోసియేషన్'ను ఏర్పాటు చేయదలచాము. కావున దయవుంచి ఖమ్మంజిల్లాలోని కార్టూనిస్టులందరు తమ తమ చిరునామాలను వీలయినంత త్వరలో పంపగోరుతున్నాము. ఇతర వివరాలకు స్వంత చిరునామా గల కవరును జతపరచగలరు. ఖమ్మంజిల్లా కార్టూనిస్టులు మాత్రమే చిరునామాలను పంపవలసినది. చిరునామాలను, ఇతర వివరాలకు — పి. వి. రామనాధరావు, కార్టూనిస్టు, ఆజాద్‌రోడ్, మధిర–507203కి పంప ప్రార్థన. ★

Printed and Published by S Nageswara Rao at The Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3
Editor S Radhakrishna

ట్రైలో


ఉపయోగించడానికి మీకొక మంచి కారణం:



ఇతర ప్రముఖ డిటర్జెంట్ బిళ్లలకన్న
దీని ధర 30% తక్కువ.

ఇవిగో, ఇంకా మూడు కారణాలు:


మరింత నురుగు




దీని సమృద్ధమైన నురుగు మరే డిటర్జెంట్ బిళ్లకన్న ఎక్కువ బట్టలను శుభ్రం చేస్తుంది.

మరింత ఉతికే శక్తి

అతిగా మాసిన బట్టల్ని కూడ చక్కగా శుభ్రం చేయగలది ట్రైలో అందులోనే ఉన్న బ్లూ తెల్లటి బట్టలకు వాటి అసలు తెల్లదనపు మెరుపు తెస్తుంది.



మరింత మన్నిక



ట్రైలో సులువుగా మెత్తబడిపోదు. అందుకే అందులో వృథాపోయేది ఎంత మాత్రం ఉండదు. పూర్తిగా అరిగిపోయేదాకా ట్రైలోను వాడవచ్చు.

ట్రైలో — <u>మరింత</u> ఉపయోగకరమైన నీలి డిటర్జెంట్ బిళ్ల.

Godrej ఉత్పాదన

CHAITRA-GS-188 FEL

Regd. No. H/VJ-41 ANDHRA SACHITRA VARA PATRIKA

